www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

MEDICOVER HOSPITALS SECUNDERABAD

MEDICOVER HOSPITALS SECUNDERABAD

మంగళవారం | 16-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 169 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: దశమి రా.12.22 తదుపరి ఏకాదశి; నక్షత్రం: ఆర్ద్ర ఉ.6.46 తదుపరి పునర్వసు; వర్జ్యం: రా.6.36-8.10, దుర్ముహూర్తం: ఉ.8.32-9.20, రా.10.06-10.52, అమృతఘడియలు: తె.4.04-5.38, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 6.06, సూర్యాస్తమయం: 6.12 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

‘ప్లేయర్ ఆఫ్ ద మంత్’ సిరాజ్



దుబాయ్: భారత పేసర్ మహ్మద్ సిరాజ్ ఆగస్టు మాసానికిగాను ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ద మంత్‌గా ఎంపికయ్యాడు. వాస్తవానికి ఆగస్టు నెలలో అతను ఒక్క టెస్టే ఆడాడు. ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌లోని ఆఖరిదైన ఐదో టెస్టులో సిరాజ్ ఏకంగా 9 వికెట్లు పడగొట్టి భారత్‌ను గెలిపించాడు. తద్వారా సిరీస్ కూడా 2-2తో సమమైంది. ఈ అద్భుత ప్రదర్శనతో అతడు న్యూజిలాండ్ పేసర్ మ్యాట్ హెన్రీ, వెస్టిండీస్ పేసర్ జేడెన్ సీల్స్‌ను వెనక్కి నెట్టి పురస్కారం అందుకున్నాడు. అటు ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ద మంత్‌గా ఎంపిక కావడం గర్వంగా ఉందని సిరాజ్ తెలిపాడు.

శ్రీలంక కష్టంగా..

ఆసియా కప్‌లో నేడు

అఫ్ఘానిస్తాన్ x బంగ్లాదేశ్

రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

పోరాడి ఓడిన హాంకాంగ్ ● ఆసియాకప్



నిస్సాంక (68)

దుబాయ్: తాజా ఆసియాకప్‌లో తొలిసారిగా ఉత్కంఠభరిత మ్యాచ్ చోటుచేసుకుంది. సోమవారం శ్రీలంకతో జరిగిన గ్రూప్ ‘బి’ మ్యాచ్‌లో హాంకాంగ్ చివరి వరకు పోరాడింది. అయితే ఆఖర్లో హసరంగ (9 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 20 నాటౌట్) స్వేచ్ఛగా ఆడడంతో మరో ఏడు బంతులుండగా 4 వికెట్ల తేడాతో లంక గట్టెక్కింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హాంకాంగ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 149 పరుగులు చేసింది. నిజాకత్ ఖాన్ (52 నాటౌట్) అజేయ అర్ధసెంచరీ సాధించగా, ఓపెనర్ అన్షుమన్ రథ్ (48) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఈ జోడీ మూడో వికెట్‌కు 61 పరుగులు జోడించింది. పేసర్ చమీరకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో లంక 18.5 ఓవర్లలో 153/6 స్కోరుతో నెగ్గింది. నిస్సాంక (68) అర్ధసెంచరీతో రాణించాడు. డెత్ ఓవర్లలో వేగంగా వికెట్లు కోల్పోయిన లంక ఓటమి దిశగా సాగింది. కానీ 18వ ఓవర్‌లో హసరంగ సిక్స్‌తో 14 రన్స్ రావడంతో మ్యాచ్‌పై హాంకాంగ్ పట్టు చేజారింది. అలాగే ఈ మ్యాచ్‌లో ఆరు క్యాచ్‌లు జారవిడవడంతో ఆ జట్టు మూల్యం చెల్లించుకున్నట్టయ్యింది.

సంక్షిప్త స్కోర్లు: హాంకాంగ్: 20 ఓవర్లలో 149/4 (నిజాకత్ 52 నాటౌట్, అన్షుమన్ 48; చమీర 2/29). **శ్రీలంక:** 18.5 ఓవర్లలో 153/6 (నిస్సాంక 68, హసరంగ 20, పెరీర 20; ముర్తజా 2/37).

ఒమన్‌పై యూఏఈ గెలుపు

- వసీం, షరాఫు అర్ధ శతకాలు
- సూపర్-4కు భారత్

ఆసియా కప్



వసీం (69)

అబుధాబి: కెప్టెన్ మహ్మద్ వసీం (69), అలీషాన్ షరాఫు (51) అర్ధ శతకాలతో రాణించడంతో.. ఆసియా కప్‌లో యూఏఈ బోణీ చేసింది. గ్రూప్-ఎలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో 42 పరుగుల తేడాతో ఒమన్‌పై గెలిచిన యూఏఈ సూపర్-4 అవకాశాలను సజీవంగా నిలబెట్టుకొంది. కాగా, ఈ మ్యాచ్ ఫలితంతో భారత్ మరో మ్యాచ్ మిగిలుండగానే సూపర్-4 బెర్త్‌ను ఖరారు చేసుకొంది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన టీమిండియా నాలుగు పాయింట్లతోపాటు మెరుగైన రన్‌రేట్‌తో టాప్‌లో ఉంది. తొలుత బ్యాటింగ్ చేసిన యూఏఈ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 172 పరుగులు చేసింది. జితెన్ రామనంది రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఛేదనలో ఒమన్ 18.4 ఓవర్లలో 130 పరుగులకు కుప్పకూలింది. ఆర్యన్ (24), కెప్టెన్ జతిందర్ సింగ్ (20), వినాయక్ శుక్లా (20) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు.

సంక్షిప్త స్కోర్లు: యూఏఈ: 20 ఓవర్లలో 172/5 (వసీం 69, షరాఫు 51; జితెన్ 2/24). **ఒమన్:** 18.4 ఓవర్లలో 130 ఆలౌట్ (ఆర్యన్ 24, జతిందర్ సింగ్ 20, శుక్లా 20; జునైద్ 4/23).

వైశాలి..చరిత్ర సృష్టించింది

- టైటిల్ నిలబెట్టుకున్న భారత జీఎం
- ‘క్యాండిడేట్స్’కు క్వాలిఫై ● స్విస్ గ్రాండ్ ప్రీ చెస్



సమర్‌కండ్ (ఉజ్బెకిస్థాన్): భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్. వైశాలి చరిత్ర సృష్టించింది. స్విస్ గ్రాండ్ ప్రీ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్ నిలబెట్టుకుంది. ఇక పురుషుల టైటిల్‌ను అనీష్ గిరి (నెదర్లాండ్స్-8 పాయింట్లు) అందుకున్నాడు. తమిళనాడుకు చెందిన వైశాలి సోమవారం ఇక్కడ జరిగిన 11వ, ఆఖరి రౌండ్‌ను ప్రపంచ మాజీ చాంపియన్ టాన్ జోంగ్యీతో డ్రా చేసింది. దాంతో మొత్తం 8 పాయింట్లతో వైశాలి విజేతగా నిలిచింది. తద్వారా 2023లో గెలిచిన ఈ టైటిల్‌ను ఆమె నిలబెట్టుకుంది. అంతేకాదు హంపి, దివ్యాదేశ్‌ముఖ్ తర్వాత ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నీకి అర్హత సాధించిన మూడో భారత మహిళగా ఘనత సాధించింది. ఇక..ఈసారి స్విస్ చాంపియన్‌షిప్ రన్నరప్‌గా నిలిచిన లగ్నో (రష్యా) కూడా క్యాండిడేట్స్ టోర్నీ బెర్త్ ఖాయం చేసుకుంది. ద్రోణవల్లి హారిక (6.5) ఆఖరి రౌండ్‌లో కరీసా ఇప్‌పై నెగ్గింది. గ్రాండ్‌మాస్టర్ అర్జున్ 11వ రౌండ్‌ను విన్సెంట్ కీమర్‌తో డ్రా చేశాడు. కీమర్‌తోపాటు రెండో స్థానంలో నిలిచిన మథియాస్ పురుషుల విభాగం నుంచి క్యాండిడేట్స్ చెస్‌కు అర్హత సాధించాడు.

డుప్లాంటిస్ 14వసారి..

- వరల్డ్ రికార్డు తిరగరాసిన పోల్‌వాల్ట్ స్టార్
- ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్



టోక్యో: స్వీడన్ పోల్ వాల్ట్ స్టార్ అర్మాండ్ డుప్లాంటిస్ 14వ సారి ప్రపంచ రికార్డును తిరగరాశాడు. వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో సోమవారం జరిగిన పురుషుల పోల్‌వాల్ట్ ఈవెంట్‌లో డుప్లాంటిస్ మూడో, ఆఖరి ప్రయత్నంలో 6.30 మీటర్ల ఎత్తు దూకి మూడోసారి వరల్డ్ టైటిల్‌ను సొంతం చేసుకొన్నాడు. ఈ క్రమంలో హంగేరిలో జరిగిన ఈవెంట్‌లో తన రికార్డు 6.29 మీటర్లను అధిగమించాడు. సోవియట్ యూనియన్ మాజీ పోల్‌వాల్టర్ సెర్గీ బుబ్కా 13 సార్లు ప్రపంచ రికార్డును తిరగరాశాడు. ఇప్పుడు డుప్లాంటిస్ అతడిని అధిగమించాడు.



మారథాన్‌లో ఫొటో ఫినిష్..: పురుషుల మారథాన్‌లో 100 మీ. తరహా ఫొటో ఫినిష్ ఔరా అనిపించింది. 42.195 కిలోమీటర్ల రేస్‌లో అల్ఫోన్సో ఫెలిక్స్ శింబు (టాంజానియా) 0.05 సెకన్ల తేడాతో స్వర్ణం ఎగరేసుకుపోయాడు. పెట్రోస్ (జర్మనీ-2 గంటల 09:48 సె) రజతం, అవాని (ఇటలీ-2:09:53) కాంస్యం దక్కించుకొన్నారు.

శ్రీశంకర్, తేజస్, పారుల్ విఫలం: భారత అథ్లెట్లు తీవ్రంగా నిరాశపర్చారు. లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్ ఫైనల్స్‌కు అర్హత సాధించడంలో విఫలమయ్యాడు. 3000 మీ. స్టీపుల్ ఛేజ్‌లో పారుల్ చౌదరి, అంకిత హీట్స్‌లోనే వెనుదిరగ్గా..110మీ. హర్డిల్స్‌లో తేజస్ షిర్సే సెమీస్‌కు క్వాలిఫై కాలేకపోయాడు.

తెలుగు టైటాన్స్ ఓటమి

జైపూర్: ప్రొ.కబడ్డీ లీగ్‌లో సోమవారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ ఓటమి పాలైంది. ఉత్కంఠభరితంగా సాగిన పోరులో బెంగళూరు బుల్స్ 34-32తో తెలుగు టైటాన్స్‌పై నెగ్గింది. బెంగళూరుకు ఇది వరుసగా నాలుగో విజయం కావడం విశేషం. మరోవైపు తెలుగు టైటాన్స్‌కిది వరుసగా రెండో పరాజయం. అంతకుముందు హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో హరియాణ స్టీలర్స్ 40-37తో గుజరాత్ జెయింట్స్‌పై నెగ్గింది.

కరచాలన వివాదం!



ఐసీసీకి పాక్ బోర్డు ఫిర్యాదు

రెఫరీ పైక్రాఫ్ట్‌ను తప్పించాలి

లేదంటే ఆసియా కప్ బహిష్కరణ?

పైక్రాఫ్ట్ ఆదేశం మేరకే ఆటగాళ్ల జాబితాను ఇరుజట్ల కెప్టెన్లు పరస్పరం మార్చుకోలేదని పాక్ మేనేజర్ నవేద్ చీమా ఆరోపించాడు. ఈమేరకు అతడు ఏసీసీకి ఫిర్యాదు చేశాడు. అలాగే మ్యాచ్ తర్వాత తమ క్రికెటర్లతో భారత ఆటగాళ్లు కరచాలనం చేయకపోవడం క్రీడా స్ఫూర్తికి విరుద్ధమంటూ మరో ఫిర్యాదునూ ఏసీసీకి పాకిస్థాన్ మేనేజర్ చేశాడు.



ఆండీ పైక్రాఫ్ట్

దుబాయ్: ఆసియా కప్‌లో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై విజయానంతరం ఆ జట్టు ఆటగాళ్లతో భారత క్రికెటర్లు కరచాలనం చేయకపోవడం పెద్ద వివాదానికి దారితీసింది. ఈ ఉదంతంపై ఆగ్రహం ప్రకటించిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మ్యాచ్ రెఫరీ ఆండీ పైక్రాఫ్ట్ (జింబాబ్వే)ను ఆ బాధ్యతలనుంచి తప్పించాలని డిమాండ్ చేసింది. లేదంటే ఆసియా కప్‌ను బహిష్కరించాలని పీసీబీ యోచిస్తున్నదనే వార్తలు కూడా వినవస్తున్నాయి. కాగా..టీమిండియా క్రికెటర్లు తమ జట్టుతో కరచాలనం చేయకపోవడాన్ని తీవ్రంగా పరిగణించిన పీసీబీ ఈ విషయంపై ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ)తోపాటు ఐసీసీకి కూడా ఫిర్యాదు చేసింది. అయితే..పీసీబీ చీఫ్ మొహిసిన్ నక్వీయే ఏసీసీ చైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నాడు. అలాగే ఐసీసీకి భారత్‌కు చెందిన జైషా చీఫ్‌గా వ్యవహరిస్తుండడం గమనార్హం. ‘క్రికెట్ స్ఫూర్తికి సంబంధించి ఎంసీసీ నియమావళిని మ్యాచ్ రెఫరీ ఉల్లంఘించాడు. అందువల్ల అతడిపై చర్యలు తీసుకోవాలి’ పీసీబీ చీఫ్ నక్వీ ఎక్స్‌లో కోరాడు. అయితే ఆసియా కప్‌తో ఐసీసీకి సంబంధంలేదు. ఇది ఏసీసీ నిర్వహించే టోర్నీ. అలాంటప్పుడు ఐసీసీకి పీసీబీ ఫిర్యాదు చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కాగా టీమిండియా చర్యకు బదులుగా..మ్యాచ్ అనంతరం జరిగిన బహుమతి ప్రదాన కార్యక్రమాన్ని పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ ఆఘా బహిష్కరించాడు.

పైక్రాఫ్టే సూచించాడు..: భారత కెప్టెన్‌తో కరచాలనం చేయొద్దని టాస్ సమయంలో పాకిస్థాన్ సారథి సల్మాన్ ఆఘాకు పైక్రాఫ్ట్ సూచించినట్టు పీసీబీ ఆరోపించింది.



నక్వీతో నో..?

పాకిస్థాన్‌కు చెందిన మొహిసిన్ నక్వీ ఈనెల 28న జరిగే ఫైనల్ అనంతరం బహుమతి ప్రదాన వేదికమీద ఉంటారు. ఒకవేళ టీమిండియా ఫైనల్‌కు చేరితే మొహిసిన్ నక్వీతో కలసి మన ఆటగాళ్లు వేదికను పంచుకోవాల్సివుంటుంది. మన టీమ్ గెలిస్తే ఏసీసీ చైర్మన్‌గా విజేత జట్టుకు నక్వీయే ట్రోఫీ ప్రదానం చేయాల్సివుంది. అదే జరిగితే భారత్ నక్వీతో కలిసి వేదికను పంచుకోబోదని అంటున్నారు. మరి ప్రత్యామ్నాయంగా గంభీర్ జట్టు ఏం చేస్తుందో వేచి చూడాల్సిందే.

సరైన సమాధానమిచ్చాం : సూర్యకుమార్

‘ప్రత్యర్థి జట్టుతో కరచాలనం చేయకూడదని ముందుగానే నిర్ణయం తీసుకున్నాం. మేం వారికి సరైన సమాధానమే ఇచ్చాం’ అని మ్యాచ్ అనంతరం జరిగిన మీడియా సమావేశంలో అడిగిన ప్రశ్నకు టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ బదులిచ్చాడు.

‘చైనా మాస్టర్స్’పై లక్ష్య, సాత్విక్ గురి

షెన్‌జెన్: చైనా మాస్టర్స్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టైటిల్‌పై భారత షట్లర్లు లక్ష్యసేన్, సాత్విక్ సాయిరాజ్ జోడీ గురి పెట్టారు. మంగళవారం షెన్‌జెన్ వేదికగా ఈ పోటీలు ప్రారంభమవనున్నాయి. ఇటీవల ముగిసిన హాంకాంగ్ ఓపెన్‌లో సేన్ ఫైనల్ చేరి రన్నరప్‌గా నిలిచాడు. ఫామ్ కోల్పోయిన తర్వాత గత రెండేళ్లలో ఒక ప్రధాన టోర్నీలో సేన్ ఫైనల్ చేరడం అదే తొలిసారి. డబుల్స్‌లో ఈ సీజన్‌లో ఆరు టోర్నీల్లో సెమీస్, హాంకాంగ్ ఓపెన్‌లో ఫైనల్ చేరిన సాత్విక్ జోడీ సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతోంది. మహిళల సింగిల్స్‌లో 30 ఏళ్ల పీవీ సింధు, డబుల్స్‌లో రుతపర్ణ, శ్వేతపర్ణ, మిక్స్‌డ్‌లో రోహన్-రుత్విక శివానీ, ధ్రువ్-తనీషా జోడీలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు.

విజేత సెంట్రల్ జోన్

ఫైనల్లో సౌత్‌పై గెలుపు ● దులీప్ ట్రోఫీ

బెంగళూరు: పదకొండేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత సెంట్రల్ జోన్ జట్టు దులీప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఫైనల్లో సోమవారం ఆఖరి రోజు సెంట్రల్ ముందు సౌత్ జోన్ కేవలం 65 పరుగుల లక్ష్యాన్ని మాత్రమే ఉంచగలిగింది. ఈ ఛేదనను సెంట్రల్ 20.3 ఓవర్లలో ముగించింది. అయితే సౌత్ బౌలర్ల ధాటికి నాలుగు వికెట్లు కోల్పోవడం గమనార్హం. అంతకుముందు సౌత్ రెండో ఇన్నింగ్స్‌లో 426 పరుగులకు ఆలౌటైంది. అంకిత్ శర్మ (99), సిద్ధార్థ్ (84), స్మరణ్ (67) అర్ధసెంచరీలు సాధించారు. కార్తికేయకు 4, సారాంశ్‌కు 3 వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో సౌత్ 149, సెంట్రల్ 511 పరుగులు చేశాయి.

టెకీలకు హైదరాబాద్‌లో భలే గిరాకీ



బెంగళూరు కంటే ఎక్కువ జీతాలు

కలిసి వస్తున్న అంశాలు

- బెంగళూరుతో పాటు హైదరాబాద్ వైపు చూస్తున్న టెక్ కంపెనీలు
- బెంగళూరుతో సమానంగా అభివృద్ధి చెందుతున్న మౌలిక సదుపాయాలు
- ప్రభుత్వ సానుకూల విధానాలు
- టాప్ టాలెంట్‌ను ప్రధాన నగరాలన్నిటిలోనూ మోహరించాలనే కంపెనీల విధానం
- ఏటా మూడు లక్షల మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల అందుబాటు
- దేశ డిజిటల్ టెక్ నైపుణ్యాల్లో 14 శాతం హైదరాబాద్‌లో లభించడం
- హైదరాబాద్‌లో పెరుగుతున్న జీసీసీలు

హైదరాబాద్: టెక్నాలజీ ఉద్యోగాల ముఖచిత్రం మారిపోతోంది. గతంలో టెక్నాలజీ జాబ్స్ అంటే బెంగళూరు. ఇప్పుడు ఈ విషయంలో హైదరాబాద్.. భారత సిలికాన్ వ్యాలీగా పిలిచే బెంగళూరును మించిపోయింది. నిన్న మొన్నటి వరకు బ్యాక్ ఎండ్ ఉద్యోగాలకే పరిమితమైన హైదరాబాద్ తాజాగా ఫ్రంట్‌లైన్ టెక్నాలజీ ఉద్యోగాలకూ కేంద్రంగా మారుతోంది. డేటా ఇంజనీరింగ్, కృత్రిమ మేధ (ఏఐ), ఆర్ అండ్ డీ రంగాల్లో ఈ ఉద్యోగ నియామకాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ రంగాలకు చెందిన సీనియర్లకు కంపెనీలు జీతాలు కూడా బాగానే ఆఫర్ చేస్తున్నాయి. ప్రస్తుతం సీనియర్ సాఫ్ట్‌వేర్ డెవలర్లకు హైదరాబాద్‌లో సగటున రూ.30.4 లక్షల వరకు కంపెనీలు ఆఫర్ చేస్తున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఇది 8.6 శాతం ఎక్కువని కంపెనీలకు నియామకాల సేవలు అందించే టీమ్‌లీజ్ తెలిపింది. ఇదే సమయంలో బెంగళూరులో జీతాల వృద్ధి రేటు 5.6 శాతం మాత్రమే. డేటా ఇంజనీరింగ్, ఆర్ అండ్ రంగాల్లో పనిచేసే టెకీల సగటు జీతాలూ హైదరాబాద్‌లో గత ఏడాది కాలంలో 11.1 శాతం పెరిగి రూ.20 లక్షలకు చేరాయి. బెంగళూరుతో పోలిస్తే ఇది 4.6 శాతం ఎక్కువ.

4 నెలల గరిష్ఠానికి టోకు ద్రవ్యోల్బణం

ఆహార, తయారీ వస్తువుల ధరల పెరుగుదలతో ఆగస్టు నెలలో టోకు ద్రవ్యోల్బణం నాలుగు నెలల గరిష్ఠ స్థాయి 0.52 శాతానికి చేరింది. అయితే ఇంధనం, విద్యుత్ విభాగంలో మాత్రం ద్రవ్యోల్బణం తగ్గింది. టోకు ద్రవ్యోల్బణం గత రెండు నెలల తిరోగమన స్థితి నుంచి బయటపడి ఎగువకు కదిలింది. టోకు ద్రవ్యోల్బణం జూలైలో (-) 0.58% ఉండగా జూన్ నెలలో (-) 0.19% ఉంది.

వచ్చే ఏడాది ఐపీఓకి మెడికవర్ హాస్పిటల్స్

MEDICOVER HOSPITALS

- 2025-26లో రూ.2,000 కోట్ల టర్నోవర్ లక్ష్యం
- డిసెంబరు నాటికి కోకాపేట్ హాస్పిటల్ రెడీ
- నేడు సికింద్రాబాద్ హాస్పిటల్ ప్రారంభం
- మెడికవర్ సీఎండీ అనిల్ కృష్ణ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న మెడికవర్ హాస్పిటల్స్ వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. కార్యకలాపాల విస్తరణతో పాటు రుణ భారాన్ని తగ్గించుకునేందుకు ఐపీఓకి రావాలని భావిస్తున్నట్లు మెడికవర్ హాస్పిటల్స్ సీఎండీ అనిల్ కృష్ణ వెల్లడించారు. ఐపీఓలో భాగంగా పూర్తిగా కొత్త ఈక్విటీ షేర్లను జారీ చేయాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు. హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ విలువను 100 కోట్ల డాలర్లు (రూ.8,800 కోట్లు) లెక్కగట్టే అవకాశం ఉందన్నారు. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో హాస్పిటల్ టర్నోవర్ రూ.1,850 కోట్లుగా ఉండగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో దీన్ని రూ.2,000 కోట్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అనిల్ తెలిపారు. కాగా మెడికవర్ రుణ భారం రూ.1,000 కోట్ల వరకు ఉందని ఆయన చెప్పారు. ప్రస్తుతం మెడికవర్.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటకల్లో కార్యకలాపాలు సాగిస్తోంది.

రూ.250 కోట్లతో విస్తరణ

విస్తరణలో భాగంగా ఈ ఏడాది సికింద్రాబాద్, కోకాపేట్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో కొత్తగా రెండు మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు అనిల్ కృష్ణ వెల్లడించారు. ఇందులో రూ.100 కోట్ల పెట్టుబడితో 300 పడకల సామర్థ్యంతో సికింద్రాబాద్ హాస్పిటల్‌ను, రూ.150 కోట్లతో 500 పడకలతో కోకాపేట్ హాస్పిటల్‌ను నెలకొల్పుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కోకాపేట్ హాస్పిటల్ డిసెంబరు నాటికి అందుబాటులోకి రానుండగా సికింద్రాబాద్ హాస్పిటల్‌ను ఈ నెల 16న (మంగళవారం) ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే చందానగర్ హాస్పిటల్ సామర్థ్యాన్ని 150కి పడకలను పెంచనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కొత్త హాస్పిటల్స్‌తో మొత్తం పడకల సంఖ్య 6,400కు చేరుకోనుండగా దేశవ్యాప్తంగా ఆస్పత్రుల సంఖ్య 25కు చేరుకుంటుందన్నారు. కాగా రానున్న రోజుల్లో మెట్రో నగరాలైన బెంగళూరు, పుణెల్లో కొత్త హాస్పిటల్స్ ఏర్పాటుతో పాటు ద్వితీయ శ్రేణి నగరాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు అనిల్ తెలిపారు.

బిజినెస్

‘క్యాష్‌లెస్’ సేవలు పునరుద్ధరించాలి

- స్టార్ హెల్త్‌కు ఏహెచ్‌పీఐ వినతి

న్యూఢిల్లీ: స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు.. సంస్థ నెట్‌వర్క్ హాస్పిటల్స్ మధ్య వివాదం మరింత ముదిరింది. తన నెట్‌వర్క్‌లోని కొన్ని హాస్పిటల్స్‌లో నగదు రహిత (క్యాష్‌లెస్) వైద్య సేవలను స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ నిలిపి వేయడంపై అసోసియేషన్ ఆఫ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ ఆఫ్ ఇండియా (ఏహెచ్‌పీఐ) తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. వెంటనే ఈ సేవలను పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. స్టార్ హెల్త్ నిర్ణయంతో రోగులు నగదు రహిత సేవలు అందక మానసిక, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలిపింది. ఈ ప్రభావం వైజాగ్‌లోని రాంనగర్‌లో ఉన్న కేర్ హాస్పిటల్‌పైనా పడింది. క్లెయిమ్స్‌కు సంబంధించిన వివాదాలతో స్టార్ హెల్త్‌కేర్ ఇన్సూరెన్స్ రెండు రోజుల క్రితం ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. అయితే ఈ వార్తలపై స్టార్ హెల్త్ అధికారికంగా నోరు మెదపడం లేదు.

రిలయన్స్ రూ.21,000 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్ మరోసారి పెద్దమొత్తంలో నిధులు సమీకరించింది. మూడు ట్రస్టుల ద్వారా 240 కోట్ల డాలర్లు (సుమారు రూ.21,000 కోట్లు) సమీకరించింది. ఇందులో నాలుగింట మూడు వంతుల నిధులను ఆదిత్య బిర్లా సన్ లైఫ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ, హెచ్‌డీఎఫ్‌సీ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ, నిప్పాన్ లైఫ్ ఇండియా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ, ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ కంపెనీలు సమకూర్చాయి. రిలయన్స్ గ్రూప్ నిర్వహణలోని మూడు ట్రస్టులు పాస్ త్రూ సర్టిఫికెట్ల జారీ ద్వారా ఈ నిధులు సమీకరించాయి.

ఆగస్టు ఎగుమతుల్లో 6.7% వృద్ధి

న్యూఢిల్లీ: ఎగుమతుల రంగం ఆగస్టులో పుంజుకుంది. వార్షిక ప్రాతిపదికన ఎగుమతులు 6.7% వృద్ధితో 3,510 కోట్ల డాలర్లకు (రూ.3.09 లక్షల కోట్లు) చేరగా దిగుమతులు 10.12% క్షీణించి 6,159 కోట్ల డాలర్లకు (రూ.5.42 లక్షల కోట్లు) తగ్గాయి. ఆగస్టు నెలలో బంగారం దిగుమతులు 56% క్షీణించి స్థూలంగా దిగుమతులు తగ్గేందుకు కారణమయ్యాయి. వాణిజ్య లోటు గత ఆగస్టుతో పోల్చితే 3,564 కోట్ల డాలర్ల (రూ.3.14 లక్షల కోట్లు) నుంచి 26.49 కోట్ల డాలర్లకు (రూ.2.33 లక్షల కోట్లు) తగ్గింది. అమెరికా 686 కోట్ల డాలర్లతో ఎగుమతుల ప్రధాన గమ్యంగా ఉండగా 324 కోట్ల డాలర్లతో యూఏఈ, 183 కోట్ల డాలర్లతో నెదర్లాండ్స్, 121 కోట్ల డాలర్లతో చైనా, 114 కోట్ల డాలర్లతో యూకే తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అమెరికా విధించిన సుంకాల ప్రభావంతో భారత-అమెరికా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. భారత్ దిగుమతి చేసుకున్న దేశాల్లో 1,091 కోట్ల డాలర్లతో చైనా అగ్రస్థానంలో నిలవగా 483 కోట్ల డాలర్లతో రష్యా, 466 కోట్ల డాలర్లతో యూఏఈ, 360 కోట్ల డాలర్లతో అమెరికా, 250 కోట్ల డాలర్లతో సౌదీ అరేబియా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

- కన్స్యూమర్ ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్ 1 ఫైనాన్స్.. హైదరాబాద్‌కు తన కార్యకలాపాలు విస్తరించింది. ఇందులో భాగంగా తన ఫైనాన్షియల్ ప్లానింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఈ సెంటర్ పెట్టుబడులు, ట్యాక్స్ ప్లానింగ్, రుణాలు, రిటైర్మెంట్, ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజరీ సేవలందించనుంది.
- టాటా ఎంటర్‌ప్రైజ్‌కు చెందిన క్విక్ డెలివరీ సంస్థ బిగ్‌బాస్కెట్ కరీంనగర్‌కు తన సేవలను విస్తరించింది. తాజా ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్, పర్సనల్ కేర్ ఉత్పత్తులు సహా 10,000కు పైగా ఉత్పత్తులను 10 నిమిషాల్లోనే డెలివరీ చేయనున్నట్లు ప్రకటించింది. ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరించాలన్న ప్రణాళికలకు అనుగుణంగా కరీంనగర్‌లోకి అడుగుపెట్టినట్లు వెల్లడించింది.

మార్కెట్ ర్యాలీకి బ్రేక్

ముంబై: ఈక్విటీ మార్కెట్లో గత వారం ఏర్పడిన ర్యాలీకి బ్రేక్ పడింది. ఐటీ, ఆటో షేర్లలో లాభాల స్వీకారం సోమవారం మార్కెట్‌ను నష్టాల్లోకి నడిపింది. ఐదు రోజుల ర్యాలీకి తెర దించిన సెన్సెక్స్ 118.96 పాయింట్ల నష్టంతో 81,785.74 వద్ద ముగియగా ఎనిమిది రోజుల ర్యాలీకి తెర దించిన నిఫ్టీ 44.80 పాయింట్ల నష్టంతో 25,069.20 వద్ద ముగిసింది. ఈ వారంలో జరగనున్న అమెరికన్ ఫెడరల్ సమావేశం నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తమై లాభాల స్వీకారానికి దిగారని విశ్లేషకులంటున్నారు.

కెనరా రొబెకో, కెనరా హెచ్ఎస్‌బీసీ ఐపీఓలకు ఓకే: తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) జారీకి కెనరా రొబెకో ఏఎంసీ, కెనరా హెచ్ఎస్‌బీసీ, హీరో మోటార్స్ సహా ఆరు కంపెనీలకు సెబీ ఆమోదం తెలిపింది. అనుమతి పొందిన మిగతా కంపెనీల్లో ఎమ్వీ ఫొటోవోల్టాయిక్ పవర్, ఫైన్ ల్యాబ్స్, మణిపాల్ పేమెంట్స్ అండ్ ఐడెంటిటీ సొల్యూషన్స్, ఎంటీఆర్ ఫుడ్స్ ఉన్నాయి. ఈ కంపెనీలన్నీ రూ.9,000 కోట్లు సమీకరించనున్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




16వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	560
వరంగల్	542	గోదావరి	550
చిత్తూరు	578	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	118	విజయవాడ	140
వరంగల్	118	గుంటూరు	135
కరీంనగర్	118	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	118	చిత్తూరు	127
కర్నూలు	118	నెల్లూరు	132
విశాఖపట్నం	134	అనంతపురం	132
గోదావరి	140		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,11,060 ▼	1,01,800 ▼	1,43,000 ▲
విజయవాడ	1,13,300 ▼	1,07,500 ▲	1,32,800 ▲
విశాఖపట్నం	1,12,850 ▲	1,01,800 ▲	1,43,000 ▲
రాజమండ్రి	1,11,050 ▼	1,01,800 ▼	1,32,000 ▲
ప్రొద్దుటూరు	1,13,550 ▲	1,04,280 ▲	1,32,500 ▲
ముంబై	1,09,511 ▼	1,00,312 ▼	1,27,791 ▼

నవ కల్పనలకు ‘నియంత్రణ’లు వద్దు

- బాధ్యతాయుత ఏఐ వినియోగానికి ఓకే
- ఏఐతో కొన్ని ఉద్యోగాలు పోతాయి
- ఏఐ నైపుణ్యాలతో కొత్త ఉద్యోగాలు
- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: నియంత్రణలు కృత్రిమ మేధ (ఏఐ)తో సహా టెక్నాలజీ రంగంలో అందరికీ ఉపయోగపడే నవ కల్పనలను ప్రోత్సహించేవిగా ఉండాలే తప్ప.. దెబ్బతీసేవిగా ఉండకూడదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఏఐ ఆధారిత టెక్నాలజీలను అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అదే సమయంలో వివిధ రంగాల్లో ఏఐని బాధ్యతాయుతంగా వినియోగించేలా చూసేందుకూ కృషి చేస్తామన్నారు. ‘వికసిత భారత్ కోసం ఏఐ’ పేరుతో నీతి ఆయోగ్ రూపొందించిన ఒక నివేదికను విడుదల చేస్తూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఏఐ ద్వారా ఉత్పాదకతను పెంచుకోవడంపై కంపెనీలు దృష్టి పెట్టాలని కోరారు. ఉద్యోగులకూ ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వాలన్నారు. లేకపోతే పెద్దఎత్తున ఉద్యోగాలు పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ఏఐతో 60,000 కోట్ల డాలర్లు: పరిశ్రమల్లో ఏఐ వినియోగాన్ని వేగవంతం చేస్తే 2035 నాటికి మన జీడీపీ 6.6 లక్షల కోట్ల డాలర్లకు చేరుతుందని నీతి ఆయోగ్ అంచనా. అందులో ఏఐ ద్వారా సమకూరే మొత్తమే 50,000 కోట్ల డాలర్ల నుంచి 60,000 కోట్ల డాలర్ల (ప్రస్తుత మారకం రేటు ప్రకారం సుమారు రూ.44.10 లక్షల కోట్ల నుంచి రూ.52.92 లక్షల కోట్లు) వరకు ఉంటుందని తెలిపింది. ఏఐతో కార్మికుల ఉత్పత్తి సామర్థ్యం కూడా పెరుగుతుందని పేర్కొంది. అంతర్జాతీయంగా చూసినా ఏఐ వినియోగంతో వచ్చే పదేళ్లలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 17 నుంచి 26 లక్షల కోట్ల డాలర్ల మేర పెరగనుందని తెలిపింది. ఇందులో 10 నుంచి 15 శాతం మన దేశం ద్వారా సమకూరే అవకాశం ఉందని అంచనా వేసింది. పెద్ద సంఖ్యలో ఉన్న సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్ గ్రాడ్యుయేట్లు, విస్తరిస్తున్న పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలు, పెరుగుతున్న డిజిటల్, టెక్నాలజీ సామర్థ్యాలు ఈ విషయంలో మన దేశానికి పెద్ద సానుకూల అంశాలని నివేదిక పేర్కొంది. ఏఐతో క్లరికల్, రోజువారీ ఉద్యోగాలు, పెద్దగా నైపుణ్యాలు అవసరం లేని ఉద్యోగాలు పోయినా, కొన్ని కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయని నీతి ఆయోగ్ అంచనా. ఏఐ వినియోగంతో ఆర్థిక సేవలు, తయారీ రంగం బాగా లబ్ధి పొందబోతున్నట్టు తెలిపింది.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



మెట్రో మాకొద్దు!

అప్పులు, అధిక వడ్డీలను భరించలేకపోతున్నాం

రూ.6000 కోట్లు ఇస్తే ప్రాజెక్టు నుంచి తప్పుకొంటాం

మా ఈక్విటీ వాటాను విక్రయించేందుకు సిద్ధం

10

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎల్అండ్‌టీ లేఖ

బకాయిలు ఇవ్వకపోవడంతోనే ఆర్థిక సంక్షోభమని వెల్లడి

భూములను సద్వినియోగం చేసుకుంటే మరింత ఆదాయం.. నిపుణుల వ్యాఖ్య

మంగళవారం | 16-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 169

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, బాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: దశమి రా.12:22 తదుపరి ఏకాదశి; నక్షత్రం: ఆర్ద్ర ఉ.6:46 తదుపరి పునర్వసు; వర్జ్యం: రా.6:36-8:10; దుర్ముహూర్తం: ఉ.8:32-9:20, రా.10:06-10:52; అమృతఘడియలు: తె.4:04-5:38; రాహుకాలం: మ.3:00-4:30; సూర్యోదయం: 6:06; సూర్యాస్తమయం: 6:12

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వక్ఫ్ చట్టంలో కీలక నిబంధనల

నిలిపివేత!

- ఇస్లాంను కనీసం ఐదేళ్లు అనుసరిస్తేనే ఆస్తిని వక్ఫ్‌కు ఇవ్వాలన్న రూలుపై స్టే
- కలెక్టర్ నివేదిక ఇచ్చేదాకా 'వక్ఫ్ ఆస్తి'గా పరిగణించరాదన్న నిబంధనా నిలుపుదల
- ముస్లిమేతరులు కేంద్ర వక్ఫ్ బోర్డులో నలుగురు, రాష్ట్ర బోర్డుల్లో ముగ్గురికి మించరాదు
- సీజేఐ జస్టిస్ గవాయ్ బెంచ్ మధ్యంతర ఆదేశాలు.. మొత్తం చట్టంపై స్టేకు నిరాకరణ
- చట్టాన్ని పూర్తిగా నిలిపివేయడమన్నది అత్యంత అరుదైన కేసుల్లోనేనని వ్యాఖ్య
- చట్టం రాజ్యాంగబద్ధతపై తుది వాదనలకు ఈ ఆదేశాలు అడ్డంకి కావని స్పష్టీకరణ



న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: వక్ఫ్ (సవరణ) చట్టం 2025పై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ చట్టంలోని కొన్ని కీలక నిబంధనలపై స్టే విధించింది. పూర్తిగా చట్టంపై స్టే విధించేందుకు మాత్రం నిరాకరించింది. కనీసం ఐదేళ్ల పాటు ఇస్లాంను అనుసరించిన వ్యక్తి మాత్రమే ఆస్తిని వక్ఫ్ చేయడానికి అవకాశం ఉంటుందన్న నిబంధనను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఒక వ్యక్తి ఇస్లాంను అనుసరిస్తున్నట్లు నిర్ణయించేలా నిబంధనలు రూపొందించే వరకు ఇది అమలు కాదని స్పష్టం చేసింది. చట్టంలోని ఇలాంటి పలు కీలక నిబంధనలను నిలిపివేస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. వక్ఫ్ సవరణ చట్టంలోని కొన్ని సెక్షన్లకు కొంతమేరకు రక్షణ అవసరమని వ్యాఖ్యానించింది. "మొత్తం చట్టంపైనే స్టే విధించాల్సిన అవసరం లేదని గుర్తించాం. అత్యంత అరుదైన కేసుల్లో మాత్రమే అలాంటి పరిస్థితి వస్తుంది. వక్ఫ్ చట్టంపైనే స్టే విధించాలన్న అభ్యర్థనలను తిరస్కరిస్తున్నాం" అని ధర్మాసనం తేల్చిచెప్పింది. అయితే, వక్ఫ్ బోర్డులో ముస్లిం సభ్యుల సంఖ్య కచ్చితంగా మెజారిటీలో ఉండాలని, కేంద్ర వక్ఫ్ బోర్డు లేదా కౌన్సిల్‌లో

మిగతా 2వ పేజీలో...

అవకతవకలు ఉంటే బిహార్ ఎస్ఐఆర్‌ను పక్కనపెడతాం

దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహించకుండా ఈసీని అడ్డుకోబోం: సుప్రీంకోర్టు 2



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, చిత్రంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్, అధికారులు, ఉన్నత విద్యా సంస్థల సంఘాల ప్రతినిధులు

ఉన్నత విద్యా సంస్థలకు

₹600 కోట్లు!

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు సీఎం రేవంత్ ఓకే

- రీయింబర్స్‌మెంట్‌ను ఛిన్నాభిన్నం చేసిన గత సర్కార్
- రూ.వేల కోట్ల భారాన్ని మాకు వారసత్వంగా ఇచ్చారు
- మా ప్రభుత్వానికి విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యం
- ఫీజు రీయింబర్స్‌మెంట్ హేతుబద్ధీకరణకు కమిటీ
- మీడియా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి
- మాపై దయ చూపారు.. సమ్మె విరమిస్తున్నాం
- ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య చైర్మన్ రమేశ్‌బాబు
- నేటి అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ సేవల నిలిపివేత
- నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ ప్రకటన
- 100 కోట్ల రూపాయలు విడుదల చేసిన సర్కారు
- అయినా, మెట్టు దిగని ప్రైవేటు ఆస్పత్రులు

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్నత విద్యాసంస్థల సమ్మె కథ సుఖాంతమైంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలన్న డిమాండ్‌తో ఉన్నత విద్యాసంస్థల సంఘాల సమాఖ్య(ఫాతీ) సోమవారం నుంచి అన్ని కాలేజీలను నిరవధికంగా బంద్ చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. సమస్య తీవ్రత నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సమాఖ్య ప్రతినిధులతో ఆదివారం అర్ధరాత్రి వరకు చర్చలు జరిపింది. సోమవారానికి చర్చల్ని వాయిదా వేసింది. అయితే ముందు ప్రకటించినట్టుగానే సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు కాలేజీలు బంద్ పాటించాయి. చర్చలు ఫలప్రదమైతే సమ్మె విరమిస్తామని, విఫలమైతే కొనసాగిస్తామని సమాఖ్య ప్రతినిధులు ఆదివారం రాత్రే స్పష్టం చేశారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీఎస్ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. యాజమాన్యాల ప్రతినిధులతో జరిగిన చర్చల వివరాలను ముఖ్యమంత్రికి చెప్పారు. ఇప్పటికే హామీ ఇచ్చిన రూ.1200 కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారని తెలిపారు. నెల మధ్యలో ఉన్నందున నిధుల సమస్య ఉందని అధికారులు సీఎంతో చెప్పినట్లు తెలిసింది. తక్షణమే రూ.300 కోట్ల వరకు విడుదల చేయొచ్చని అధికారులు చెప్పినట్లు సమాచారం. అయితే, కనీసం సగం నిధులైనా వెంటనే విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం

మిగతా 12వ పేజీలో...

ఓ దొంగకోళ్ల కేసు..

పోలీస్ ✗ పోలీస్

- ఆంధ్రప్రదేశ్‌లో 4 లక్షల విలువైన నాలుగు పందెం కోళ్ల చోరీ
- ఏలూరు జిల్లాలో ఘటన.. కొత్తగూడెం జిల్లా దమ్మపేటలో కదిలిన డొంక
- విచారణ పేరుతో ఓ ఇంట్లోకి ప్రవేశించి బెదిరించిన ఏపీ పోలీసులు
- వారిని స్టేషన్‌కు తరలించిన స్థానిక పోలీస్
- స్టేషన్‌కొచ్చి తమ బృందాన్ని విడిపించి తీసుకెళ్లిన ఏపీ చింతలపూడి సీఐ

దమ్మపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మంది మార్బలంతో నాలుగు కార్లలో ఏపీ పోలీసులొచ్చి.. ఓ ఇంట్లోకి ప్రవేశించి అక్కడివారిని భయభ్రాంతులకు గురిచేస్తే స్థానికులు తీవ్రంగా ప్రతిఘటించారు. ఆ పోలీసులను తెలంగాణ పోలీసులు స్టేషన్‌కు తరలించారు. చివరికి ఆ ఏపీ స్టేషన్ నుంచి సీఐ స్వయంగా వచ్చి తమ సిబ్బందిని విడిపించుకొని తీసుకెళ్లాల్సి వచ్చింది. ఇంత గలాటా జరిగింది ఓ దొంగకోళ్ల

మిగతా 11వ పేజీలో...

కోటి కార్డులు!

- రికార్డు స్థాయికి చేరిన తెల్ల రేషన్ కార్డులు
- కాంగ్రెస్ సర్కారు ఏర్పడేనాటికి 89,95,282
- కొత్త కార్డుల పంపిణీతో 1,01,22,324కి చేరిన సంఖ్య
- కొత్త రేషన్ లబ్ధిదారులకు దసరా కానుకగా సన్నబియ్యం



హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెల్ల రేషన్ కార్డుల సంఖ్య రాష్ట్రంలో రికార్డు స్థాయికి చేరుకుంది. గడిచిన నెల రోజుల్లో ఏకంగా 1.51 లక్షల కార్డులను పంపిణీ చేయటంతో.. తాజాగా 'కోటి' మైలురాయికి చేరింది. సెప్టెంబరు కోటా ప్రకారం రేషన్ కార్డుల సంఖ్య 99,70,832 కాగా.. ఇప్పుడు 1,01,22,324కు చేరాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిని ఒక రికార్డుగా భావిస్తోంది. కొత్తగా కార్డులు పొందిన కుటుంబాలన్నీ అక్టోబరు నుంచి లబ్ధిదారుల జాబితాలో చేరతాయి. దసరా కానుకగా వీరికి కూడా సన్న బియ్యం పంపిణీ చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలో రేవంత్ సర్కారు ఏర్పడేనాటికి తెల్ల రేషన్ కార్డులపై ఉన్న లబ్ధిదారుల సంఖ్య 2.81 కోట్లు ఉండగా.. ప్రస్తుతం 3.25 కోట్లకు చేరటం గమనార్హం. నిజానికి, రేవంత్ సర్కారు

మిగతా 11వ పేజీలో...



కప్పింది కాంగ్రెస్

కండువానే!

- ఆ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ భేటీల్లోనూ పాల్గొన్నారు
- ఆ పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు
- అభివృద్ధి కోసం కలిసింది కాదు.. ఫిరాయింపే
- రాహుల్‌ని కలిశారు.. ఫొటోలు కూడా దిగారు
- ఎమ్మెల్యేల ఫిరాయింపుపై అసెంబ్లీ అదనపు కార్యదర్శికి ఆధారాలు అందజేసిన బీఆర్ఎస్

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కారు గుర్తుపై గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారని, వారంతా నిరంతరం ఆ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని బీఆర్ఎస్ తెలిపింది. వారు సీఎంను కలిసిన సందర్భంగా కప్పింది కాంగ్రెస్ కండువానేనని స్పష్టం చేసింది. అప్పుడు ఇష్టంగా కప్పుకొని.. ఇప్పుడు మాత్రం జాతీయ రంగులతో ఉన్న కండువా అంటూ బుకాయిస్తున్నారని

మిగతా 11వ పేజీలో...

విదేశీ నిపుణులను

స్వాగతిస్తున్నాం!

- వారిని భయభ్రాంతులను చేయడం మా అభిమతం కాదు
- చిప్స్, సెమీ కండక్టర్లు, కంప్యూటర్లు, షిప్పుల తయారీని విదేశీ ఉద్యోగుల నుంచి మేం నేర్చుకుంటాం: డొనాల్డ్ ట్రంప్
- అక్రమ వలస పేరిట ఇటీవల దక్షిణకొరియా కార్మికుల నిర్బంధం
- అమెరికాలో పెట్టుబడులపై మా సంస్థలు ఆలోచిస్తాయి.. జాగ్రత్త
- దక్షిణ కొరియా హెచ్చరిక.. అమెరికా అధ్యక్షుడి దిద్దుబాటు చర్య



వాషింగ్టన్, సెప్టెంబరు 15: అక్రమ వలసల విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, దక్షిణా కొరియా హెచ్చరికల దెబ్బకు దిగొచ్చారు. తమ దేశ కంపెనీల్లో విదేశీ ఉద్యోగులను స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. వారిని భయభ్రాంతులకు గురిచేయడం తన అభిమతం కానేకాదని అన్నారు. పదిరోజుల క్రితం జార్జియాలో దక్షిణ కొరియాకు చెందిన హ్యుందాయ్ కంపెనీ ప్లాంట్‌లో ఆ దేశ వాసులు అక్రమంగా పనిచేస్తున్నారన్న సమాచారం అందడంతో అక్కడ దాడులు నిర్వహించి.. 475 మందిని నిర్బంధించినట్లు అమెరికా అధికారులు

మిగతా 2వ పేజీలో...

భారత్-అమెరికా మధ్య నేడు వాణిజ్య చర్చలు

భారత్‌ను చర్చలకు వచ్చేలా చేశాం: నవారో 2

సర్కారీ ప్లీడర్ల తొలగింపులో

జోక్యం చేసుకోం

- ప్రభుత్వానికీ.. ప్రభుత్వ లాయర్లకు మధ్య నమ్మకం ముఖ్యం 12
- వారి బకాయిల్ని 2 నెలల్లో చెల్లించాలి
- బీఆర్ఎస్ హయాంలో నియమించిన ప్లీడర్ల తొలగింపు కేసులో సుప్రీం తీర్పు

బండి సంజయ్‌పై కేటీఆర్ పరువు నష్టం దావా 10

150 మీటర్ల ఎత్తుతో

తుమ్మిడిహెట్టి బ్యారేజీ!

- మహారాష్ట్రతో సంప్రదింపులు జరపాలన్న సీఎం రేవంత్
- బ్యారేజీతో ముంపు, నీటి లభ్యతపై అధికారుల కసరత్తు
- 1500 ఎకరాలకు గరిష్ఠ పరిహారం చెల్లించే యోచన
- 80 టీఎంసీలతో ప్రాజెక్టుకు కొత్త డీపీఆర్ రూపకల్పన!
- తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి నీటి తరలింపునకు..
- ప్రభుత్వ పరిశీలనలో రెండు ప్రతిపాదనలు



హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంలో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం.. దీనిని 150 మీటర్ల ఎత్తుతో చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. దీనికోసం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌ను కలిసి సంప్రదింపులు జరపాలని సూచించారు. అయితే మహారాష్ట్ర గతంలో 148 మీటర్లతో బ్యారేజీ నిర్మాణానికి సమ్మతి తెలిపింది. కానీ, దీనివల్ల

మిగతా 11వ పేజీలో...

వీధి దీపాలపై పక్కాగా పర్యవేక్షణ

రాష్ట్రవ్యాప్తంగా ఎల్ఈడీ దీపాలే ఉండాలి 11

అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్

రష్యా కష్టం.. మనకు లాభం!

- ఉక్రెయిన్ దాడులతో దెబ్బతింటున్న రష్యా చమురుశుద్ధి కర్మాగారాలు
- 20% మేర శుద్ధి సామర్థ్యం తగ్గడంతో ఎగుమతులను పెంచిన మాస్కో
- మార్కెట్లో దొరుకుతున్న బ్రెంట్ క్రూడాయిల్ కన్నా తక్కువ ధరకే..
- ఆ చమురును కొని శుద్ధి చేసి, అమ్మి లాభపడుతున్న భారత రిఫైనరీలు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: ఒకరి నష్టం.. మరొకరికి లాభంగా మారుతుంది! ఒకరి సంక్షోభం.. మరొకరికి అవకాశమై సిరులు కురిపిస్తుంది!! నిష్ఠురంగా అనిపించినా ఇది నిజం!! తమపై దండెత్తిన రష్యాను ఆర్థికంగా దెబ్బతీయడమే లక్ష్యంగా ఆ దేశ చమురుశుద్ధి కర్మాగారాలపై ఉక్రెయిన్ జరుపుతున్న డ్రోన్ దాడులు

మిగతా 2వ పేజీలో...

మొదటి పావుగంటలో రిజర్వేషన్లకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

» రైల్వే శాఖ కొత్త రూల్.. అక్టోబరు 1 నుంచి అమలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: టిక్కెట్ల రిజర్వేషన్లలో అక్రమార్కుల ఆటకట్టించడానికి రైల్వేశాఖ మరో నిర్ణయం తీసుకొంది. జనరల్ కోటా టిక్కెట్ల రిజర్వేషన్ల బుకింగ్ కోసం ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ ఓపెన్ అయిన మొదటి 15 నిమిషాల్లో టిక్కెట్లు తీసుకోవాలంటే ఆ వెబ్‌సైట్‌కు ఆధార్ అనుసంధాన్ని తప్పనిసరి చేసింది. అంటే ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌కు ఆధార్‌ను లింక్ చేసుకున్నవారికే మొదటి 15 నిమిషాల్లో టిక్కెట్లు లభిస్తాయి. ఈ నూతన నిబంధన అక్టోబరు ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానుంది. రిజర్వేషన్ల బుకింగ్‌లకు మొదటి 15 నిమిషాల్లోనే డిమాండు అధికంగా ఉండడంతో దాన్ని అక్రమార్కులు అవకాశంగా తీసుకోకుండా ఉండేందుకు ఈ ఏర్పాటు చేసింది. అనంతరం ఆధార్ అనుసంధానం లేనివారు కూడా రిజర్వేషన్లు తీసుకోవచ్చు. ఇంతవరకు తత్కాల్ టిక్కెట్లకే పరిమితమైన నిబంధనను ఇకపై జనరల్ టిక్కెట్లకు కూడా వర్తింపజేసింది. ఉదాహరణకు ఎవరైనా నవంబరు 15 కోసం రిజర్వేషన్లు చేయాలనుకుంటే అందుకు సంబంధించి 60 రోజులు ముందుగా అంటే సెప్టెంబరు 16వ తేదీ ఉదయం 12.20 గంటలకు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ ఓపెన్ అవుతుంది. 12.20 గంటల నుంచి 12.35 గంటల వరకు కేవలం ఆధార్ వెరిఫికేషన్ ఉన్న ప్రయాణికులు మాత్రమే టిక్కెట్లు బుక్ చేసుకోగలుగుతారు. కీలకమైన ఈ 15 నిమిషాల వ్యవధిలో ఆధార్ అనుసంధానంలేని వారికి బుక్ చేసుకునే అవకాశం ఉండదు. పండగ సమయాల్లో టిక్కెట్ల డిమాండు అత్యధికంగా ఉండడాన్ని గమనించి, అక్కడ అక్రమాలు జరగకుండా నిరోధించడానికి ఈ ఏర్పాటు చేసింది. అందువల్ల అక్టోబరు ఒకటో తేదీ లోగా ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌తో ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని ప్రయాణికులకు రైల్వే శాఖ సూచించింది.

ఏఐ కంటెంట్ క్రియేటర్లకు లైసెన్స్!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: ప్రస్తుత ఏఐ యుగంలో ఏ ఫొటో అసలైనదో.. ఏది కృత్రిమ మేధతో సృష్టించిందో, ఏ వీడియో రియల్‌లో.. ఏది ఫేకో గుర్తు పట్టలేని పరిస్థితి తయారైంది. దీంతో, తప్పుడు సమాచార వ్యాప్తి బాగా పెరిగింది. దీన్ని కట్టడి చేసేందుకు కమ్యూనికేషన్స్, ఐటీపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్థాయీ సంఘం కీలక సిఫారసులు చేసింది. ఏఐ కంటెంట్ క్రియేటర్లకు లైసెన్స్ తప్పనిసరి చేయాలని సూచించింది. లైసెన్స్ ఉన్నవారే ఏఐ కంటెంట్ క్రియేట్ చేయాలని, లైసెన్స్ లేకుండా ఏఐ కంటెంట్ రూపొందించి తప్పుడు ప్రచారం చేసేవారిని గుర్తించి శిక్షించేందుకు కఠినమైన నిబంధనలు ఉండాలని పేర్కొంది. దీంతో పాటు, ఏఐతో రూపొందించిన ఫొటో అయినా, వీడియో అయినా, వార్తా కథనం అయినా.. దానికి 'ఏఐతో రూపొందించారు' అని ట్యాగ్ కచ్చితంగా జతచేయాలని సూచించింది. బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే నేతృత్వంలోని స్థాయీ సంఘం ఈ మేరకు ఇటీవల లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు తన నివేదికను అందజేసింది. ఈ సిఫారసులు అమల్లోకి రావాలంటే కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాల్సి ఉంటుంది.

రూ.కోటి రివార్డున్న మావోయిస్టు హతం

రాంచీ, సెప్టెంబరు 15: జార్ఖండ్‌లోని హజారీబాగ్ జిల్లా పంతిత్రి అడవుల్లో సోమవారం జరిగిన ఎదురుకాల్పుల్లో రూ.కోటి రివార్డున్న మావోయిస్టు ఒకరు హతమయ్యారు. అదేవిధంగా మరో ఇద్దరు మావోయిస్టులు కూడా కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారని అధికారులు తెలిపారు. వీరిపైనా రూ.25 లక్షలు, రూ.10 లక్షలు చొప్పున రివార్డులు ఉన్నాయని వెల్లడించారు. జార్ఖండ్ ఐజీ(ఆపరేషన్స్) మైఖేల్ రాజ్ మీడియాతో మాట్లాడుతూ.. "ఇంటెలిజెన్స్ సమాచారంతో హజారీబాగ్, గిరిధి పోలీసులు కోబ్రా దళాలతో పంతిత్రి అడవుల్లో ఆదివారం రాత్రి నుంచి మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో భద్రతా దళాలను చూడగానే సోమవారం ఉదయం 6 గంటల సమయంలో మావోయిస్టులు కాల్పులు జరిపారు. దీంతో భద్రతా దళాలు ఎదురుకాల్పులకు దిగాయి. ఈ ఘటనలో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో రూ.కోటి రివార్డు ఉన్న నిషేధిత సీపీఐ(మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యుడు సహదేవ్ సొరేన్ అలియాస్ ప్రవేశ్, స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడు, రూ.25 లక్షల రివార్డు ఉన్న రఘునాథ్ హెంబ్రం అలియాస్ చంచల్, జోనల్ కమిటీ సభ్యుడు, రూ.10 లక్షల రివార్డు ఉన్న బిర్సేన్ గంఝు ఉన్నారు." అని వివరించారు.

చైనాకు కౌంటర్‌గా ఎత్తైన డ్యామ్!

» అరుణాచల్‌లో దిబాంగ్ ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: చైనా మెగా ప్రాజెక్టుకు కౌంటర్‌గా అరుణాచల్‌ప్రదేశ్‌లో చేపట్టనున్న అతిపెద్ద డ్యామ్ దిబాంగ్ బహుళార్థసాధక ప్రాజెక్టు పనులను భారత్ ప్రారంభించింది. ప్రధాన డ్యామ్ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌హెచ్‌పీసీ లిమిటెడ్ రూ.17,069 కోట్లతో బిడ్ దాఖలు చేసింది. అరుణాచల్‌ప్రదేశ్ సరిహద్దు టిబెట్ భూభాగంలోని యార్లంగ్ త్సాంగ్పో నదిపై చైనా ఒక మెగా ప్రాజెక్టు నిర్మాణ పనులను ప్రారంభించిందన్న వార్తల నేపథ్యంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. భారత్ చేపట్టిన ప్రాజెక్టు.. చైనా డ్యామ్ నుంచి ఒకవేళ అకస్మాత్తుగా నీరు విడుదలైతే ఒక అడ్డుగోడలా నిలుస్తుందని, భారత భూభాగాలు వరద బారిన పడకుండా కాపాడుతుందని భావిస్తున్నారు. భారత వ్యూహాత్మక భద్రతలో భాగమైన ఈ దిబాంగ్ ప్రాజెక్టు నిర్మాణాన్ని టెండర్ ప్రకారం 91 నెలల్లో పూర్తి చేయాలని, 2032 నాటికి అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎన్ఎన్-న్యూస్18 నివేదించింది. 278 మీటర్ల ఎత్తులో ఇది దేశంలోనే ఎత్తైన ఆనకట్ట కానుంది. దీని ద్వారా ఏడాదికి 11,223 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి కానుంది. 2,880 మెగావాట్ల దిబాంగ్ బహుళార్థసాధక ప్రాజెక్టుకు ప్రధాని మోదీ గతేడాది శంకుస్థాపన చేశారు.

75% హాజరు ఉంటేనే పరీక్షలకు అనుమతి


» పది, పన్నెండో తరగతి పరీక్షలపై సీబీఎస్ఈ నిర్ణయం


న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: సీబీఎస్ఈ విద్యార్థులు పది, పన్నెండో తరగతి పరీక్షలు రాయాలంటే ఇకపై 75 శాతం హాజరు తప్పనిసరి. ఈ మేరకు కఠినంగా వ్యవహరించాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నిర్ణయించింది. జాతీయ విద్యావిధానం-2020 ప్రకారం ఇంటర్నల్ అసెస్‌మెంట్ తప్పనిసరి. హాజరుశాతం సరిగా లేని విద్యార్థుల ఇంటర్నల్ అసెస్‌మెంట్ అసాధ్యం కావడంతో సీబీఎస్ఈ బోర్డ్ ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో విద్యార్థుల హాజరు శాతం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. హాజరు శాతం పెరగడం ద్వారా విద్యార్థులు క్లాస్‌రూం కార్యక్రమాలతో ప్రయోజనం పొందుతారని భావిస్తున్నారు.

ఆద్యంతం నిర్లక్ష్యమే..!

» బైక్‌ను ఢీకొట్టిన బీఎండబ్ల్యూ కారు డ్రైవర్ తీరు

» నిందితురాలి అరెస్టు..





నవ్‌జ్యోతి సింగ్, గగన్‌ప్రీత్ కౌర్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: శరీరం గగుర్పొడిచే రీతిలో నిర్లక్ష్యంగానూ, వేగంగానూ బీఎండబ్ల్యూ కారు నడిపి వ్యక్తి మరణానికి కారణమైన వ్యక్తి తీరు అద్యంతం అనుమానాస్పదంగా మారింది. ఆదివారం ఢిల్లీలోని బంగ్లా సాహెబ్ గురుద్వారాను దర్శించుకుని తిరిగి భార్య సందీప్ కౌర్‌తో కలిసి కేంద్ర ఆర్థికశాఖ డిప్యూటీ కార్యదర్శి నవ్‌జ్యోతి సింగ్ (52) వెళుతున్న మోటారు సైకిల్‌ను రింగురోడ్డు సమీప కంటోన్మెంట్ మెట్రో స్టేషన్ వద్ద వేగంగా దూసుకొచ్చిన బీఎండబ్ల్యూ కారు ఢీకొట్టింది. దీంతో నవ్‌జ్యోతి సింగ్ (52) తలకు తీవ్ర గాయాలతో స్పృహ కోల్పోగా, భార్య సందీప్ కౌర్ గాయ పడ్డారు. ప్రమాద సమయంలో గగన్ ప్రీత్ కౌర్ అనే మహిళ డ్రైవింగ్ చేస్తున్నారు. తర్వాత ఆమె క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించినా పలు పొరపాట్లు చేశారు. అక్కడికి 4 కి.మీ విస్తీర్ణంలో 11 కార్పొరేట్ ఆస్పత్రులున్నా.. కాదని 20 కి.మీ. దూరంలోని న్యూలైఫ్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే నవ్‌జ్యోతి సింగ్ మృతి చెందాడని ఆ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శకుంతలా కుమార్ తెలిపారు. ప్రమాదం మధ్యాహ్నం 1.30 గంటలకు జరిగితే ఆస్పత్రికెళ్లడానికి అర్థగంట పట్టింది. ఘటనాస్థలానికి దగ్గర్లోని ఎయిమ్స్, రామ్ మనోహర్ లోహియా, ఆర్మీ ఆస్పత్రులకు తీసుకెళ్లినా వైద్యులు ప్రాణాలు కాపాడేవారని మృతుడి బంధువు శైలేంద్ర, కొడుకు నవ్‌నూర్ సింగ్ వాపోయారు. సదరు న్యూలైఫ్ ఆస్పత్రి చాలా చిన్నదని నవ్‌నూర్ సింగ్ చెప్పారు.

వక్ఫ్ చట్టంలో కీలక నిబంధనల నిలిపివేత!



(మొదటి పేజీ తరువాయి)

ఉండే 20 మంది సభ్యుల్లో ముస్లిమేతరుల సంఖ్య నాలుగుకు మించరాదని చెప్పింది. ఇక రాష్ట్రాల బోర్డుల్లో మొత్తం 11 మంది సభ్యుల్లో ముగ్గురికి మించి ముస్లిమేతరులు ఉండరాదని తేల్చిచెప్పింది. వక్ఫ్ బోర్డుకు ప్రధాన కార్యనిర్వాహక అధికారి (సీఈవో) నియామకం, ఇతర సర్వీసు నిబంధనలు నిర్ణయించడానికి సంబంధించిన సెక్షన్ 23పై మాత్రం స్టే విధించలేదు. కానీ, బోర్డు సీఈవోగా ముస్లిం వ్యక్తే ఉండడం మంచిదని తెలిపింది. అలాగే వివాదాస్పద ఆస్తిపై సంబంధిత అధికారి (కలెక్టర్) నివేదిక ఇచ్చేదాకా దాన్ని వక్ఫ్ ఆస్తిగా పరిగణించరాదన్న నిబంధనపైనా స్టే విధించింది. ఆస్తి ప్రభుత్వానిదిగా సంబంధిత అధికారి పేర్కొంటే, దానికి సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో సవరణలు చేసి, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలన్న నిబంధనను కూడా నిలిపివేస్తూ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ (సవరణ) చట్టం-2025ను పూర్తిగా నిలిపివేయాలంటూ సుప్రీంకోర్టులో దాదాపు 100కు పైగా పిటిషన్లు దాఖలయ్యాయి. ముస్లింల ఆస్తులను లాగేసుకునేందుకే ఈ చట్టాన్ని తెచ్చారని పిటిషనర్లు ఆరోపించారు. కేంద్రం మాత్రం ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను రక్షించడానికే చట్టాన్ని సవరించామని వాదించింది. స్పందించిన ధర్మాసనం.. ప్రస్తుతం తాము జారీ చేసిన ఆదేశాలు మధ్యంతర ఉత్తర్వులని స్పష్టం చేసింది. చట్టం రాజ్యాంగబద్ధతపై తుది వాదనల సందర్భంగా పిటిషనర్లు, కేంద్రం పూర్తిస్థాయిలో తమ వాణిని వినిపించకుండా ఇవి అడ్డుకోజాలవని తెలిపింది.

రాజ్యాంగ విలువలకు విజయం:విపక్షాలు

వక్ఫ్ సవరణ చట్టంలోని కీలక నిబంధనల అమలును తాత్కాలికంగా నిలిపివేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను ప్రతిపక్షాలు స్వాగతించాయి. న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ విలువలకు లభించిన విజయంగా దీనిని అభివర్ణించాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సోమవారం ఎక్స్‌లో స్పందిస్తూ.. 'మన దేశం దీర్ఘకాలం కిందటే పరిష్కరించుకున్న సమస్యలను తిరగదోడటానికి, మతపరమైన విద్వేషాగ్నిని రగిలించటానికి, ప్రజల మధ్య చీలికలు తీసుకురావటానికి బీజేపీ ఈ చట్టం తీసుకొచ్చింది' అని దుయ్యబట్టారు. వక్ఫ్ బిల్లుపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ సంఘంలో సభ్యుడు, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ నజీర్ హుస్సేన్ మాట్లాడుతూ.. దేశంలోని మైనారిటీ ప్రజల హక్కులకు రాజ్యాంగం కల్పించిన రక్షణలను సుప్రీం కోర్టు తన ఆదేశాల ద్వారా పునరుద్ఘాటించిందన్నారు. ధర్మాసనం ప్రస్తుతం స్టే విధించిన 3 క్లాజులను కాంగ్రెస్‌పార్టీ తొలి నుంచీ వ్యతిరేకిస్తోందని గుర్తు చేశారు. ఏ సంస్కరణ అయినా రాజ్యాంగానికి విధేయంగా ఉండాలని, సంప్రదింపులకు అవకాశం కల్పించాలని, పారదర్శకంగా ఉండాలన్నది కాంగ్రెస్ పార్టీ వైఖరని, సుప్రీంకోర్టు ఆదేశాలు దీనినే ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. వక్ఫ్ సవరణ చట్టంలోని వివాదాస్పద అంశాలపై సుప్రీంకోర్టు స్టే విధించటాన్ని స్వాగతిస్తున్నామని సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు స్టేపై ప్రముఖ ఇస్లామిక్ సంస్థ 'జమైత్ ఉలేమా ఎ హింద్' అధ్యక్షుడు మౌలానా అర్షద్ మదానీ స్పందిస్తూ.. 'దేశంలోని ప్రతీ పౌరుడికీ సమానమైన హక్కులను, మతస్వేచ్ఛను ఇచ్చిన రాజ్యాంగం మీద వక్ఫ్ చట్టం ఒక ప్రత్యక్ష దాడి వంటిది. ముస్లింల మతస్వేచ్ఛను లాక్కొనే కుట్రలో భాగంగానే ఈ ప్రమాదకరమైన చట్టం తెచ్చారు. ఈ చట్టంపై సుప్రీంకోర్టు తాత్కాలిక నిలుపుదల విధించటం ద్వారా మాకు న్యాయం బతికే ఉందన్న నమ్మకం కలిగింది. మొత్తంగా చట్టాన్నే కోర్టు కొట్టేస్తుందని భావిస్తున్నాం' అన్నారు.

ప్రజాస్వామ్యానికి శుభసంకేతం: రిజిజు

సుప్రీంకోర్టు తీర్పు ప్రజాస్వామ్యానికి శుభ సంకేతమని కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజిజు పేర్కొన్నారు. పార్లమెంటులో సుదీర్ఘమైన చర్చల తర్వాతే వక్ఫ్ చట్టాన్ని తీసుకొచ్చామని, దాంట్లోని పలు అంశాలు యావత్ ముస్లిం సమాజానికి, ముఖ్యంగా పేద ముస్లిం సోదరులు, మహిళలకు ఉపయోగపడేవన్నారు. వక్ఫ్ బోర్డు ద్వారా ఆస్తుల దురాక్రమణ వంటి వాటికి కూడా ఈ చట్టం అడ్డుకట్ట వేస్తుందన్నారు. ఈ విషయమంతా సుప్రీంకోర్టుకు తెలుసన్నారు.

అవకతవకలు గుర్తిస్తే బిహార్ ఎస్ఐఆర్‌ను పక్కనపెడతాం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: బిహార్‌లో నిర్వహించిన సమగ్ర ఓటర్ల సర్వే(ఎస్ఐఆర్)లో అవకతవకలు జరిగినట్టు ఏ దశలో గుర్తించినా మొత్తం ప్రక్రియను పక్కన పెడతామని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. అయితే, దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహించకుండా ఎన్నికల సంఘాన్ని అడ్డుకోబోమని స్పష్టం చేసింది. సోమవారం ఈ అంశంపై విచారణ జరిపిన ధర్మాసనం ఎస్ఐఆర్ చెల్లుబాటుపై తుది వాదనలను అక్టోబరు 7వ తేదీకి వాయిదా వేసింది. ఈ అంశంపై ముక్కలు ముక్కలుగా అభిప్రాయాన్ని వెల్లడించేందుకు ధర్మాసనం నిరాకరించింది. బిహార్ ఎస్ఐఆర్‌పై తాము వెల్లడించనున్న తీర్పు మొత్తం పాన్-ఇండియా ఎస్ఐఆర్‌కు వర్తించనుందని ప్రకటించింది. బిహార్ ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పిటిషన్లు వేసినవారిని అక్టోబరు 7న పాన్-ఇండియా ఎస్ఐఆర్‌పైనా వాదనలు వినిపించేందుకు అనుమతించింది.

వన్‌తారా వన్య మృగ కేంద్రానికి 'సిట్' క్లీన్‌చిట్


» చట్టాల ఉల్లంఘన జరగలేదని సుప్రీంకోర్టు ప్రకటన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో రిలయన్స్ ఆధ్వర్యంలోని వన్‌తారా వన్య మృగ కేంద్రానికి క్లీన్ చిట్ లభించింది. దాని నిర్వహణలో ఎలాంటి నిబంధనల ఉల్లంఘన జరగలేదని సుప్రీంకోర్టు సోమవారం ప్రకటించింది. ఈ కేంద్రం నిర్వహణపై దర్యాప్తు జరిపిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ఆధ్వర్యంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) క్లీన్ చిట్ ఇచ్చినట్టు తెలిపింది. నిబంధనల అమలు సక్రమంగా ఉన్నట్టు నివేదిక సమర్పించిందని ధర్మాసనం పేర్కొంది. వన్‌తారా వన్య మృగ కేంద్రం నిర్వహణలో నిబంధనల ఉల్లంఘన జరుగుతోందని, చట్టాలకు విరుద్ధంగా అక్కడికి ఏనుగులను తీసుకొస్తున్నారంటూ దాఖలైన రెండు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఓ న్యాయవాది లేచి వన్‌తారాకు దేవాలయం ఏనుగును తీసుకొచ్చారని చెప్పగా అందులో తప్పేముందని ధర్మాసనం ప్రశ్నించింది. కేసును కొట్టివేసింది.

పోలీసు స్టేషన్లలో పనిచేయని నిఘా కెమెరాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: పోలీసు స్టేషన్లలోని సీసీటీవీ కెమెరాలు పనిచేయకుండా మూలపడుతుండడంపై సోమవారం సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. పర్యవేక్షణ లోపమే ఇందుకు కారణమని అభిప్రాయపడింది. ఈ సమస్య పరిష్కారానికి మానవ ప్రమేయంలేని కంట్రోలు రూంలు ఉంటే మంచిదేమోనని అభిప్రాయపడింది. ఏ స్టేషన్‌లోనైనా సీసీటీవీ కెమెరా పనిచేయకపోతే తక్షణమే కంట్రోలు రూం నుంచి హెచ్చరిక వచ్చేలా ఏర్పాట్లు ఉంటే మంచిదని పేర్కొంది. మనుషులు కాకుండా కృత్రిమ మేధ (ఏఐ)తో పర్యవేక్షించే కంట్రోలు రూంల ఏర్పాటుపై ఏదైనా ఐఐటీ సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తే బాగుంటుందని సూచించింది. పోలీసు స్టేషన్లలో పనిచేయని సీసీటీవీ కెమెరాలు ఉండడంపై విచారణ జరిపిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఏ స్టేషన్‌లోనయినా సీసీటీవీ కెమెరా పనిచేయకపోయినా ఆ విషయాన్ని వెంటనే పర్యవేక్షణ సంస్థకుగానీ, న్యాయ సేవల సంస్థకుగానీ వెంటనే తెలిపే ఏర్పాట్లు ఉండాలంది.

లోకం తీరు



విదేశీ నిపుణులను స్వాగతిస్తున్నాం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. వీరిలో దక్షిణ కొరియాకు చెందిన కార్మికులే ఎక్కువగా ఉన్నారు. ఆ కార్మికులను గొలుసులతో బంధించిన దృశ్యాలపై దక్షిణ కొరియాలో తీవ్ర ఆందోళనలు నెలకొన్నాయి. 12న ఆ కార్మికులను అమెరికా నుంచి దక్షిణ కొరియా తమ దేశానికి తరలించుకుపోయింది. అయితే ఇది జరగడానికి ఒకరోజు ముందే తమ కార్మికుల పట్ల అమెరికా వ్యవహరించిన తీరుపై దక్షిణ కొరియా అధ్యక్షుడు లీజే మ్యూంగ్ తీవ్రంగా స్పందించారు. హ్యూందాయ్ ప్లాంట్‌లో దాడులు తమను దిగ్భ్రాంతికి గురిచేశాయని.. మున్ముందు తమ దేశ కంపెనీలు అమెరికాలో పెట్టుబడులు పెట్టేందుకు ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తాయని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ట్రంప్ సోమవారం ట్రుత్ వేదికగా స్పందిచారు. విదేశాలకు చెందిన నిపుణులను తమ దేశ కంపెనీల్లోకి ఆహ్వానిస్తున్నామని.. సంక్లిష్టమైన చిప్స్, సెమీ కండక్టర్లు, కంప్యూటర్లు, షిప్పులు, రైళ్ల తదితర ఉత్పత్తులను ఎలా తయారు చేయాలనేది విదేశీ ఉద్యోగుల నుంచి నేర్చుకుంటాం అని పేర్కొన్నారు. ఇక టిక్‌టాక్ యాప్ యాజమాన్యంతో ఉన్న సమస్యలను పరిష్కరించుకుంటామని, దీనిపై చైనాతో ఒప్పందం జరిగిందని ట్రంప్ వెల్లడించారు. ఈ మేరకు వాణిజ్య చర్చల్లో భాగంగా స్పెయిన్‌లో చైనాతో సోమవారం సమావేశం బాగా జరిగిందని చెప్పారు. కాగా ఇటీవల డల్లా‌స్‌లో భారత సంతతికి చెందిన చంద్ర నాగమల్లయ్య అనే వ్యక్తి దారుణ హత్య ఘటనను ట్రంప్ తీవ్రంగా ఖండించారు. మరోవైపు.. రష్యా నుంచి చమురు దిగుమతులపై సుంకాలు విధించాలంటూ జీ-7, నాటోకు అమెరికా పిలుపునివ్వడాన్ని తీవ్ర బెదిరింపు చర్యగా చైనా వ్యాఖ్యానించింది. అమెరికా పిలుపునకు స్పందించి సుంకాలు విధిస్తే తమ నుంచి ప్రతీకార చర్యలుంటాయని హెచ్చరించింది.

భారత్-అమెరికా మధ్య నేడు వాణిజ్య చర్చలు



వాషింగ్టన్, సెప్టెంబరు 15: భారత్-అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందంపై మంగళవారం ఆరో విడత చర్చలు జరగనున్నాయి. చర్చల్లో పాల్గొనేందుకు అమెరికా వాణిజ్య ప్రతినిధి బ్రెండన్ లించ్ భారత్‌కు రానున్నారు. భారత ప్రతినిధిగా వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ చర్చల్లో పాల్గొంటారు. మరోవైపు, వాణిజ్య ఒప్పందంపై భారత్‌ను చర్చలకు వచ్చేలా చేశామని ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో వ్యాఖ్యానించారు. అదే సమయంలో ఆయన మరోసారి భారత ఆర్థిక విధానాలను విమర్శించారు. ఓ పక్క అమెరికాతో అన్యాయమైన వ్యాపారం ద్వారా డబ్బులు సంపాదించుకుంటూ చౌకగా రష్యా చమురు కొంటున్నారని ఆరోపించారు. భారత్ ఇచ్చే డబ్బులతో రష్యా ఆయుధాలు కొని ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తోందన్నారు.

ఐటీ రిటర్నుల దాఖలు గడువు నేటి వరకు పొడిగింపు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు(హెచ్‌యూఎఫ్‌లు) పెనాల్టీ లేకుండా ఐటీ రిటర్నులు(ఐటీఆర్) దాఖలు చేయడానికి తుది గడువును మంగళవారం వరకు పొడిగించారు. ఈ మేరకు సోమవారం ఐటీ శాఖ సోమవారం ప్రకటన చేసింది. వాస్తవానికి ఈ గడువు సోమవారంతోనే ముగియాల్సి ఉండగా, చివరి రోజు రిటర్నుల ఫైలింగ్‌లో అవాంతరాలు ఎదురైనట్టుగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో, గడువును పొడిగించారు. సోమవారంకల్లా 7.3 కోట్లకు పైగా ఐటీ రిటర్నులు దాఖలైనట్టు ఐటీ శాఖ వెల్లడించింది. కొన్నేళ్లుగా ఐటీఆర్ ఫైలింగ్స్ పెరుగుతున్నాయి. గత ఏడాది జూలై 31 వరకు 7.28 కోట్ల ఐటీఆర్‌లు దాఖలయ్యాయి. అంతకు ముందు ఏడాది ఇవి 6.77 కోట్లుగా ఉన్నాయి.

బిహార్‌లో వలసల పాపం కాంగ్రెస్‌దే

కావాలనే నాడు చొరబాట్లను పెంచారు.. వాళ్లందరినీ మేం పంపించివేస్తున్నాం

» బిహార్ పర్యటనలో మోదీ వ్యాఖ్యలు

పూర్ణియా, సెప్టెంబరు 15 : బిహార్‌లో వలస చొరబాట్లు పెరగడానికి కాంగ్రెస్, దాని మిత్రపక్షాలే కారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. అక్రమ వలసదారులను తాము పంపించి వేస్తున్నామని తెలిపారు. పాకిస్థానీయులతోపాటు బంగ్లా, నేపాల్, అఫ్ఘానిస్థాన్ నుంచి అక్రమంగా ప్రవేశించిన వారు సైతం .ఓటుహక్కు పొందినట్టు ఇటీవల బిహార్‌లో ఈసీ నిర్వహించిన సమగ్ర ఓట్ల సవరణ (సర్) ప్రక్రియలో తేలింది. బిహార్‌లోని పూర్ణియాలో సోమవారం జరిగిన సభలో ఈ అంశాన్ని మోదీ ప్రస్తావించారు. కాంగ్రెస్, ఆర్జేడీలపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్, దాని మిత్రులు అధికారంలో ఉన్నప్పుడు బిహార్‌లో కావాలనే చొరబాట్లను పెంచారని, ఎన్డీయే ప్రభుత్వం వారందరినీ పంపించివేస్తోందని అన్నారు. బిహార్‌ను బీడీతో ముడిపెట్టి అవమానించిన కాంగ్రెస్ పార్టీకి గట్టిబుద్ధి చెప్పాలని బిహారీలను ఆయన కోరారు. పొగాకు ఉత్పత్తులపై జీఎస్టీ విషయంలో కేంద్రం విధానాన్ని విమర్శిస్తూ కేరళ కాంగ్రెస్ 'బీడీలు..బిహార్..' అంటూ సోషల్‌మీడియాలో పోస్టు పెట్టి.. ఆ తర్వాత తీసివేసింది. దీనిపై మోదీ తీవ్రంగా విరుచుకుపడ్డారు. "బీడీ.. బిహార్.. బీతో మొదలవుతాయని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. వారి వైఖరి బిహారీలను తీవ్రంగా అవమానించింది. కాంగ్రెస్‌కు, ఆ పార్టీ మిత్రపక్షాలకు రానున్న రోజుల్లో బిహార్ ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారు" అని హెచ్చరించారు. "గతంలో ఆర్జేడీ, కాంగ్రెస్ అస్తవ్యస్త పాలన వల్ల బిహార్ ఎంతో నష్టపోయింది. రాష్ట్రం అభివృద్ధి చెందుతుంటే వారు చూసి ఓర్చుకోలేరు. రానున్న ఎన్నికల్లో ఇందుకు వారు మూల్యం చెల్లించుకుంటారు." అని మోదీ మండిపడ్డారు. పేదలకు అండగా నిలవడమే మోదీ విధానమని ప్రధాని వ్యాఖ్యానించారు. రైతుల ప్రయోజనం కోసం నేషనల్ మఖన బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రూ.40వేల కోట్ల విలువైన పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మరోవైపు "ఎన్డీయేతో ఉన్నా.. ఇకముందూ ఉంటాను' అని బిహార్ సీఎం నితీశ్‌కుమార్ వ్యాఖ్యానించారు. గతంలో ఆర్జేడీతో కలిసి అధికారం పంచుకోవాల్సి రావడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. ఇకముందు అలా జరగబోదని ప్రధాని మోదీ సమక్షంలోనే నితీశ్ వెల్లడించడం గమనార్హం. వారిద్దరూ కలిసి బిహార్‌లోని పూర్ణియాలో జరిగిన సభలో పాల్గొన్నారు. "బీజేపీతో కలిసి 2005 నవంబరులో ప్రభుత్వం ఏర్పాటు చేశాను. ఆ తర్వాత ఒకటి, రెండుసార్లు పక్కకు పోయాను. పార్టీ సహచరుల్లో కొందరి ఒత్తిడే దీనికి కారణం. ఆ సహచరుల్లో ఒకరు ఇప్పుడు ఈ వేదికపైనే ఉన్నారు" అంటూ కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ (లలన్) వైపు నితీశ్ సరదాగా వేలు చూపించారు. అయినా.... అదంతా గతమని, అప్పట్లో వారితో ఇమడలేకపోయేవాడినని, ఎప్పుడూ ఏదొక తప్పుడు పని చేస్తుండేవారన్నారు. నవ్వుతూ నితీశ్ వ్యాఖ్యలను మోదీ స్వాగతించారు.



బిహార్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న మోదీ

'సిందూర్' సాహసం భేష్ : శ్లాఘించిన ప్రధాని

ఆపరేషన్ సిందూర్ సందర్భంగా ఆదర్శప్రాయ భూమికను సైనిక బలగాలు పోషించాయని మోదీ శ్లాఘించారు. కోల్‌కతాలోని ఈస్టర్న్ కమాండ్ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన కమాండర్ల సదస్సును ప్రారంభించారు. అనంతరం 'ఇండియన్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ విజన్-2047' డాక్యుమెంట్‌ను ఆవిష్కరించారు. భవిష్యత్ దిశగా ఆర్మీ బలగాలు వేసే అడుగులతో ఈ డాక్యుమెంట్ నిండి ఉన్నదని తెలిపారు. కాగా, ఆపరేషన్ సిందూర్ తర్వాత కమాండర్ల సదస్సు జరగడం ఇదే మొదటిసారి. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్, జాతీయభద్రతా సలహాదారు డోభాల్, సీడీఎస్ అనిల్ చౌహాన్, రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్‌కుమార్, త్రివిధ దళాల అధిపతులు తొలిరోజు సదస్సులో పాల్గొన్నారు. వాస్తవాధీన రేఖ వెంబడి ఉన్న ఉగ్రవాద స్థావరాలను కూల్చివేయడంలోను, పాకిస్థాన్ లోపలకు చొచ్చుకెళ్లి అక్కడా లక్ష్యాలను ఛేదించి ముష్కరులకు బుద్ధిచెప్పడంలోను సిందూర్ విజయవంతం అయిందని భద్రతాధికారులు హర్షం వ్యక్తం చేశారు.

రష్యా కష్టం.. మనకు లాభం!

(మొదటి పేజీ తరువాయి)

భారతదేశంలోని రిఫైనరీల పంట పండిస్తున్న వైనమే ఇందుకు ఉదాహరణ. గుర్తుందా.. కిందటి నెలలో ఉక్రెయిన్ రష్యాపై అతిపెద్ద డ్రోన్ దాడులు నిర్వహించింది. ఆ దాడుల్లో రష్యావ్యాప్తంగా ఉన్న పలు కీలక రిఫైనరీల సామర్థ్యం భారీగా దెబ్బతింది. దీంతో.. రష్యా తన చమురుశుద్ధి సామర్థ్యంలో దాదాపు 20 శాతం మేర కోల్పోయింది. ఆ దేశ రోజువారీ చమురు శుద్ధి సామర్థ్యంలో 11 లక్షల బ్యారెళ్లకు సమానం ఇది. శుద్ధి సామర్థ్యం తగ్గిపోవడంతో రష్యా రోజూ చేసే ఎగుమతులకు అదనంగా మరో 2 లక్షల బ్యారెళ్ల ముడి చమురును అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేస్తోంది. అది కూడా.. ఒపెక్ దేశాలు అమ్మే బ్రెంట్ క్రూడ్ కన్నా తక్కువ ధరకు. బ్రెంట్ క్రూడాయిల్‌తో పోలిస్తే రష్యా విక్రయిస్తున్న ఉరల్స్ ముడి చమురు ఒక బ్యారెల్‌కు 5-6 డాలర్ల దాకా తక్కువకు వస్తుండడంతో భారతదేశానికి చెందిన రిఫైనరీలు ఆ చమురును పెద్ద ఎత్తున కొనుగోలు చేసి, ఇక్కడ శుద్ధి చేసి మార్కెట్ రేట్లకు విదేశాలకు విక్రయిస్తున్నట్టు సమాచారం. ఆగస్టులో యూరప్ దేశాలకు మనదేశం నుంచి డీజిల్ ఎగుమతులు 137% మేర పెరిగి రోజుకు 2,42,000 బ్యారెళ్లకు చేరాయి. ఆగస్టు 15 దాకా సగటున రోజుకు 15 లక్షల బ్యారెళ్ల ఉరల్స్ ముడిచమురు రష్యా నుంచి మన దేశానికి దిగుమతి అవుతుండగా.. ఆగస్టు నెలాఖరుకు అది రోజుకు 20 లక్షల బ్యారెళ్లకు చేరింది. ఇలా అదనంగా దిగుమతి చేసుకుని, శుద్ధి చేసి విక్రయిస్తున్న చమురు కారణంగా రిలయన్స్ సంస్థకు ఏటా అదనంగా సుమారు 500 మిలియన్ డాలర్ల నిర్వహణ లాభం వచ్చే అవకాశం ఉందని జెఫ్రీస్ సంస్థ అంచనా. క్యాపిటల్ మార్కెట్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ గ్రూప్ సీఎల్ఎస్ఏ అంచనాల ప్రకారం.. రష్యా క్రూడ్ రాయితీల కారణంగా భారతదేశం ఏటా రూ.22 వేల కోట్ల మేర లాభాలు పొందుతోంది. రష్యా చమురు అతి తక్కువ ధరలకు లభించడం వల్ల.. బీమా, రవాణా ఖర్చులు అన్నింటినీ కలుపుకొన్నాక కూడా మన రిఫైనరీలకు ఒక్కో బ్యారెల్‌పై డాలర్ నుంచి 1.25 డాలర్ల దాకా లాభం వస్తోంది.



రష్యా బాగు చేసుకుంటే..

రష్యా రిఫైనరీల సంక్షోభం మన దేశంలోని చమురు శుద్ధి కర్మాగారాలకు అందివచ్చిన అవకాశంగా మారినప్పటికీ.. ఈ ప్రయోజనాలు కొంతకాలమేనని ఇంధన రంగ నిపుణులు చెబుతున్నారు. రష్యా తన చమురు శుద్ధి కర్మాగారాలను బాగు చేసుకున్నాక ఇతర దేశాలకు ఎగుమతులను తగ్గిస్తుందని పేర్కొంటున్నారు. ఒకవేళ అదే జరిగి రష్యా చమురు శుద్ధి సామర్థ్యం పెరిగి.. ప్రస్తుతం తక్కువ ధరలకే అమ్ముతున్న చమురును మళ్లీ మార్కెట్ రేట్లకు అమ్మడం మొదలుపెడితే రోజుకు సగటున 18 లక్షల బ్యారెళ్ల ముడిచమురు కొనుగోళ్ల ధర పెరిగి.. భారత్‌పై ఏడాదికి అదనంగా రూ.80 వేల కోట్ల భారం పడుతుందని అంచనా.

కణాల చలనం, ఆకార మార్పిడి గుట్టు రట్టు

» సీసీఎంబీ శాస్త్రవేత్తల ఆవిష్కరణ

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మన శరీరంలోని కణాలు తమ ఆకారాన్ని మార్చుకుని, ఒకచోటు నుంచి మరొకచోటుకు వెళ్లడానికి ఉపకరించే కీలక ప్రొటీన్‌ను.. హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) శాస్త్రజ్ఞులు గుర్తించారు. దాని పేరు స్పిన్ 90. అది ఏపీఆర్2/3 అనే అనే ప్రొటీన్‌తో కలిసి పనిచేసి.. కణాల కదలికకు అత్యంత కీలకమైన యాక్టిన్ ఫిలమెంట్ వృద్ధిని ప్రేరేపిస్తుందని వారి పరిశోధనల్లో వెల్లడైంది. నేచర్ స్ట్రక్చరల్ అండ్ మాలిక్యులార్ బయాలజీలో వారి ఈ పరిశోధన ఫలితం ప్రచురితమైంది. ఈ ఆవిష్కరణ వైద్యరంగానికి ఎంతో ఉపయోగకరమని నిపుణులు భావిస్తున్నారు. కణాలు ఎంత వేగంగా ఆకారాన్ని మార్చుకుని కదలుతాయో అర్థం చేసుకోవడం వల్ల క్యాన్సర్, రోగనిరోధక సమస్యలు వంటి వాటిపై మరింత స్పష్టత వస్తుందంటున్నారు.

తెలంగాణకు మరో 40 వేల మెట్రిక్ టన్నుల యూరియా

- ఎరువులు, రసాయనాల శాఖ ఆదేశాలు
- రెండోసారి ఢిల్లీకి మంత్రి తుమ్మల
- జూలైలోనే నడ్డాకు సీఎం రేవంత్ వినతి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతుల యూరియా కష్టాలు తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముమ్మరంగా ప్రయత్నిస్తోంది. ఈ పరిస్థితి ముందే గ్రహించిన సీఎం రేవంత్‌రెడ్డి జూలై 8నే ఢిల్లీలో కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రి జేపీ నడ్డాకు రాష్ట్రానికి సరిపడా యూరియా అందించాలని విజ్ఞప్తి చేశారు. సెప్టెంబరు 3న కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలిసి యూరియా కొరత తీర్చాలని కోరారు. రాష్ట్రానికి చెందిన పార్లమెంట్ సభ్యులు కేంద్రమంత్రులను కలిసి సమస్యను విన్నవించారు. సోమవారం మంత్రి తుమ్మల మరోసారి ఢిల్లీకి వచ్చారు. కేంద్ర ఎరువుల శాఖ కార్యదర్శి రజత్ కుమార్ మిశ్రాని కలిసి రాష్ట్ర అవసరాలకు సరిపడా యూరియాను తక్షణమే కేటాయించాలని కోరారు. వెంటనే 40వేల మెట్రిక్ టన్నుల యూరియాను తెలంగాణకు కేటాయిస్తూ రజత్‌కుమార్ ఆదేశాలిచ్చారు. అనంతరం తుమ్మల మాట్లాడుతూ.. వరి, మొక్కజొన్న, పత్తికి యూరియా ఈ 10-15 రోజులు అత్యంత కీలకమని, అందుకే.. తెలంగాణ రైతుల అవసరాలకు తగ్గట్టుగా సరఫరా చేయాలని కోరినట్టు చెప్పారు. అలాగే అంతకు ముందు నెలల్లో ఏర్పడిన లోటును పూడ్చేవిధంగా ఈ నెలలో 2లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కోరామన్నారు. సెప్టెంబరులో ఇప్పటి వరకు లక్షా 4 వేల మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రానికి సరఫరా చేశారన్నారు. రానున్న 10 రోజుల్లో మరో లక్ష మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయాలని కోరగా, 40 వేల మెట్రిక్ టన్నులు తెలంగాణకు కేటాయిస్తూ ఆదేశాలిచ్చారని తెలిపారు. గతంలో ఇచ్చిన ప్రణాళిక ప్రకారం ఈ వారంలో సరఫరా అయ్యే 40 వేల మెట్రిక్ టన్నులకు ఇది అదనమని చెప్పారు.


కేంద్ర ఎరువుల శాఖ కార్యదర్శి రజత్‌కుమార్ మిశ్రాతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

కేటాయింపులు ఇలా.. (మెట్రిక్ టన్నుల్లో)

మంగళూరు, ఎంపీ రెక్ గ్రేస్	2,700
కాకినాడ, ఎంపీ జీవీఎస్ రూబి	8,100
కాకినాడ, ఎంపీ గ్రేస్ ఆర్మోనీ	7,800
కృష్ణపట్నం, ఎంపీ ఎండీవర్	13,000
జైగఢ్, ఎంపీ వాడి అల్ఫోన్సాన్	8,100

యూరియా కొరత.. తీరని వ్యథ!

- పలు జిల్లాల్లో రైతుల రాస్తారోకోలు
- కరీంనగర్‌లో బతుకమ్మ ఆడుతూ నిరసన
- భద్రాద్రి జిల్లాలో రైతుల మధ్య ఘర్షణ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

యూరియా కొరతపై రైతులు పలు జిల్లాల్లో రోడ్లపైకి వచ్చి ఆందోళనలకు దిగారు. కరీంనగర్ జిల్లా దుర్శేడ్ వద్ద రహదారిపై యూరియా బస్తాలు వేసి, వాటిపై బతుకమ్మను పెట్టి మహిళా రైతులు బతుకమ్మ ఆడి, రాస్తారోకో చేశారు. మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ యూరియా సంచులను పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా కోటపల్లిలో రైతులు రహదారిపై రైతు వేదిక ముందు రైతులు బైఠాయించి రాస్తారోకో చేశారు. లక్సెట్టిపేటలో రైతులతో పాటు మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీఆర్ఎస్ నేతలు ఆందోళన చేపట్టారు. ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి, దహెగాం మండలం చిన్న రాస్పెల్లి, సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్, మెదక్ జిల్లా రామాయంపేటలో రాస్తారోకోలు నిర్వహించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనూ ఆందోళనలు కొనసాగాయి. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో పోలీసు పహారా మధ్య యూరియాను పంపిణీ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు సొసైటీ కార్యాలయం వద్ద యూరియా కోసం భారీగా తరలిరావడంతో రైతుల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లిలో ఓ రైతుకు చెందిన యూరియా బస్తాను ఇద్దరు యువకులు దొంగిలించారు. ఈవీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. ఆ యువకులు రైతుకు బస్తాను తిరిగిచ్చేశారు.


ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరులో క్యూలో నిల్చున్న రైతులు

ప్రభుత్వ వైఫల్యం: ఈటల

రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం వల్లనే యూరియా కొరత ఏర్పడిందని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంవల్లే ఈ పరిస్థితి వచ్చిందని హుజూరాబాద్‌లో అన్నారు.

రైతులను రెచ్చగొడుతున్న బీఆర్ఎస్: పొన్నం

యూరియా కొరతపై బీఆర్ఎస్ నేతలు రైతులను రెచ్చగొడుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్‌లో విమర్శించారు. ఈ అంశాన్ని రాజకీయం చేసేందుకే మాజీ మంత్రి గంగుల కమలాకర్ బతుకమ్మ ఆడారని ధ్వజమెత్తారు.

కాంగ్రెస్ వల్లే యూరియా సంక్షోభం

- ఆ పార్టీ నేతలు బ్లాక్ దందాకు పాల్పడుతున్నారు
- ఫీజు రీయింబర్స్‌కు డబ్బులు లేవనడం సిగ్గు చేటు: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యూరియా సంక్షోభానికి కాంగ్రెస్సే కారణమని, ఆ పార్టీ నేతలు బ్లాక్‌దందాకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఒక లారీ లోడ్ యూరియాను మిర్యాలగూడ ఎమ్మెల్యే గన్ మాన్ ఎత్తుకెళ్లారంటే.. మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు ఎంత దోచుకున్నారో అర్థం చేసుకోవాలన్నారు. తెలంగాణ భవన్‌లో సోమవారం వెంగళరావునగర్ డివిజన్ స్థాయి పార్టీ బూత్ కమిటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో పట్టపగలే దోపిడీలు, అత్యాచారాలు జరుగుతున్నా.. అదుపు చేయలేని దౌర్భాగ్యస్థితిలో రేవంత్ ప్రభుత్వం ఉదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ సర్కార్ తీరుతో 13లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. డబ్బులన్నీ ఉద్యోగుల జీతాలు, సంక్షేమ పథకాలకే ఖర్చవుతున్నాయని, రీయింబర్స్‌మెంట్‌కు డబ్బుల్లేవని డిప్యూటీ సీఎం భట్టి చెప్పడం సిగ్గుచేటన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా కాంగ్రెస్ నాయకులు అందినకాడికి దోచుకుతింటున్నారని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించడం ద్వారా కేసీఆర్ జైత్రయాత్రకు శ్రీకారం చుట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

ఉద్యమకారులకిచ్చిన హామీలను నెరవేర్చాలి

- అందుకోసం ప్రభుత్వంతో అన్ని స్థాయిల్లో చర్చిస్తా
- ఆ ప్రక్రియను నేటి నుంచే మొదలుపెడతా : కోదండరాం

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం కోరారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వంతో అన్ని స్థాయిల్లో చర్చిస్తానని, ఈ ప్రయత్నాన్ని మంగళవారం నుంచే మొదలు పెడతానని చెప్పారు. టీజేఎస్ ఆధ్వర్యంలో సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారుల సమన్వయ సమావేశం జరిగింది. ఇందులో విశ్రాంత జడ్జి చంద్రకుమార్, న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోవర్ధన్, వివిధ ఉద్యమ సంఘాల జేఏసీలు, ఉద్యమకారుల సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేశారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధన కోసం, ఉద్యమకారుల సంక్షేమం కోసం కోదండరాం నాయకత్వంలో కలిసి పనిచేయడం సహా మూడు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం కోదండరాం మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యమకారుల సంక్షేమం కోసం అందరం కలిసి పని చేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. నాడు ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నవారు నేడు కుటుంబాన్ని పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందేనన్నారు. హామీల అమలు సాధ్యం కాకుంటే మరోసారి సమావేశమై కార్యాచరణ నిర్ణయిస్తామని చెప్పారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజాస్వామిక పాలన కొనసాగించి, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని చెప్పారు.

ఆయుష్మాన్ భారత్‌తో తెలంగాణలో 90 లక్షల మందికి లబ్ధి

- కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం తెలంగాణ ఆరోగ్యం రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిందని కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ పథకం కింద రాష్ట్రంలో 90 లక్షల మందికి పైగా లబ్ధిదారులు ఉచిత వైద్య సేవలు పొందారని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అంతేకాకుండా, 5 వేలకు పైగా ఆయుష్మాన్ కేంద్రాల ద్వారా ప్రాథమిక ఆరోగ్యసేవలు అందిస్తున్నట్లు కిషన్ రెడ్డి చెప్పారు. రూ.1,300 కోట్ల బడ్జెట్‌తో నిర్మిస్తున్న బీబీనగర్ ఎయిమ్స్ అందుబాటులోకి వస్తే మరింత మెరుగైన వైద్య సేవలు లభిస్తాయని తెలిపారు. దీంతో పాటు 1,044 పడకల సామర్థ్యంతో ఉన్న ఈఎస్ఐసీ సనత్‌నగర్ క్యాంపస్ ద్వారా 72.6 లక్షల మందికి ప్రయోజనం కలుగుతోందని, రోజుకు 3 వేల మందికి ఓపీ సేవలు అందుతున్నాయని వివరించారు.

తెలంగాణ సాయుధ పోరాటంపై గవర్నర్ వ్యాఖ్యలు సరికాదు

- సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాటంపై గవర్నర్ చేసిన వ్యాఖ్యలు సరికాదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అభిప్రాయపడ్డారు. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, గవర్నర్ వ్యాఖ్యలు తెలంగాణ విముక్తి కోసం పోరాడిన ఉద్యమకారులను కించపరచడమేనని అన్నారు. ఈ పోరాటంలో 4 వేల మంది కమ్యూనిస్టులు ప్రాణాలు త్యాగం చేశారని, 10 లక్షల ఎకరాల భూపంపకం తెలంగాణ సాయుధ పోరాటం ద్వారానే సాధ్యమైందని నారాయణ గుర్తు చేశారు. ఆర్ఎస్ఎస్ మూలాలున్న వ్యక్తులను గవర్నర్లుగా నియమించడం సరికాదని అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలకు తెలంగాణ సాయుధ పోరాటంపై మాట్లాడే అర్హత లేదన్నా రు. అలాగే, వక్ఫ్(సవరణ) చట్టంలోని కీలక నిబంధనలను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నారాయణ స్వాగతించారు. మణిపూర్ మూడేళ్లుగా మండుతుంటే, మోదీ సాఫీగా ఇప్పుడెళ్లి తన నటనా నైపుణ్యాన్ని ప్రదర్శించారని మండిపడ్డారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

శాంతికి బాట

మణిపూర్‌లో అగ్గి అంటుకున్న రెండున్నరేళ్ళకు, రెండువందల యాభైమందికి పైగా మరణించి, అరవైవేలమంది నిరాశ్రయులైన తరువాత, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆ రాష్ట్రంలో కాలూనారు. ఆయన రాక, మాట కోసం ఆ రాష్ట్రం ఎంతగా ఎదురుచూస్తున్నదో ఈ పర్యటన దృశ్యాలు తెలియచెబుతున్నాయి. గాయానికి మందువేసే ఈ ప్రయత్నం ఆలస్యంగా జరిగిందని విశ్లేషకులు సైతం అంటున్నారు. అయినప్పటికీ, మోదీ పర్యటనకు ఉన్న ప్రాధాన్యం కాదనలేనిది. చీలికలు పేలికలైన సమాజాన్ని ఒక్కటి చేయడం ఇప్పటికిప్పుడు సాధ్యం కాకున్నా ఆ దిశగా పడిన ఒక ప్రధానమైన అడుగు ఇది. ప్రధాని మోదీ స్వయంగా హామీ ఇచ్చినట్టు, శాంతి, అభివృద్ధికి ప్రతీకగా మణిపూర్ మెరవాలని యావత్ భారతం కోరుకుంటోంది.

నలభై ఆరు విదేశీపర్యటనలు చేశారు, సొంత జనంకోసం మరీ మూడుగంటలేనా అని విపక్షాలు ప్రశ్నిస్తున్నప్పటికీ, మోదీతో భేటీ అయిన సందర్భంలో ఆయా వర్గాలవారు కన్నీటి పర్యంతమైన దృశ్యాలు చూసినప్పుడు వారికి కాస్తంత ఉపశమనం దక్కిందనే అనిపిస్తోంది. మోదీ మంచిమాటకారి కనుక, మణిపూర్‌ను ఆశలభూమిగా, మణిపూర్ వాసులను శ్రమ, శక్తి ప్రతీకలుగా చక్కగా అభివర్ణించారు. తమ బిడ్డల భవిష్యత్తుకోసం హింస అనే చీకటి నుంచి శాంతి అనే వెలుగులోకి రావాలన్నారు ఆయన. మణిపూర్‌లో తమ డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఇప్పటికే సాధించిన అభివృద్ధిని వివరించేందుకు కూడా ఈ సందర్భాన్ని ఉపయోగించుకున్నారు. ఎనిమిదిన్నరవేలకోట్ల అభివృద్ధిపనులకు కూడా శంకుస్థాపనలు చేశారు. వీటన్నింటికంటే, నిరాశ్రయులతోనూ, చిన్నారులతోనూ, బంధువులను కోల్పోయినవారితోనూ మాటపంచుకొని, ధైర్యవచనాలు చెప్పడం వారిని ప్రభావితం చేసివుంటుంది. కుకీల చుర్‌చందాపూర్‌లోనూ, మీతీల ఇంఫాల్‌లోనూ ఆయన పర్యటనలూ పరామర్శలూ ఇరువర్గాలనూ సమంగా చూస్తున్నామన్న సందేశాన్ని ఇవ్వడానికి ఉపకరిస్తుంది.

అయితే, సందేశాలు మాత్రమే గాయాలను మాన్పలేవు. వేళ్నూనుకొని ఉన్న వైరాలు ఒక చిన్న నిప్పురవ్వతో మారణకాండకు దారితీస్తున్న తరుణంలో, వైషమ్యాలను, అపనమ్మకాలను నిర్మూలించడానికి ఒక నిరంతర సానుకూల చర్యలు అవశ్యం. మొన్నటిదాకా ఒకరినొకరు చంపుకున్న వారంతా ఇకపై ఒక్కటి కావాలన్న ఆకాంక్ష మంచిదే కానీ, అందుకు బాటలు వేయాల్సిన బాధ్యత పాలకులదే. 29 నెలల నిరంతర అగ్గికి ప్రజలే కారణమన్నట్టుగా, మార్పు వారిలోనే రావాలన్నట్టుగా వ్యాఖ్యలు చేయడం వల్ల ప్రయోజనం ఉండదు. ఇక్కడ అగ్గిరేగింది అభివృద్ధి కోసం కాదు. అప్పటికే కుకీజోలకు వ్యతిరేకంగా మాజీ ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ పలు కక్షపూరితమైన నిర్ణయాలు చేయడం, మీతీలకు ఎస్టీ రిజర్వేషన్ ఇచ్చే ప్రతిపాదనకు రాష్ట్ర హైకోర్టు సానుకూలంగా స్పందించడం కుకీల ఆగ్రహానికి కారణం. వారు నిరసన చేపడితే, మీతీలు దాడులు చేసి పరిస్థితిని ఉద్రిక్తంగా మార్చేశారు. హింస దురదృష్టకరమని ప్రధాని అనడం బాగుంది కానీ, అది దురుద్దేశపూరితమైనదని ఆయనకు తెలియకపోదు. భావితరాలకు ద్రోహం చేసింది ప్రజలు కాదు, తమవారేనని ఆయనకు తెలుసు.

నిప్పంటుకున్న క్షణం నుంచి మీతీ బీరేన్ దానిని ఆర్పడానికి ప్రయత్నించక పోగా, తన చర్యలు, చేష్టలతో మరింత ఎగదోశాడనడానికి సుప్రీం కోర్టుకు చేరిన ఆడియో టేపులే నిదర్శనం. చివరకు తీవ్రవాద గ్రూపులు సైతం తమను తాము ప్రజారక్షకులుగా అభివర్ణించుకుంటూ రంగంలోకి దిగి, ఎదుటి తెగవారిని ఊచకోతకోసే పరిస్థితులు దాపురించాయి. పోలీసుల ఆయుధాలు విద్రోహుల చేతుల్లోకి పోయాయి. మీతీ బీరేన్‌ను తప్పించనంతవరకూ శాంతిసాధ్యం కాదని తెలిసికూడా ఢిల్లీపెద్దలు ఆయనను అడ్డగోలుగా సమర్థించారు, పాపంలో తామూ భాగస్వాములైనారు. సర్కారు ఇక కూలిపోకతప్పదన్న ఆఖరుక్షణంలో మాత్రమే బీరేన్‌ను తప్పించి, రాష్ట్రపతిపాలన ద్వారా రాష్ట్రం చేజారిపోకుండా చూసుకున్నారు. అడపాదడపా అగ్గిరేగుతున్నప్పటికీ, మొత్తంగా ఇప్పుడు పరిస్థితులు కాస్తంత గాడినపడిన మాట నిజం. కుకీ–మీతీ పెద్దల మధ్య వరుస చర్చలతో అవిశ్వాసం తొలగి, సయోధ్య సాధించాలి. తరతమభేదాలకు అతీతంగా పునరావాసం దక్కాలి. ఆప్తులను కోల్పోయినవారికి అన్నివిధాలా న్యాయం జరగాలి. మణిపూర్ మీద పార్లమెంటులో నోరువిప్పడానికీ, కుకీ స్త్రీలపై అత్యాచారాలను నేరుగా ప్రస్తావించి ఖండించడానికి గతంలో మనసొప్పని ప్రధాని ఇంత కాలానికి జరిపిన ఈ పర్యటన శాంతికి బాటలు వేయాలి.

పీడిత జన హృదయ 'తారకం'

అణగారిన ప్రజల ఆశాజ్యోతి, దళిత, పౌర హక్కుల నాయకుడు, ప్రజా న్యాయవాది, రిపబ్లికన్ పార్టీ నాయకుడు, కవి, రచయిత, గొప్ప వక్త బొజ్జా తారకం మన నుంచి భౌతికంగా దూరమై తొమ్మిదేళ్ళు దాటింది. ఇంకా ఆయన స్ఫూర్తి సమాజంలోని పీడిత ప్రజల ప్రేమికులకు, ప్రగతిశీల శక్తులకు బాసటగా నిలుస్తూనే ఉంది. బొజ్జా తారకం 1939 జూన్ 27న తూర్పుగోదావరి జిల్లా కాకినాడ తాలూకా కందికుప్ప గ్రామంలో బొజ్జా అప్పలస్వామి–మావుళ్ళమ్మ దంపతులకు కనిష్ఠ పుత్రుడిగా జన్మించారు. "పుట్టుక నీది, చావు నీది, బతుకంతా ప్రజానీకానిది" అని కవి కాళోజీ అన్నట్లుగా బొజ్జా తారకం విద్యార్థి దశ నుంచి తుదిశ్వాస విడిచే వరకు పీడిత ప్రజల అభివృద్ధి కోసమే పోరాడి ఒక ఉజ్వల చరిత్రను మన కళ్ల ముందు నిలిపారు.

దేశంలోని ఉత్పత్తి సాధనాలు ఉత్పత్తి శక్తులకు దక్కినప్పుడే, ముఖ్యంగా భూమి పీడిత ప్రజలకు దక్కితేనే వారికి రెండు పూటలా భోజనంతో పాటు సమాజంలో గౌరవం దక్కుతుందని భావించేవారు తారకం. ఈ దేశంలో భూమి కోసం, ఉత్పత్తి సాధనాల కోసం ఉత్పత్తి శక్తులు చేసే పోరాటం ఒక సమగ్ర విధానాన్ని అవలంబించాలని ఆయన నమ్మారు. మార్క్స్ సిద్ధాంతంతో పాటు, అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని మేళవించిన ఉజ్వల పోరాటమే ఈ దేశంలో వర్గ–కుల నిర్మూలనను సాధిస్తుందని ఆయన విశ్వసించారు. అందుకు అనుగుణంగా సైద్ధాంతిక ఆలోచనను కూడా అక్షర రూపంలో పెట్టి 'కులం–వర్గం' అనే పుస్తకాన్ని 1996లో మొదటి ప్రచురణగా తీసుకువచ్చారు. తారకం గారి 'పోలీసులు అరెస్ట్ చేస్తే ఏమి చేయాలి' అనే పుస్తకం లాగే ఈ 'కులం–వర్గం' కూడా ఎంతో ప్రాచుర్యం పొందింది. కుల–వర్గ నిర్మూలన కోసం పని చేస్తున్న ప్రతి వ్యక్తికీ శక్తికీ ఇది చేరింది. ఈ పుస్తకాలతోపాటు ఆయన ఇతర రచనలైన 'నది పుట్టిన గొంతుక', 'దళితులు–రాజ్యం', 'నేల, నాగలి, మూడెద్దులు', 'ఎస్సీ ఎస్టీ నిధులు: విదిలింపు–మళ్ళింపు', ఇంకా డా. బి.ఆర్. అంబేడ్కర్ మూల రచనల నుంచి కొన్ని తెలుగు అనువాదాలు, వందలాది వ్యాసాలు, కవితలు తెలుగు సమాజం మీద చాలా ప్రభావం చూపాయి.



ఈ దేశానికి పట్టిన చీడయిన కులవ్యవస్థకు పునాదిగా ఉన్న మనుధర్మశాస్త్రాన్ని తగలపెట్టకుండా, ఆ శాస్త్రం ద్వారా ఆచరించబడుతున్న కుల, వర్ణ వ్యవస్థను కూకటివేళ్లతో పెకిలించకుండా, దేశంలోని దళిత, ఆదివాసీ ప్రజలకూ, స్త్రీలకూ ఆత్మగౌరవం దక్కదన్నది బొజ్జా తారకం ప్రగాఢ విశ్వాసం.

ఈ దేశానికి పట్టిన చీడయిన కులవ్యవస్థకు పునాదిగా ఉన్న మనుధర్మశాస్త్రాన్ని తగలపెట్టకుండా, ఆ శాస్త్రం ద్వారా ఆచరించబడుతున్న కుల, వర్ణ వ్యవస్థను కూకటివేళ్లతో పెకిలించకుండా, దేశంలోని దళిత, ఆదివాసీ ప్రజలకూ, స్త్రీలకూ ఆత్మగౌరవం దక్కదన్నది బొజ్జా తారకం ప్రగాఢ విశ్వాసం. ఆ వెలుగులో జరిగిన పోరాటాలైన కారంచేడు, తిమ్మసముద్రం, పదిరికుప్పం, చుండూరు, లక్ష్మీదేవిపేట పోరాటాలకు ఆయన నాయకత్వం వహించారు. సమాజంలోని ప్రగతిశీల శక్తుల సంఘీభావం సంపాదించారు. న్యాయస్థానాలలో ఆయా సంఘటనలలోని దోషులను శిక్షించే విధంగా నికార్సయిన ఉద్యమకారునిగా, పీడిత ప్రజల పౌర హక్కుల న్యాయవాదిగా అలుపెరుగని పోరాటం చేశారు. ఒకవైపు న్యాయస్థానాలలో ప్రజలవైపు నిలబడి అత్యంత నైపుణ్యంతో వాదనలు కొనసాగిస్తూనే, మరోవైపు అనేక ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించారు.

కార్మిక నాయకునిగా, దళిత నాయకునిగా, పౌరహక్కుల నాయకునిగా నిస్వార్థంగా ప్రజా స్వామిక వ్యవస్థలో ఈ ప్రజలకు నాయకత్వం వహించాలని చాలా ఎన్నికలలో పోటీచేసినా, అధికారం, డబ్బు, మద్యం, ఆశ్రిత పక్షపాతం, రిగ్గింగ్‌తో గెలిచే ఎన్నికలలో ఓడిపోయారు. కానీ పీడిత ప్రజల మనసులను గెలిచారు. దేశ ఎన్నికల స్వరూపాన్ని బహిర్గతం చేశారు. సమాజంలో పీడన, అణచివేత, శ్రమ దోపిడీ ఉన్నంతవరకు ప్రజా పోరాటాలు ఫీనిక్స్ పక్షి లాగ ఉవ్వెత్తున లేస్తూనే వుంటాయని, వాటికి తమవంతు కర్తవ్యంగా సహకారం అందించాలని బోధిస్తూ ఆచరణలో తానూ భాగమయ్యేవారు. ఇందులో భాగంగానే అనేక కార్మిక సంఘాలకు న్యాయ సలహాదారుడిగా, రిపబ్లికన్ పార్టీ, పౌర హక్కుల సంఘం, రాజకీయ ఖైదీల విడుదల కమిటీ, తెలంగాణ ప్రజాస్వామిక వేదిక నాయకుడిగా చివరిశ్వాస వరకు కొనసాగారు.

తారకం గారితో కలిసి ప్రజాస్వామిక ఉద్యమాలలో పాల్గొనే అవకాశం నాకు కలిగింది. ముఖ్యంగా 2004 నాటి కాంగ్రెస్ ప్రభుత్వం విప్లవ పార్టీలతో జరిపిన చర్చలలో 'భూమి' ప్రధాన ఎజెండాగా మారిన సమయంలో 'ప్రజాభూమి కమిషన్' ఏర్పాటులో తారకం ఆ కమిషన్‌కు చైర్మన్‌గా, నేను కన్వీనరుగా ఎన్నికయ్యాం. మానవహక్కుల నాయకులు, అమరులు నరేంద్రనాథ్, ఆదివాసీ నాయకులు, అమరులు శిడం శంభులు కో–కన్వీనర్లుగా ఎన్నికయ్యారు. ఇందులో భాగంగా భూస్వాముల, కబ్జాదారుల, పెట్టుబడిదారుల కబంధ హస్తాలలో చిక్కిన భూమి వివరాలు, ప్రభుత్వం దగ్గర పేదలకు పంచేటందుకు ఉన్న భూమి వివరాలు సేకరించాం. ఇలా కలిసి పనిచేసిన రెండు, మూడు సంవత్సరాలూ నాకు ఎంతో విలువైనవి.

దళిత, ఆదివాసీ, ఇతర పీడిత ప్రజలకు భూమి దక్కాలని తారకం గారు నిరంతరం చేసిన కృషి, ఆ దిశగా జరిగే పోరాటాలకు ఆయన ఇచ్చిన మద్దతు మాటల్లో వివరించలేనిది. తారకం గారు 2014లో బ్రెయిన్ ట్యూమర్ వ్యాధికి గురయ్యారు. ఆఖరి క్షణాల్లో కూడా రోహిత్ వేములకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా ఇటు న్యాయస్థానంలోను, అటు ప్రజాక్షేత్రంలోనూ పోరాడారు. సెప్టెంబర్ 16, 2016 రాత్రి 9 గంటలకు తుదిశ్వాస విడిచారు. తారకం మన మధ్యలో భౌతికంగా లేకపోయినా, పీడిత ప్రజల పట్ల ఆయన నిబద్ధత, ఆయన ఆచరించిన విలువలు, చేసిన న్యాయ, ప్రజా పోరాటాలు చిరకాలం సజీవంగా ఉంటాయి.

○ **చిక్కుడు ప్రభాకర్**
కన్వీనర్, తెలంగాణ ప్రజాస్వామిక వేదిక

(నేడు బొజ్జా తారకం 9వ వర్ధంతి)

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా...

తెలంగాణ సీఎంగా రేవంత్‌రెడ్డి అధికార పగ్గాలు చేపట్టి మంత్రులు, ఎమ్మెల్యేలందర్నీ కలుపుకుపోతూ ప్రజలకు పటిష్ఠ పాలన అందిస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లోని కాంగ్రెస్ ప్రభుత్వాలకు అండగా నిలుస్తున్నారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొండలు, గుట్టలు ఉన్న భూములకు రైతుబంధు చెల్లించింది. కానీ రేవంత్ వచ్చాక రైతుబంధు చెల్లింపునకు భూ పరిమితి నిర్ణయించి, నిజమైన సాగుభూములకే పథకం వర్తించేలా చూశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కేసీఆర్ లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. అధికార దాహంతో ఏకంగా తన పార్టీ పేరునే కేసీఆర్ మార్చుకున్నారు. నేడు కాళేశ్వరం నీరు లేకపోయినా రైతులు దాదాపు 188 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా సన్న వరి ధాన్యం పండించారు. రేవంత్ ప్రవేశపెట్టిన వినూత్న పథకాలతో రాష్ట్రంలోని ప్రజలందరూ లబ్ధి పొందుతున్నారు. రేవంత్‌పై అర్థం లేని ఆరోపణలు చేయడాన్ని ఇప్పటికైనా కేసీఆర్ మానుకోవాలి.

— **శంకర్,** రేవంత్‌రెడ్డి ఫ్రెండ్స్ క్లబ్

చైనాతో భారత్ వ్యూహాత్మక చెలిమి

'అమెరికాతో శత్రుత్వం ప్రమాదకరం. అయితే, అమెరికాతో స్నేహం ప్రాణాంతకం' అని అమెరికా విదేశాంగశాఖ మాజీ మంత్రి, అంతర్జాతీయ రాజనీతిజ్ఞుడు హెన్రీ కిస్సింజర్ ఓ సందర్భంలో అన్నారు. అమెరికాకు భారత్ ఎగుమతి చేసే వస్తువులపై ఆ దేశం 50 శాతం సుంకాలు విధించడాన్ని బట్టి అది నిజమని మరోసారి నిరూపితమైంది. భారతదేశానికి అమెరికా గొప్ప మిత్ర దేశమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎన్నో సందర్భాల్లో ప్రకటించారు. తనకు ట్రంప్ గొప్ప స్నేహితుడని, భారత్–అమెరికా మధ్య సంబంధాలు బలోపేతం కావడం తన ఘనతేనని కూడా చెప్పుకొన్నారు. అయితే, మోదీ అర్థం చేసుకోవాల్సిన వాస్తవం బోలెడుంది. అధ్యక్ష పీఠం మీద ఎవరు కూర్చున్నా అమెరికా అమెరికానే. ఆ దేశ విదేశాంగ విధానం దాని ప్రయోజనాల కేంద్రంగానే ఉంటుంది తప్ప, ప్రపంచం కోణం నుంచి కాదు.

ఈ మధ్య కాలంలో అమెరికా మనకు బాగా సన్నిహితమైందంటే దానికి కారణం చైనాయే. డ్రాగన్ దూకుడును నిలువరించడానికి అమెరికాకు భారత్ అవసరమైంది. భారతదేశంతో సత్సంబంధాలు కొనసాగించడం ద్వారా చైనా ప్రాబల్యాన్ని తగ్గించడానికి వీలవుతుందని అగ్రరాజ్యం భావించింది. అందులో భాగంగానే భారత్‌తో సత్సంబంధాలను పెంచుకున్నది. ఇది గుర్తించని మన ప్రధానమంత్రి అమెరికాలో ట్రంప్‌కు మద్దతుగా 'అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్' అంటూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇది భారత విదేశాంగ విధానంలో ఊహించని మార్పు.

ఇక చైనా విషయాన్నే చూద్దాం. నా ఇటీవలి పర్యటనలో మౌలిక సదుపాయాల కల్పనలో చైనా ప్రగతిని చూస్తే ఆశ్చర్యమనిపించింది. మూడు దశాబ్దాల్లోనే చైనా పేద దేశం నుంచి ప్రపంచ పారిశ్రామిక పవర్‌హౌజ్‌గా ఎదిగింది. మరే దేశంతోనూ సంబంధం లేకుండానే డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సాధించింది. మనం వాడే గూగుల్, జీమెయిల్, గూగుల్ మ్యాప్స్, పేమెంట్ వ్యవస్థలను కాకుండా చైనా తమ ప్రజల కోసం ప్రత్యేక యాప్‌లను సొంతంగా తయారు చేసుకున్నది. ప్రపంచానికి కావలసిన అరుదైన ఖనిజాలన్నీ చైనా నుంచే ఎగుమతి అవుతున్నాయి. కంప్యూటర్లలో వాడే మైక్రోచిప్‌ల తయారీలో ఇవి కీలకం. సాంకేతికత, సమాచార భద్రత, బ్యాంకింగ్ కార్యకలాపాలు ఇలా అన్నిరకాల సేవలకు మైక్రోచిప్‌లు కావాల్సిందే. సాంకేతికత పెరుగుతున్న కొద్దీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలన్నీ ఈ చిప్‌లపై ఆధారపడబోతున్నాయి. ఈ అంశంలో చైనాకు అరుదైన ఖనిజాల రూపంలో ప్రకృతి వరం ప్రసాదించింది.

రష్యా – ఉక్రెయిన్ యుద్ధం భారత్ – అమెరికా సంబంధాలకు, మోదీ – ట్రంప్‌ల స్నేహానికి పరీక్షగా నిలిచింది. వాస్తవానికి అమెరికా కంటే రష్యా దౌత్యపరంగా భారత్‌కు ఎంతో కీలక దేశం. రక్షణ అవసరాలపరంగా రష్యాపైనే భారత్ ఎక్కువగా ఆధారపడుతున్నది. ఎన్నో క్లిష్ట పరిస్థితుల్లో, భారత్‌కు వ్యతిరేకంగా ఐరాసలో జరిగిన చర్చల్లో, ఓటింగ్ సమయాల్లో రష్యా మనకు మద్దతుగా నిలిచింది. అయితే, ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధంతో పశ్చిమ దేశాలన్నీ రష్యాపై ఆంక్షలు విధించాయి. ఆ ఆంక్షలను కూడా దాటుకొని భారత్ రష్యా వద్ద చమురు కొంటున్నది. ఇది ట్రంప్ ఆగ్రహానికి కారణమై, భారత్‌పై సుంకాలతో విరుచుకుపడుతున్నారు.



akbar

ప్రస్తుతం బహుధ్రువ ప్రపంచం ఆవిర్భవిస్తోంది. మరోవైపు, సైబర్ ముప్పు పెరుగుతున్నది. ఏఐ, అంతరిక్షంలో పోటీతత్వం మొదలైంది. సార్వభౌమత్వ పరిధి అనేది భౌగోళిక సరిహద్దులను మించిపోయింది. సముద్ర జలాలపై ఆధిపత్యం, సమాచార, సాంకేతిక సార్వభౌమత్వం, సప్లయ్ చైన్ సెక్యూరిటీ ప్రపంచ దేశాల ఆర్థికవ్యవస్థలకు అత్యంత కీలకంగా మారిపోయాయి. ఈ నేపథ్యంలో సరిహద్దు వివాదాల కారణంగా చైనాను దూరం చేసుకోవడం భారత్‌కు శ్రేయస్కరం కాదు. చర్చల ద్వారా సరిహద్దు సమస్యలను పరిష్కరించుకుంటూనే చైనాతో వాణిజ్య బంధాన్ని బలోపేతం చేసుకోవాలి.

నెహ్రూ కాలం నుంచి పీవీ నరసింహారావు హయాం వరకు భారత్ అన్ని దేశాలతో సమదూరం (అలీన విధానం) పాటించింది. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో ఓ వైపు అమెరికా కూటమి, మరోవైపు సోవియట్ కూటమి ఉన్న సమయంలోనూ భారత్ సమదూరం పాటించింది. టెక్నాలజీ అంతగా లేని కాలంలో ఈ విధానం బాగానే పనిచేసింది. కానీ, ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతున్నది. ఆహార పదార్థాలు, చమురు, వాణిజ్య అవసరాల కోసం ఒక దేశంపై మరో దేశం ఆధారపడక తప్పని పరిస్థితి. మరోవైపు, అమెరికా కేంద్రంగా ఉన్న అంతర్జాతీయ పవర్ సెంటర్ క్రమంగా మారుతున్నది. ఆసియాలో చైనా శక్తిమంతంగా మారి అమెరికాకు సవాలు విసురుతున్నది. పశ్చిమ దేశాల్లోనూ అంతర్గత విభేదాలు బయటపడుతున్నాయి. ఈ తరుణంలో భారత్ కూడా తన విదేశాంగ విధానాన్ని క్రమంగా మార్చుకుంటూ వచ్చింది. అలీన విధానం (నాన్ అలైన్‌మెంట్) నుంచి అన్ని దేశాలతో 'సత్సంబంధాలు' (మల్టీ అలైన్‌మెంట్) అనే విధానాన్ని ఎంచుకున్నది. అందుకే ఏక కాలంలో అమెరికా, చైనా, రష్యా దేశాలతో సంబంధాలు కొనసాగించింది. 2020 వరకు ఇది బాగానే సాగింది. ఆ ఏడాది జరిగిన గల్వాన్ ఘర్షణ తర్వాత పరిస్థితులు మారిపోయాయి.

గల్వాన్ ఘర్షణతో భారత్, చైనా మధ్య దూరం పెరిగింది. అమెరికాకు ఇండియా మరింత దగ్గరైంది. అయితే, విదేశాంగ విధానం కంటే ట్రంప్–మోదీ స్నేహం ఎక్కువగా వార్తల్లో నిలిచింది. అదే సమయంలో భారత్‌ను అమెరికా వ్యూహాత్మకంగా చైనా వ్యతిరేక కూటములు, చర్చల్లో భాగస్వామిని చేయడం ప్రారంభించింది. గల్వాన్ ఘర్షణ నేపథ్యంలో దేశీయంగానూ మోదీకి పెద్దగా వ్యతిరేకత ఎదురవ్వలేదు. కానీ, ఇజ్రాయెల్–గాజా, రష్యా–ఉక్రెయిన్ యుద్ధాలతో అంతర్జాతీయ సమీకరణాలు మారిపోయాయి. ఈ యుద్ధాల్లో భాగస్వాములైన అన్ని దేశాలతో సత్సంబంధాలు కలిగిన భారతదేశం ప్రస్తుతం నిర్ణాయక కూడలిలో నిలబడింది. ఈ సందర్భంలో భారత్ వ్యూహాత్మకంగా స్వయం ప్రతిపత్తితో వ్యవహరించాలి. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా నిర్ణయాలు తీసుకోవాలి. మిత్ర దేశాల (అమెరికా) ఒత్తిడికి తలొగ్గవద్దు.

ప్రస్తుతం ప్రపంచం మల్టీ పోలార్ వరల్డ్‌గా మారుతున్నది. మరోవైపు, సైబర్ ముప్పు పెరుగుతున్నది. ఏఐ, అంతరిక్షంలో పోటీతత్వం మొదలైంది. సార్వభౌమత్వ పరిధి అనేది భౌగోళిక సరిహద్దులను మించిపోయింది. సముద్ర జలాలపై ఆధిపత్యం, సమాచార, సాంకేతిక సార్వభౌమత్వం, సప్లయ్ చైన్ సెక్యూరిటీ ప్రపంచ దేశాల ఆర్థికవ్యవస్థలకు అత్యంత కీలకంగా మారిపోయాయి. ఈ నేపథ్యంలో సరిహద్దు వివాదాల కారణంగా చైనాను దూరం చేసుకోవడం భారత్‌కు శ్రేయస్కరం కాదు. చర్చల ద్వారా సరిహద్దు సమస్యలను పరిష్కరించుకుంటూనే చైనాతో వాణిజ్య బంధాన్ని బలోపేతం చేసుకోవాలి. అంతేకాకుండా మోదీ ప్రచారం చేస్తున్న ఆత్మనిర్భరతను ఆచరణలో వేగవంతం చేయాలి. ఆర్థికంగా బలపడినప్పుడే సార్వభౌమత్వం సాధ్యపడుతుంది. వాస్తవానికి అమెరికాకు చైనానే గట్టి పోటీదారు. కానీ, మిత్రదేశమైన ఇండియాపైన విధించిన సుంకాలను ట్రంప్ చైనాపై విధించే సాహసం చేయలేకపోయారు. దీనికి కారణం, చైనా ఆర్థిక వ్యవస్థ పరిమాణం, ప్రపంచ సప్లయ్ చైన్‌లో దాని వాటా. దీన్ని మనం గమనించాలి. చైనాతో సత్సంబంధాలను పునరుద్ధరించాల్సిన ఆవశ్యకతను మోదీ ఆలస్యంగానైనా గుర్తించినట్టున్నారు. ట్రంప్ సుంకాల హూంకరింపుల వేళ ఆయన చైనాకు వెళ్లి ఎస్‌సీవో సదస్సులో పాల్గొన్నారు. తద్వారా, అమెరికా ఒత్తిడికి తలొగ్గబోమన్న సంకేతం ఇచ్చారు. ఇది భారత విదేశాంగ విధానంలో కీలక మలుపు. ఈ స్వయం నిర్ణయాధికారాన్ని మోదీ అలాగే కొనసాగించాలి. అలా కాకుండా, 'మీరు మమ్మల్ని దూరం చేసుకుంటే మేం చైనాకు దగ్గరవుతాం' అని సందేశం ఇవ్వకూడదు. చైనాతో భారత్ నిజమైన, పరస్పర విశ్వాసం పెంపొందేలా స్నేహ సంబంధాలు కొనసాగించాలి.

'మన మిత్రులను మనం ఎంచుకోవచ్చు. కానీ, మన పొరుగున ఎవరుండాలన్నది మనం నిర్ణయించలేం. వారిని మార్చలేం' అని వాజపేయి అనేవారు. చైనా మన పొరుగు, శక్తిమంతమైన దేశమన్న సంగతి ఎప్పుడూ మర్చిపోకూడదు. ఎన్ని విభేదాలున్నా దాన్ని విస్మరించలేమన్న వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకొని విదేశాంగ విధానాన్ని రూపొందించుకోవాలి. చైనాతో ద్వైపాక్షిక సంబంధాల పెంపు కోసం రెండు దేశాల్లోని ప్రధాన నగరాల మధ్య నేరుగా విమాన సర్వీసులను నడిపించాలి. రెండు దేశాల పౌరులకు ప్రత్యేకమైన వీసా సౌకర్యాలు కల్పించాలి. భారతీయ విద్యార్థులకు చైనాలో మెరుగైన అవకాశాలు లభించేలా మాండరిన్ భాష నేర్పించాలి. చైనా సంస్థలతో వ్యాపార సంబంధాలు పెరగాలి. ఈ క్రమంలో న్యాయపరమైన సవాళ్లు ఎదురైతే పరిష్కరించుకోవడానికి భారతదేశంలోని న్యాయసంస్థలు చైనా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి. భారత విద్యార్థులు చైనాలోని విద్యాసంస్థలను, చైనా విద్యార్థులు భారత విద్యాసంస్థలను సందర్శించేలా చర్యలు తీసుకోవాలి. తద్వారా రెండు దేశాల సంస్కృతులపై నవతరానికి అవగాహన వస్తుంది. ఇది ద్వైపాక్షిక సంబంధాల్లో ఎంతో దోహదం చేస్తుంది. ఈ కార్యక్రమాలను చేపడుతూనే జాతీయ నాయకత్వం బ్రిక్స్, ఎస్‌సీవో లాంటి సదస్సుల్లో తరచుగా పాల్గొని భారత్ గొంతుకను వినిపించాలి.

• **బోయినపల్లి వినోద్‌కుమార్**
పార్లమెంటు మాజీ సభ్యులు

నాటి ప్రజాపోరాటానికి మతం రంగు పులమొద్దు!

దేశానికి 1947 ఆగస్టు 15 నాడు స్వాతంత్ర్యం రాగా తెలంగాణ (ఆనాటి హైదరాబాద్ సంస్థానం) భారతదేశంలో 1948 సెప్టెంబర్ 17న విలీనమైంది. హైదరాబాద్‌ను స్వతంత్ర దేశంగా నిజాం నవాబు ప్రకటించుకున్న నేపథ్యంలో, అప్పటికే ఫ్యూడల్ ప్రభువులకు వ్యతిరేకంగా పోరాడుతున్న కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ కార్యదర్శిగా కామ్రేడ్ బద్దం ఎల్లారెడ్డి, ఆంధ్రమహాసభ అధ్యక్షులు కామ్రేడ్ రావి నారాయణరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు కామ్రేడ్ మఖ్దూం మొహియుద్దీన్‌లు సంయుక్తంగా నిజాం నవాబు పాలన నుంచి విముక్తి, భారతదేశంలో విలీనంకై తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి 1947 సెప్టెంబర్ 11న పిలుపునిచ్చారు. వీరోచిత పోరాట ధాటికి నిజాం సైన్యం, అలాగే నిజాం ప్రైవేట్ సైన్యమయిన రజాకార్లు కకావికలమయ్యారు. అంతిమంగా 1948 సెప్టెంబర్ 17న 7వ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ అప్పటి కేంద్రమంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ యథాతథ ఒప్పందం చేసుకొని హైదరాబాద్ స్టేట్‌ను భారతదేశంలో విలీనం చేసారు. అలా ప్రపంచ పోరాట చరిత్రలో స్థానం సాధించుకున్న సెప్టెంబర్ 17వ తేదీని విలీన దినంగా అధికారికంగా జరపాలని తెలంగాణ ప్రజలు ముక్తకంఠంతో నినదిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు ప్రజల కోరికను ఎందుకు తిరస్కరిస్తున్నాయో సమాధానం చెప్పవలసిన అవసరం ఉన్నది.

నిజాం ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, ఫ్యూడల్ ప్రభువుల అణచివేత దోపిడీలకు వ్యతిరేకంగా జరిపిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం– మాతృభాష కోసం, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా మట్టి మనుషులు చేసిన తిరుగుబాటు. "బాంచన్ దొర కాల్మొక్త" అన్న వెట్టి మనిషి బందూకులు పట్టిన కమ్యూనిస్టు పోరాటమది. హైదరాబాద్ సంస్థాన రాజు ముస్లిం అయినప్పటికీ జమీందార్లు, జాగీర్దార్లు, భూస్వాములు దాదాపు 90శాతం హిందువులే. వారు నిజాం నవాబుకు గులాములుగా వ్యవహరించడమే గాక నిజాంను మించిన దౌర్జన్యాలు చేశారు. అనేకమందిని ఊచకోత కోయడం, మహిళలను వివస్త్రలు చేసి ఊరేగించడం, బతుకమ్మలు ఆడించడం, మానభంగాలు చేయడం లాంటి క్రూరమైన నేరాలను చేసిన జమీందార్లు, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లలో హిందువులూ ఉన్నారు, ముస్లిములూ ఉన్నారు. విసునూరు రాంచంద్రారెడ్డి, జన్నారెడ్డి ప్రతాపరెడ్డి ఇంకా అనేక సంస్థానాధిపతులు హిందువులే.

అదే విధంగా నిజాం రాజు ముస్లిం అయినప్పటికీ పేద ముస్లింల జీవితాలలో ఎటువంటి మార్పులేదు. తెలంగాణలో భూస్వామ్య ముస్లింలు కేవలం 2000 కుటుంబాలే కాగా పేద ముస్లింలు లక్షలాది మంది ఉన్నారు. అందులో 20 లక్షల మంది హైదరాబాద్ నగరంలో కడుపేదరికంలో ఉండేవారు. తలారి, గ్రామసేవకులు వంటి అతి స్వల్ప ఆదాయాలతో కూడిన ఉద్యోగాలు, మెకానిక్ పనులు, హోటల్ పనులు, పంక్చర్లు వేయడం, టైలరింగ్, కూరగాయలు, పండ్లు అమ్మడం వంటి అతి తక్కువ ఆదాయాలతో కూడిన పనుల్లో ఉండేవారు. గ్రామాలలో సెంట్ భూమి కూడా లేని వారు కూడా ఉన్నారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అనేకమంది ముస్లింలు కూడా చిత్రహింసలకు గురికాబడ్డారు. షేక్ బందగీని విసునూరు రాంచంద్రారెడ్డికి చెందిన గుండాలు చంపివేశారు. ప్రఖ్యాత జర్నలిస్టు షోయబుల్లాఖాన్‌ను హైదరాబాద్ నడిబజారులో రజాకార్లు క్రూరంగా చంపారు. ఈనాటి ఖమ్మం జిల్లా ఆనాటి వరంగల్ జిల్లాలో రజబ్ అలీ లాంటి యోధులు నిజాం రాచరికానికి వ్యతిరేకంగా పోరాటం చేశారు. డాక్టర్ రాజ్ బహద్దూర్ గౌర్‌తో కలిసి మఖ్దూం మొహియొద్దీన్, ప్రొ.అల్లంకుంద్ మీరీ, జవ్వాజ్ రజ్వీ (సాలార్జంగ్ మ్యూజియం ఆనాటి లైబ్రేరియన్), ప్రొ. ఖయ్యూం ఖాన్ లాంటి అనేక మంది ముస్లిం విద్యావేత్తలు నిజాం రాచరిక పాలనకు వ్యతిరేకంగా కామ్రేడ్స్ అసోషియేషన్‌ను ఏర్పాటు చేశారు.

ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా పేద రైతాంగం జరిపిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని ముస్లింల – హిందువుల పోరాటంగా చిత్రీకరించడం ఆ సమష్టి త్యాగాల చరిత్రను అవమానపర్చడమే. భూమి కోసం, భుక్తి కోసం, దాస్య విముక్తి కోసం చేసిన పోరాటంలో అణగారిన ముస్లిమైనా, హిందువైనా అన్నదమ్ములే. అణచివేసే ఫ్యూడల్ ప్రభువులు హిందువైనా, ముస్లిమైనా వారి వర్గమూ, వర్గస్వభావమూ ఒక్కటే.




మహ్మద్ రఫీ ఉస్మానియా యూనివర్సిటీలో నిజాంకు వ్యతిరేకంగా జాతీయ జెండాను ఆవిష్కరణ చేశారు. నిజాం వ్యతిరేక పోరాటంలో అగ్రగామిగానున్న అల్లా ఉద్దీన్‌ని నిజాం మూకలు చంపివేశాయి. ఇలా ఎంతోమంది ముస్లింలు నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నారు. చిత్రహింసలకు, హత్యలకు గురయ్యారు.

ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా పేద రైతాంగం జరిపిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని ముస్లింల, హిందువుల పోరాటంగా చిత్రీకరించడం ఆ సమష్టి త్యాగాల చరిత్రను అవమానపర్చడమే. భూమి కోసం, భుక్తి కోసం, దాస్య విముక్తి కోసం చేసిన పోరాటంలో అణగారిన ముస్లిమైనా, హిందువైనా అన్నదమ్ములే. అణచివేసే ఫ్యూడల్ ప్రభువులు హిందువైనా, ముస్లిమైనా వారి వర్గమూ, వర్గస్వభావమూ ఒక్కటే. ఆనాటి పోరాటంలో ఇసుమంత పాత్ర లేని ఆరెస్సెస్ గానీ, ఈనాటి బీజేపీ గానీ ఇటువంటి మహోజ్వల పోరాట చరిత్రకు మతం రంగు పులమడానికి ప్రయత్నిస్తున్నాయి. ఓట్ల రాజకీయాల నేపథ్యంలో చరిత్రను వక్రీకరిస్తున్నాయి. ఆరెస్సెస్–సంఘ్ పరివార్‌లు 1925 నుంచి 1947 వరకు ఏనాడూ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనలేదు. అదేవిధంగా తెలంగాణ సాయుధ పోరాటంలో ఆరెస్సెస్ ఊసే లేదు. నాగపూర్‌లోని ఆరెస్సెస్ కేంద్ర కార్యాలయంపై మూడు రంగుల జాతీయ పతాక ఆవిష్కరణకు కూడా 2001 జనవరి 26 వరకు ఆరెస్సెస్ పెద్దలు ఏనాడూ అంగీకరించలేదు. మూడు అనే పదం అశుభానికి సంకేతమని మూడు రంగులతో కూడిన జాతీయ జెండా దేశానికి అరిష్టమని వాదించారు. ఆనాడు మతాలు, కులాలతో సంబంధం లేకుండా అంతా ఒక్కటై చేసిన మహత్తర పోరాటానికి అటువంటి ఆరెస్సెస్, దాని ప్రతినిధి అయిన బీజేపీలు నేడు మతం రంగు పులమడానికి ప్రయత్నిస్తున్నాయి. రజాకార్ల దాడుల్లో హిందూ పురుషులను ముస్లిం మహిళలు, అలాగే ముస్లిం పురుషులను హిందూ మహిళలు కన్నతల్లులు బిడ్డలను కాపాడుకున్నట్లుగా కాపాడిన ఘటనలు ఉన్నాయి. అన్నదమ్ముల్లా కలిసి అన్ని మతాలవారు జరిపిన వీరోచిత పోరాటానికి మతం రంగు పులిమే ఎవరైనా దేశభక్తులు ఎలా అవుతారు? ముస్లిం రాజు అయిన నిజాం నవాబు రాజ్యాన్ని పటేల్ సైన్యం ఓడించి విమోచన చేసినట్లుగా వాదిస్తూ ఈ పోరాటాన్ని ముస్లిం రాజుకు, హిందూ ప్రజలకు జరిగిన పోరాటంగా చిత్రీకరించడానికి బీజేపీ ప్రయత్నిస్తున్నది.

ప్రజా కంటకులైన ఒక రాజును యుద్ధంలో ఓడిస్తే అతనిని యుద్ధ ఖైదీగా చూడాలి. అలా గాకుండా నాడు నిజాం నవాబుకు రాజ్‌ప్రముఖ్‌గా హోదా కల్పించడంతో పాటు సంవత్సరానికి కోటి రూపాయల రాజభరణాన్ని ఇస్తూ పటేల్ సైన్యం నిజాం రాజుతో ఒప్పందం చేసుకున్నది. వేలాది మందిని ఊచకోత కోసిన రజాకార్ల నాయకుడైన ఖాసీం రజ్వీని పాకిస్థాన్‌కి వెళ్ళిపోయే విధంగా అనుమతించింది. ఇలాంటి పరిణామాలు నిజాం రాజు, నాటి ప్రభుత్వం కుమ్మక్కు అయిన్నట్లుగా సూచిస్తున్నాయి. అటువంటిది– అప్పుడు యుద్ధం జరిపి విమోచన సాధించినట్లు ఎలా బీజేపీ వాళ్ళు పేర్కొంటారు? గాంధీజీని హత్యచేసిన ఆరెస్సెస్‌ను నిషేధించిన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌ను కూడా బీజేపీ హైజాక్ చేస్తున్నది.

సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానంలో భాగంగా ఉండి, నేడు కర్ణాటకలో భాగమైన కల్యాణ కర్ణాటక, మరఠ్వాడా ప్రాంతాలలో హైదరాబాద్ విలీన దినోత్సవాలను ప్రభుత్వాలే ఎప్పటి నుంచో అధికారికంగా నిర్వహిస్తున్నాయి. తెలంగాణ విలీనాన్ని అధికారికంగా జరపడం లేదని సమైక్య రాష్ట్రంలోని ప్రభుత్వాలను దుమ్మెత్తిపోసిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ 2021 సంవత్సరం నుంచి సమైక్యతా దినోత్సవం పేరుతో తెలంగాణ వీర చరిత్రను కనుమరుగయ్యేలా చేశారు. ఈనాటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజా పాలన దినోత్సవం పేరిట పోరాట స్మృతులను చెరిపివేసే ప్రయత్నం చేస్తున్నది. సెప్టెంబర్ 17ను కచ్చితంగా అధికారికంగా విలీనం లేక మహత్తర రైతాంగ పోరాటం పేరుతో జరపవలసిన బాధ్యత ఈనాటి కాంగ్రెస్‌పై ఉన్నది.

▪ **కూనంనేని సాంబశివరావు**
శాసనసభ్యులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి





విద్యార్థుల భారీ ర్యాలీ

నేటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్

72 ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిలిచిపోనున్న సేవలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బకాయిలను విడుదల చేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్త బంద్ పిలుపులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోనున్నాయి. మంగళవారం రాత్రి నుంచి రోగులను అడ్మిట్ చేసుకునే కార్యక్రమాన్ని నిలిపివేయనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 72 ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిరాకరించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 1400 కోట్లు బకాయిలు పేరుకపోయినట్లు ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పిటల్ అసోసియేషన్ ప్రకటించింది. గతంలో ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చినప్పటికీ నిధులు విడుదల చేయకపోవడంతో ఆరోగ్యశ్రీ సేవలు బంద్ చేస్తున్నట్లు ప్రకటించారు.

అత్యవసర రోగులకు ఇబ్బంది

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గుండె సంబంధిత వ్యాధులతోపాటు న్యూరో సంబంధిత వ్యాధుల బారిన పడే వారికోసం అత్యవసర చికిత్స అందించాల్సి ఉంటుంది. ఇలాంటిరోగులు ఇంతకాలం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు సేవలు అందించేవి. సమ్మె కారణంగా ఇకపై వరంగల్ ఎంజీఎం ఆస్పత్రితోపాటు కాకతీయ వైద్య కళాశాల ఆవరణలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై భారం పడనుంది. ఇప్పటికే

(మిగతా 6లో..)

ఓట్ల సవరణకు సిద్ధంగా ఉండాలి

రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవో సుదర్శన్‌రెడ్డి 6



మహిళా సంఘాలకు బతుకమ్మ కానుక

- చీరలు అందించనున్న రాష్ట్ర సర్కారు
- జిల్లాలకు చేరుకుంటున్న నూతన వస్త్రాలు
- ఒకే రకమైన డిజైన్, రంగుల్లో తయారీ
- ఒక్కో చీర విలువ సుమారు రూ.800
- గ్రామాల వారీగా అందజేసేందుకు ఏర్పాట్లు

హనమకొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చీరెలను అందచేయనున్నది. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం బతుకమ్మ పండుగను పురస్కరించుకొని 18 సంవత్సరాలు నిండిన, తెల్లరేషన్‌కార్డు కలిగిన వారందరికీ బతుకమ్మ చీరెలను పంపిణీ చేసింది తెలిసిందే. గత ప్రభుత్వం రేషన్‌కార్డులో పేరున్న ప్రతీ మహిళకు రేషన్ డీలర్ల ద్వారా బతుకమ్మ చీరలను పంపిణీ చేసింది. ఈ పథకం కింద అందించిన చీరలు నాణ్యతగా లేవని మహిళలు వీటిని ధరించడం లేదని భావించి కాంగ్రెస్ ప్రభుత్వం గత బతుకమ్మ పండగకు చీరల పంపిణీని నిలిపి వేసింది. దీంతో కొంత వ్యతిరేకత వస్తుందని భావించి తిరిగి ఈ పథకాన్ని కొనసాగించాలని నిర్ణయిచింది. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు చీరెలు అందించడం ద్వారా చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన ఉద్దేశంగా ఈ పంపిణీ ప్రక్రియను చేపట్టింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది చీరెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

రేవంతన్న కానుక

అక్కాచెల్లెళ్లకు మీ రేవంతన్న కానుక పేరిట చేనేత చీరలను ఇందిరా మహిళ శక్తి పథకం కింద పొదుపు సంఘాల మహిళలకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. మహిళా సంఘాల సభ్యులకు మాత్రమే డ్రెస్‌కోడ్‌లో భాగంగా వారికి దసరా పండును పురస్కరించుకొని రెండేసి చీరెలను పంపిణీ చేయాలని నిర్ణయించింది. నాణ్యత విషయంలో ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. చీరల పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. చీరెలను జిల్లాలకు పంపడం మొదలైంది. జనగామ జిల్లాకు మొదటి విడతగా చీరల స్టాక్ అప్పుడే వచ్చి చేరింది. మిగతా జిల్లాలకు కూడా రెండు, మూడు రోజుల్లో విడతల వారీగా చీరెలు రానున్నాయి. అయితే చీరెలను ఎక్కడ భద్రత పరిచేది స్టాక్ పాయింట్ల వివరాలను ప్రభుత్వం ముందే తెప్పించుకుంది. హనుమకొండ, వరంగల్ జిల్లాకు సంబంధించి చీరలను వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లోని గోదాముల్లో భద్రపరచనున్నారు. జిల్లా కేంద్రాలకు చేరుకున్న తర్వాత వీటిని మండలాల్లోని స్టాక్ పాయింట్లకు తరలిస్తారు. మండలాల్లో చీరలను నిల్వ చేసే స్టాక్ పాయింట్లను ఇప్పటికే గుర్తించారు. ఇక్కడి నుంచి గ్రామాల వారీగా ఎస్‌హెచ్‌జీ సభ్యులకు అందించనున్నారు. గతంలో రేషన్ కార్డు ఆధారంగా అందించగా ప్రస్తుతం స్వశక్తి సభ్యుల వారీగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

సంఘాలు-సభ్యులు

ఇప్పటికే నియోజకవర్గాల వారీగా ఎన్ని సంఘాలు ఉన్నాయి ? ఎంత మంది సభ్యులు ఉన్నారు ? లెక్కలు తీశారు. మెప్మా సిబ్బందికి పంపిణీ బాధ్యతలను అప్పగించారు.



వరంగల్ జిల్లాలో 435 గ్రామైక్య సంఘాలు, 11358 స్వయం సహాయక సంఘాలు, వీటిలో 1,23,013 సభ్యులు ఉన్నారు. హనుమకొండ జిల్లాలో 397 గ్రామైక్య సంఘాలు, 10,400 స్వయం సహాయక సంఘాలు, వీటి పరిధిలో 1,16,874 మంది సభ్యులు ఉన్నారు. వీరందరికి చీరల పంపిణీ జరుగుతుంది. డ్రెస్‌కోడ్‌లో భాగంగా అన్నీ ఒకే రంగుతో ఒకే విధంగా ఉంటాయి. మహిళా సంఘాల సభ్యులకు సంవత్సరానికి రెండేసీ చీరలు ఇస్తారు. కానీ ఈ సారి మాత్రం ప్రస్తుతం ఒక చీరనే పంపిణీ చేయనున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళా సంఘాలకు చీరలను ఇవ్వడం ఇదే మొదటి సారి. గత సంవత్సరం (మిగతా 6లో..)

పెద్ద సదువులు బంద్

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పాల్గొన్న అన్ని ప్రైవేటు కాలేజీలు
- రోడ్డెక్కిన విద్యార్థులు
- రాస్తారోకోతో అదాలత్ ఉద్రిక్తం
- రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్

7

భర్తపై హత్యాయత్నం

- ప్రియుడితో కలిసి దాడి చేసిన భార్య
- వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని దారుణం
- మహబూబాబాద్ మండలం గడ్డిగూడెంలో ఘటన

6

రోడ్డెక్కిన అంగన్‌వాడీలు



- పీఎంశ్రీ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్
- మంత్రి సురేఖ ఇంటి ముట్టడి
- హామీ ఇవ్వడంతో ఆందోళన విరమణ

మంత్రి కొండా సురేఖ ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

7

19న ఆర్ట్స్ కళాశాలలో మెగా జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 19న మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సి పాల్ ప్రొఫెసర్ ఎస్.జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలోని ట్రైనింగ్, ప్లేస్‌మెంట్, భౌతికశాస్త్ర విభాగం సహకారంతో ఈనెల 16 నుంచి 18వరకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించిన అనంతరం మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. వివరాలకు ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జితేందర్(98496 73244)ను సంప్రదించాలని ఆమె కోరారు.

తప్పుడు ప్రచారాలు మానుకోండి

- మేడారం అభివృద్ధిని వ్యతిరేకించడం అవివేకం
- ఆదివాసీలు, పూజారుల అభీష్టం మేరకే శాశ్వత పనులు
- సంస్కృతి సంప్రదాయాలను పరిగణనలోకి తీసుకుంటాం
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

తాడ్వాయి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మేడారం అభివృద్ధిపై కొందరు పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి దుశ్చర్యలను మానుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం తాడ్వాయి మండలంలోని మేడారంలో ఆమె పర్యటించారు. పూజారులు, అధికారులతో సమావేశమయ్యారు. ఆదివాసీ సంప్రదాయాలకు అనుగుణంగా మేడారంలో రాతి కట్టడాలతో చేపట్టనున్న శాశ్వత నిర్మాణాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వనదేవతలు సమ్మక్క, సారలమ్మ అంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎనలేని విశ్వాసం అని తెలిపారు. చరిత్రలో నిలిచిపోయేలా మేడారంలో అభివృద్ధి పనులు చేపట్టారని అన్నారు. ఇందుకు రూ.150 కోట్లు మంజూరు చేశారన్నారు. మరిన్ని నిధులు మంజూరు చేయడానికి సీఎం సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మేడారంలో అభివృద్ధి పనులను పూజారులు, ఆదివాసీల అభిప్రాయం మేరకే చేపడతామన్నారు. 700 చిత్రాలు, గొట్టు గోత్రాలు, సంస్కృతీ సంప్రదాయాలు, వనదేవతల చరిత్రలు, ఆదివాసీల మూలాలు శాశ్వతంగా నిలిచిపోయేలా రాతి కట్టడాలపై లిఖించనున్నట్టు తెలిపారు. దేవస్థానం అభివృద్ధిపై కొందరు పనిగట్టుకొని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, ఇది సరికాదని అన్నారు. ఆదివాసీలు, పూజారుల అభిప్రాయం మేరకు రూపొందించిన దేవస్థానం డిజైన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్టు తెలిపారు.

సుదీర్ఘంగా చర్చించాకే కొత్త డిజైన్లు : జగ్గారావు

మేడారం దేవస్థానం అభివృద్ధిపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలని పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు అన్నారు. మేడారం సమ్మక్క-సారలమ్మ, పడిగిద్దరాజు, గోవిందరాజుల చరిత్రలు పుట్టుపూర్వం ఆదివాసీల మూలాలు, పడగలు, గొట్టు, చిహ్నాలు, జీవిత చరిత్రలు వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించి నూతనంగా డిజైన్లు రూపొందించారని తెలిపారు. రూపొందించిన దేవస్థానం అభివృద్ధిపై తమకు ఎలాంటి సందేహాలు లేవని స్పష్టం చేశారు. భక్తుల విశ్వాసానికి భంగం కలిగించే ప్రచారాలు చేయొద్దని, ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలకు అనుగుణంగానే దేవస్థానం అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు మునీందర్, కృష్ణయ్య, సారయ్య, కిరణ్, సిద్ధబోయిన స్వామి, రఘుపతిరావు, రమేష్, అధికారులు, ఆదివాసీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

కలెక్టరేట్ ప్రజావాణికి 178 ఫిర్యాదులు

స్వీకరించిన అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు నిర్వహించిన ప్రజావాణికి జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై 178 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో ఎక్కువగా గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి 31 ఫిర్యాదులు రాగా హనుమకొండ ఆర్‌డీవో కార్యాలయానికి 15, హౌసింగ్ పీడీకి 10 ఫిర్యాదులు రాగా మిగతావి వివిధ సమస్యలపై వచ్చాయి. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి బాధితుల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత శాఖ అధికారిని పిలిచి వెంటనే సమస్యపై ఎంక్వైరీ చేసి పరిశీలించాలని ఆదేశించారు. ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి గణేష్, పరకాల, హనుమకొండ ఆర్‌డీఓలు డాక్టర్ నారాయణ, రాథోడ్ రమేష్‌తోపాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గాయత్రినగర్ సమస్యలు పరిష్కరించాలి

గ్రేటర్ వరంగల్ మహానగరపాలక సంస్థ పరిధి 56వ డివిజన్‌లోని గాయత్రినగర్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని గాయత్రినగర్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాలనీలో ఆర్‌వోబి ఉందని, ఆర్‌వోబీకి ఒకవైపు సర్వీస్ రోడ్ పూర్తి చేశారని, రెండవ వైపు ఒక ప్రైవేట్ ప్లాట్ వద్ద అసంపూర్తిగా నిలిపివేయడంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షులు దాసరి ఉపేందర్, జనరల్ సెక్రెటరీ ఉడుగుల మల్లేశం, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎలకంటి తిలక్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు విజలు, అఫ్రోజ్‌లు అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



కాలనీ సమస్యలు అదనపు కలెక్టర్‌కు వివరిస్తున్న కాలనీ కమిటీ నాయకులు

మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య హౌస్ అరెస్ట్

- కడియం శ్రీహరిపై రాజయ్య వ్యాఖ్యలతో ఉద్రిక్తత
- క్షమాపణలు చెప్పేదాకా రాజయ్యను తిరగనీయం
- కాంగ్రెస్ నాయకుల హెచ్చరికతో రాజయ్య హౌస్ అరెస్ట్
- దమ్ముంటే రాజీనామా చేసి మళ్లీ పోటీచేయాలి
- కడియం శ్రీహరికి రాజయ్య సవాల్



హనుమకొండలోని నివాసంలో తాటికొండ రాజయ్యను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

హనుమకొండ టౌన్, స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య చేసిన వ్యాఖ్యలు ఉద్రిక్తతకు దారి తీశాయి. కడియం శ్రీహరికి క్షమాపణలు చెప్పే వరకు రాజయ్యను తిరగనివ్వబోమని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. దీంతో రఘునాథపల్లి మండలంలో పార్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న రాజయ్యను హనుమకొండలోని నివాసంలో సుబేదారి పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, నన్నపునేని నరేందర్ బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి రాజయ్యను కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ తాను పదవి (మిగతా 6లో..)

ప్రజాపాలన వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

వరంగల్ కలెక్టర్ సత్యశారద


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్న ప్రజాపాలన వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ సంధ్యారాణిలతో కలిసి ఆమె సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. ఆమెతో పాటు ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు వస్తున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌వో విజయలక్ష్మి, ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బకాయిపై మంత్రులు, ఎమ్మెల్యేలను దిగ్బంధిస్తాం

ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ మంద శ్రీకాంత్



సమావేశంలో మాట్లాడుతున్న మంద శ్రీకాంత్

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఫీజుల బకాయిలపై మంత్రులు, ఎమ్మెల్యేలను దిగ్బంధిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ మంద శ్రీకాంత్ హెచ్చరించారు. హనుమకొండ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో శ్రీకాంత్ మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లను దిగ్బంధిస్తామని అన్నారు. రూ.8158 కోట్ల మేర ఫీజుల బకాయిలున్నాయని అన్నారు. ప్రైవేట్ కళాశాలలు చేస్తున్న నిరసన ఆందోళనలకు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు చదువులు అందేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ యాజమాన్యాల చర్చలు జరిపి న్యాయం చేయాలని అన్నారు. విద్యార్థుల ఫీజులపై రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ నిరసన ఆందోళనలు చేపడుతోందని అన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్, జిల్లా సహాయ కార్యదర్శి బీరెడ్డి జస్వంత్, జిల్లా కమిటీ సభ్యుడు చెన్నూరి సాయికుమార్, మల్లేశ్, నాగరాజు, రాహుల్, సాయి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల సవరణకు సిద్ధంగా ఉండాలి

రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవో సుదర్శన్‌రెడ్డి

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్ఐఆర్) నిర్వహణకు అధికారులు సన్నద్ధంగా ఉం డాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డూప్లికేట్ ఓట్లు, దొంగ ఓట్ల తొలగింపునకు 20 నుంచి 25సంవత్సరాల కు ఒకసారి స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ చేస్తార ని, తెలంగాణ రాష్ట్రంలో 2002లో రివిజన్ చేశారని అన్నారు. ఇందు కోసం మాస్టర్ ట్రైనర్ల ద్వారా బూత్‌స్థాయి సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు.

బీహార్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఇటీవల ఎస్ఐఆర్ చేశారని గుర్తు చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో రిటర్నింగ్ అధికారి, ఏఈఆర్‌ఓ, డిప్యూటీ తహసీల్దార్లు, బీఎల్ఓ సూపర్ వైజర్లతో రెగ్యులర్‌గా సమావేశాలు నిర్వహించాలని, ప్రతిరోజు లక్ష్యాలను నిర్ధేశించుకొని ఎస్ఐఆర్ చేపట్టేలా కార్యాచరణ తయారు చేయాలని సూ చించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బా జ్‌పాయి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్

(5వ పేజీ తరువాయి)

రోగులతో కిటకిటలాడే ఆస్పత్రిపై పెనుభారం పడనుంది. ఎంజీఎం ఆస్పత్రి ఏఎంసీ, ఐఎంసీలో పడకల కోసం క్యూలు కడుతున్నారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల బంద్‌తో కిక్కిరిసిపోయే ప్రమాదం ఉంది.

ప్రత్యామ్నా ఏర్పాట్లకు అధికారులు సిద్ధం

రోగుల తాకిడిని వైద్య అధికారులు గుర్తించి తాత్కాలికంగా పడకలను పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదే విధంగా కొత్తగా నర్సంపేట, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామలలో వైద్య కళాశాల అనుబంధ ఆస్పత్రులలో సేవలు విస్తృతం చేసేందుకు వైద్యాధికారులు నిర్ణయం తీసుకున్నారు. అత్యవసరమైతే తప్ప వరంగల్‌కు రెఫర్ చేయవద్దని సూచించినట్లు సమాచారం. పండగ ముందు ప్రజారోగ్యానికి వైద్య సేవలు ఆటంకం ఇబ్బందిగా మారనుంది.

బతుకమ్మ ఉత్సవ ఏర్పాట్లను పూర్తి చేయాలి

హనుమకొండ కలెక్టర్ స్నేహశబరీష్


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బతుకమ్మ ఉత్సవ ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని కలెక్టర్ స్నేహశబరీష్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల అధికారులు, వేద పండితులతో బతుకమ్మ ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునిత, పద్మాక్షి, వేయి స్తంభాల ప్రధానార్చకులు శంకరశాస్త్రి, గంగు ఉపేంద్రశర్మ, హనుమకొండ ఏసీపీ నర్సింహరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్,ఆర్ అండ్ బీ ఈఈ సురేష్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహశబరీష్ మాట్లాడుతూ.. ఈనెల 21న రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని జిల్లాలోని చారిత్రక ఆలయాల్లో బతుకమ్మ ప్రారంభ ఉత్సవాలకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పనిచేయాలని ఆదేశించారు. ఎక్కువ సంఖ్యలో పాల్గొంటారని మహిళా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు.

మున్సిపల్ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి అవసరమైన పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్ మాట్లాడుతూ ప్రశాంతంగా వేడుకలు జరిగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌వో వైవీ గణేష్, డీఆర్‌డీవో మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, వివిధ శాఖల అధికారులు, వేద పండితులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి పెట్టండి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

99 దరఖాస్తులు స్వీకరించిన కమిషనర్, అధికారులు

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి ద్వారా వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కార మార్గం చూపాలని వరంగల్ నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరించి పరిష్కారనిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు కమిషనర్ అందజేశారు. ఈ సందర్భంగా చహత్ బాజ్‌పాయ్ మాట్లాడారు. నగరంలో శానిటేషన్ సమస్య రాకుండా చూడాలన్నారు. గ్రీవెన్స్‌లో వస్తున్న ఫిర్యాదులే తరుచుగా వస్తున్నాయని సమస్యలు పుణరావృత్తం కాకుండా అధికారులకు చొరవ చూపాలన్నారు. మలేరియా విభాగం అధికారులు, సిబ్బంది దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి 99 ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, పన్నుల అధికారి రామకృష్ణతో పాటు ఏసీపీలు, వింగ్ అధికారులు పాల్గొన్నారు.

అధికారులు స్వీకరించిన ఫిర్యాదులు ఇలా..

● వరంగల్ 34వ డివిజన్ అండర్‌బ్రిడ్జి ప్రాంతంలో వర్షం పడితే రాకపోకలు బంద్ అవుతున్నాయి. హెడ్‌పోస్టాఫీస్ నుంచి వచ్చే నీరు ఇక్కడే నిలువ ఉండడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి పై నుంచి ప్రవహించే మురుగునీటిని బ్రిడ్జి కిందకు రాకుండా దారిమల్లించాలని అంబేద్కర్ సామాజిక ఐక్యవేదిక నాయకులు కమిషనర్‌కు వినతి పత్రం అందించారు.

● వరంగల్ నగరంలో పూర్వం నుంచి మాంసం విక్రయిస్తూ జీవనం కనసాగిస్తున్నాం. ఆరె కటిక కులం వారం ఇప్పటికి దారిద్రరేఖకు దిగువన జీవిస్తున్నాం. తమకు సొంత ఇండ్లు లేవు. శుభకార్యాలు నిర్వ హించుటకు కళ్యాణ మండపాలు లేవు. నగరంలో కళ్యాణ మండపం నిర్మించి అప్పటించాలని వరంగల్ జిల్లా ఆరె కటిక సంఘం నాయకులు కమిషనర్‌ను కలిసి విన్నవించారు.

ఫిర్యాదులు..	
ఇంజనీరింగ్	- 35
హెల్త్, శానిటేషన్	- 13
ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ	- 12
టౌన్‌ప్లానింగ్	- 35
మంచి నీటి సరాఫరా	- 03
హార్టికల్చర్	- 01
మొత్తం	= 99


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ బాజ్‌పాయ్

● వరంగల్ నగరంలో స్వయం సహాయక బృందాలకు సంబంధించిన మహిళల లోన్ డబ్బులను మెప్మాలో పని చేస్తున్న ఆర్‌పీలు, సీవోలు, టీఎంసీ కలిసి అక్రమంగా కాజేస్తున్నారని నగరానికి చెందిన నాగెల్లి సునిత అనే మహిళా మండలి సభ్యురాలు కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. వివిధ మహిళ సంఘాలకు సంబంధించిన సుమారు రూ. 60 లక్షల వరకు కాజేసి మహిళా సంఘాలను మభ్యపెడుతున్నారని సభ్యులకు న్యాయం చేయాలని కమిషనర్‌కు వెల్లడించారు.

కేయూలో నాన్ బోర్డర్లపై పోలీసు కేసులు

●17లోపు ఖాళీ చేయకుంటే చర్యలు ● కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేయూ క్యాంపస్ హాస్టల్స్‌లో అక్రమంగా ఉంటున్న నాన్‌బోర్డర్లపై పోలీసు కేసులు పెట్టి చట్టారీత్యా చర్యలు తీసుకుంటామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం హెచ్చరించారు. సోమవారం కేయూ పరిపాలన భవనం కమిటీ హాల్‌లో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌లతో పాటు అన్ని విభాగాల అధిపతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. నాన్ బోర్డర్లపై ఉదాసీనంగా ఉండొద్దని అన్నారు. సెప్టెంబరు 17వ తేదీలోపు నాన్‌బోర్డర్లందరూ ఖాళీ చేయాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. ఒకవేళ హాస్టల్స్ ఖాళీ చేయకపోతే నిబంధనల మేరకు చట్టరీత్యా వర్సిటీ పోలీసులతో చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలీసు కేసులకు నాన్ బోర్డర్లు బాధ్యత వహించాల్సి వస్తోందని చెప్పారు. ప్రిన్సిపాల్స్, ప్రొఫెసర్స్, జేడీలతో కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. కమిటీ ఎప్పటికప్పుడు హాస్టల్స్‌లపై సమీక్షిస్తోందని పేర్కొన్నారు.

సమయానుకూలంగా ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, ఇతర అధికారులు రాత్రివేళల్లో వర్సిటీ హాస్టల్స్‌లో బసచేసే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత రెండు రోజులుగా వర్సిటీలో ఎంబీఏ విద్యార్థులపై ఓ విద్యార్థి సంఘానికి చెందిన నాన్ బోర్డర్లు దుర్భాషలాడుతూ.. దాడులకు పాల్పడిన నేపథ్యంలో వర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థుల నిరసన ఆందోళలను చర్చించారు. ఈ సమావేశంలో ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, డాక్టర్ నిమ్మ సుదర్శన్, విభాగాధిపతులు మల్లికార్జున్‌రెడ్డి, వాసుదేవారెడ్డి,భారవీశర్మ,కృష్ణవేణి, డాక్టర్‌చిలువేరు రాజ్‌కుమార్, డాక్టర్ మామిడి లింగయ్య, డాక్టర్ సంకినేని వెంకట్, డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య హౌస్ అరెస్ట్

(5వ పేజీ తరువాయి)

త్యాగం చేసి కారుగుర్తుపై కడియం శ్రీహరిని గెలిపిస్తే బీఆర్ఎస్ పార్టీతో పాటు నియోజక వర్గ ప్రజలను మోసం చేసి కాంగ్రెస్‌లో చేరారని ఆరోపించారు. దమ్మంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేయాలని కడియం శ్రీహరికి ఆయన సవాల్ విసిరారు. రాజయ్య గృహ నిర్బంధంతో స్టేషన్ ఘన్‌పూర్ నియోజక వర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు పోటాపోటీగా ఆందోళనలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం రాఘవపూర్‌లో హైడ్రామా నెలకొంది. జాతీయ రహదారిపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు బీఆర్ఎస్ నాయకులు యత్నించడంతో పోలీసులు దిష్టిబొమ్మను లాక్కునేందుకు ప్రయత్నించారు. ఈక్రమంలో తోపులాట జరిగింది. అనంతరం బీఆర్ఎస్ కార్యకర్తలు జాతీయ రహదారిపై బైఠాయించారు. పోలీసులు సర్ది చెప్పడంతో నాయకులు శాంతించారు.

రాజయ్యను హౌస్ అరెస్టు చేయడం సిగ్గు చేటు : మాజీ ఎమ్మెల్యే వినయ్

స్టేషన్ ఘన్‌పూర్ నియోజక వర్గంలో బీఆర్ఎస్ పార్టీ కారుగుర్తుపై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని సోమవారం బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. తాటికొండ రాజయ్యను హనుమకొండలోని వారి నివాసంలో హౌస్ అరెస్టు చేయడాన్ని వినయ్ భాస్కర్ తీవ్రంగా ఖండించారు.బీఆర్ఎస్ నాయకులతో కలిసి దాస్యం వినయ్ భాస్కర్ , వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తాటికొండ రాజయ్య నివాసానికి చేరుకొని రాజయ్యతో మాట్లాడారు. ఈసందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ రాజకీయంగా పబ్బం గడుపుకునేందుకే కడియం శ్రీహరి పార్టీ మారాడని విమర్శించారు. కడియం శ్రీహరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తే స్టేషన్ ఘన్‌పూర్ గడ్డపై గులాబీ జెండా ఖచ్చితంగా ఎగురుతుందన్నారు. కార్యక్రమంలో వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు బతుకమ్మ కానుక

(5వ పేజీ తరువాయి)

ఇవ్వలేదు. అంతకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పంపిణీలో భాగంగా మహిళా సంఘాల సభ్యులకు కూడా చీరెలను పంపిణీ చేసేది. మెప్మా సభ్యులకు కూడా చీరెలను పంపిణీ చేస్తారు. మహిళకు రెండు రకాల చీరలను అందిస్తుండగా.. ఇందులో 6.30 మీటర్ల చీరలు, 9 మీటర్ల చీరెలు ఉంటాయి. చీరల పంపిణీకి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అందించనున్న చీరలు చేనేతవి కావడమే కాకుండా చాలా మన్నికగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఒక్కొక్క చీర సుమారు రూ. 800 విలువ ఉంటుందని చెబుతున్నారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులకు పంపిణీ చేసే చీరెలను వరంగల్ జిల్లాతో పాటు కరీనగర్, సిరిసిల్ల జిల్లాలోని పలు ప్రాంతాల్లో తయారు చేయించారు. టెస్కో పెట్టిన ఆర్డర్ ప్రకారం ఆ సంస్థ ఇచ్చిన డిజైన్, రంగుల మేరకే చీరలను నేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వర్ రావు, చేనేత జౌళి శాఖ కమిషనర్ శైలజా రామయ్యర్ ఎంపిక చేసిన డిజైన్లలో చీరలు తయారయ్యాయి.

రేపు ప్రజాపాలనా దినోత్సవం

● జాతీయ పతాకాలు ఎగురవేసేది వీరే..
● ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హనుమకొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిజాం విముక్తి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 17వ తేదీన నిర్వహించే ప్రజా పాలనా దినోత్సవం సం దర్భంగా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో జాతీయ పతాకా లను ఆవిష్కరించే మంత్రులు, కార్పొరేషన్ చైర్మన్లను ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సోమవారం ఉత్త ర్వులు జారీ చేసింది.

వరంగల్ జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి సురేఖ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో తెలంగాణ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ బెల్లయ్య నాయక్, జనగామ జిల్లాలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మహబూబాబాద్ జిల్లాలో డిప్యూటీ స్పీకర్ జె రామచంద్ర నాయక్, ములుగు జిల్లాలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, హనుమకొండ జిల్లాలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జాతీయ పతాకాలను ఎగురవేస్తారు.

భర్తపై హత్యాయత్నం

●ప్రియుడితో కలిసి దాడి చేసిన భార్య
● వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని దారుణం
● మహబూబాబాద్ మండలం గడ్డిగూడెంలో ఘటన

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని భర్తపై కక్ష పెంచుకున్న భార్య ప్రియుడితో కలిసి దాడికి పాల్పడింది. ఆమె భర్తను పట్టుకోగా.. ప్రియుడు కత్తితో పొడిచాడు. ఈ సంఘటన మహబూబాబాద్ మండలంలోని గడ్డిగూడెంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితుడి తండ్రి పాపయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గడ్డిగూడెం గ్రామానికి చెందిన మేడ పాపయ్య-భద్రమ్మల పెద్ద కుమారుడు మేడ ప్రసాద్‌కు పాకాల కొత్తగూడెం గోవిందాపురం గ్రామానికి చెందిన ఈక రాజు-సుమలతల కుమార్తె రష్మితతో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. ఆ దంపతులకు కుమారుడు సంతానం. ప్రసాద్ గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. 6 నెలల క్రితం రష్మితకు ఇన్‌స్టాగ్రామ్‌లో మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం మర్రిగూడెం గ్రామానికి చెందిన మద్దెల అనిల్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. అది కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. దీనికి భర్త ప్రసాద్ అడ్డు వస్తున్నాడనే కారణంతో ప్రియుడితో కలిసి భర్తను చంపేయాలని నిర్ణయానికి వచ్చారు.


జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రసాద్

ఈ నెల 14న రాత్రి ప్రసాద్ భార్య రష్మిత ప్రియుడు అనిల్‌కు ఫోన్ చేసి గడ్డిగూడెంనకు రప్పించింది. కుటుంబ సభ్యులు గాఢ నిద్రలోకి జారుకున్న అనంతరం ప్రియుడు అనిల్, రష్మిత కలిసి భర్త ప్రసాద్‌పై కత్తితో దాడి చేయడంతో చెవి, ఛాతి, చేతులు, కాళ్లపై గాయాలయ్యాయి. దీంతో అతను కేకలు వేయడంతో పక్కనే ఉన్న తల్లిదండ్రులు, సోదరుడు ఇంటికి వచ్చారు. దాడి చేసిన అనిల్‌ను తాళ్లతో చెట్టుకు కట్టేసి మహబూబాబాద్ రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని అనిల్, రష్మితను అదుపులోకి తీసుకుని మానుకోట రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా, తీవ్రంగా గాయపడ్డ ప్రసాద్‌ను కుటుంబ సభ్యులు మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిగా తరలించి చికిత్సనందిస్తున్నారు. కాగా, బాధితుడి తండ్రి పాపయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దీపికారెడ్డి తెలిపారు.

జానపద విజ్ఞాన పీఠంలో ఎంఏ తెలుగు స్పాట్ అడ్మిషన్లు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వరంగల్ హంటర్‌రోడ్‌లోని తెలుగు యూనివర్సిటీ జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో ఈ నెల 19, 20న ఎం.ఏ తెలుగు అడ్మిషన్లకు స్పాట్ నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎం.ఏ తెలుగు రెగ్యులర్ విధానంలో చేసేందుకు ఆసక్తి కలిగి అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు 99891 39136/ 99894 17299 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం నగరంలోని పలు సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి. సాంబరెడ్డి తెలిపారు. బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని సాయి నగర్, స్విమ్మింగ్ పూల్ ఏరియా, బాలసముద్రం, పబ్లిక్ గార్డెన్ ఏరియా, రాంనగర్, గోకుల్‌నగర్ ఏరియా, లష్కర్ బజార్ మెయిన్ రోడ్డు, పబ్లిక్‌గార్డెన్, లష్కర్‌బజార్ ఏరియాలో ఉదయం 9.30 నుంచి 11.30 వరకు, హనుమకొండ చౌరస్తా, కాకాజీకాలనీ అశోక జంక్షన్, కాంగ్రెస్‌భవన్, టైలర్ స్ట్రీట్, జేఎన్ స్టేడియం, కేడీసీ హనుమకొండ ఏరియాలో ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు, మెటర్నిటీ ఆసుపత్రి, లష్కర్‌బజార్ ఏరియాలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

ముదిరాజ్‌లు రాజకీయాల్లో రాణించాలి

వడ్డెపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ యువత రాజకీయాల్లో రాణించాలని ముదిరాజ్ ఎంప్లాయీస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండ 56వ డివిజన్ గోపాల్‌పూర్ జవహర్ కాలనీలోని మెపా రాష్ట్ర కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పులి రాజేష్‌ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం 8వ డివిజన్ మెపా కమిటీని ఎన్నుకొని వారికి నియామక పత్రాలను అందజేశారు. డివిజన్ అధ్యక్షుడిగా నర్ర దయాకర్, ప్రధాన కార్యదర్శిగా పులి మహేష్, కోశాధికారిగా పెద్దమ్మల రాకేష్ ఎన్నికయ్యారు. సమావేశంలో హనుమకొండ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గోనెల సాగర్, ఉపాధ్యక్షుడు గోనెల దేవేందర్, పులి లక్ష్మీనారాయణ తదితరుల పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7440	5300
మక్కలు	2100	1521
కందులు	4352	3022
పెసళ్లు	6250	3022
పల్లికాయ (సూక)	5900	3500
పల్లికాయ (పచ్చిది)	3700	2400
పసుపు (కాడి)	10510	7889
పసుపు (గోల)	9580	8996
తేజ మిర్చి	12000	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	16300	12000
యూఎస్341ఏసీ	14000	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

సామాన్యులే.. సాయుధులై..

- పోరులో రక్తమోడిన తమ్మడపల్లి(జి)
- 12 మందిని కాల్చి చంపిన నిజాం సేనలు
- ఎదురొడ్డి పోరు నడిపిన అచ్చమాంబ
- అమరులను స్మరించుకుంటున్న పోరుగడ్డ
- 17న తెలంగాణ విమోచన దినోత్సవం


తమ్మడపల్లి(జి)లోని అమరుల స్మారక స్థూపం

జఫర్‌గడ్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ సంస్థానాన్ని నిజాం నిరంకుశ పాలకుల నుంచి విముక్తి చేసేందుకు, భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం సామాన్యులే సాయుధులై.. సారథులుగా మారిన తెలంగాణ విమోచనోద్యమంలో వీరుల త్యాగాలు వెలకట్టలేనివి. జనగామ జిల్లాలో పాలకుర్తికి చెందిన చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం భూ పోరాటానికి నాంది పలకగా.. దొడ్డి కొమురయ్య ఆత్మార్పణతో సాయుధ పోరాటంగా మారింది. ఆయన బలిదానం తెలంగాణలో ప్రజా వెల్లువను సృష్టించింది. 'నీ బాంచెన్.. కాల్మొక్తా' అంటూ జోడించిన చేతులు బందూకులు పట్టాయి. దశాబ్దాల దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సామాన్యులే సాయుధులై జరిపిన పోరాటమే.. నాటి తెలంగాణ సాయుధ పోరాటం.

జఫర్‌గడ్‌లో పోరాట క్రమం..

తెలంగాణ సాయుధ పోరులో భాగంగా జఫర్‌గడ్ ప్రాంతంలో నైజాం, రజాకార్లు, భూస్వాముల అణచివేత, నిర్బంధకాండకు వ్యతిరేకంగా ప్రజలు, రైతులు ఉద్యమించారు. జఫర్‌గడ్‌ను కేంద్రంగా చేసుకుని పాలిస్తున్న నైజాం పాలకుల అనుచరుడైన రజాకార్ల నాయకుడు పాల్పడుతున్న ఖాదరెల్లి వేధింపులు, దౌర్జన్యాలను అరికట్టేందుకు, రజాకార్లు, జాగీర్‌దారుల ఆగడాలను ప్రజలు రక్షక దళాలను ఏర్పరచుకుని చేతికందిన రాళ్లు, కర్రలు, వడిసెలు, బరిసెలు, కత్తులు వంటి సంప్రదాయ ఆయుధాలతో ఎదుర్కొని పోరాడారు. కమ్యూనిస్టు దళ నేతలు నల్ల నర్సింహులు, కృష్ణమూర్తి, యాదగిరిరావు, కూనూరు నెల్లుట్ల మోహన్‌రావు, పెండ్యాల రాఘవరావు, పంబాల రాఘవరావు, ఎలమంద తదితరులు సంచరిస్తూ రక్షక దళాలు, ప్రజలు, రైతులను చైతన్యపరిచేవారు.

12 మందిని కాల్చి చంపిన పోలీసులు...

సాయుధ పోరులో భాగంగా 1947, సెప్టెంబరు 11న జరిగిన ఆంధ్ర మహాసభ తీర్మానాన్ని స్ఫూర్తిగా తీసుకుని జఫర్‌గడ్ ప్రాంతంలో నిర్బంధకాండను సాగిస్తున్న రజాకార్ల నాయకుడు ఖాదరెల్లి ఆగడాలకు వ్యతిరేకంగా పలు గ్రామాల ప్రజలు, రైతులు తిరగబడి నిజాం, రజాకార్ల ప్రతినిధులను తరిమేశారు. దీంతో ఆగ్రహించిన ఖాదరెల్లి పోలీసులు, అనుచరులతో ప్రజలపై దాడులు చేయించాడు. ఈ దాడుల క్రమంలో తిరగబడుతున్న పోరాట యోధులను హతమార్చేందుకు 1948, సెప్టెంబరులో నిజాం, రజాకార్ల పోలీసు మూకలు మండలంలోని తమ్మడపల్లి(జి) గ్రామాన్ని చుట్టుముట్టి.. గ్రామానికి చెందిన 12మందిని నిర్బంధించి గ్రామ సెంటర్‌లో నిలబెట్టి వారిపై నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో చాడ అనంతరెడ్డి, బత్తిని బక్కరాజయ్య, దొంతూరి చినమల్లయ్య, ఎరుకలి ఇద్దయ్య, గుండెమల్ల పోశాలు, చెదలు నర్సయ్య, ఎండి.ఖాసీం, గుజ్జరి రామయ్య, దిడ్డి పెరుమయ్య, దుద్యాల చిన్ననర్సయ్య, గంద్రకుంట కోమటి నర్సింహరామయ్య, కుంట పెద్దాపురంలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 8 మంది గాయాలతో ప్రాణాలు దక్కించుకున్నారు. ఈ ఘటనపై ప్రజలు ఆగ్రహావేశాలతో జఫర్‌గడ్‌లోని రజాకార్ల నేత ఖాదరెల్లి బంగ్లాపై దాడి చేసి, అతడి పశువుల కొట్టం, మొక్కజొన్న గూళ్లను దహనం చేశారు. పశువులను గ్రామాల్లో ప్రజలకు పంపిణీ చేశారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా నాటి పోరాట క్రమాన్ని ప్రజలు చర్చించుకుంటూ జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్నారు.

ఆయుధం పట్టిన అచ్చమాంబ..

జిల్లాలోని జఫర్‌గడ్ మండలం కూనూరుకు చెందిన నెల్లుట్ల సుశీలాదేవి అచ్చమాంబ పేరుతో భర్త నెల్లుట్ల మోహన్‌రావుతో కలిసి నాటి తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయుధం పట్టింది. ప్రత్యక్షంగా పాల్గొని నిజాం, రజాకార్లు, భూస్వాముల ఆగడాలు, దుశ్చర్యలకు వ్యతిరేకంగా మహిళలు, ప్రజలను చైతన్యవంతం చేస్తూ పోరాటం సాగించారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం గొల్లచర్ల గ్రామానికి చెందిన అచ్చమాంబ 14 ఏళ్ల వయసులోనే నైజాం, రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న క్రమంగా ఉద్యమంలో కూనూరుకు చెందిన దళ నేత నెల్లుట్ల మోహన్‌రావుతో పరిచయం ఏర్పడడంతో వారిద్దరూ వివాహం చేసుకున్నారు. పోరాటంలో గాయపడిన కార్యకర్తలకు వైద్యం చేస్తూ.. మరోవైపు ఆమె మహిళలను చైతన్యవంతం చేస్తూ దళనాయకులతో కలిసి ఆయా ప్రాంతాల్లో సంప్రదాయ ఆయుధాలతో సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకం. భర్త చనిపోగా సుశీలాదేవి ప్రస్తుతం హనుమకొండలో కుమార్తె వద్ద ఉంటోంది.


సాయుధ పోరాటంలో పాల్గొన్న కూనూరుకు చెందిన నెల్లుట్ల సుశీలాదేవి (ఫైల్)

రెచ్చిపోతున్న రౌడీ షీటర్లు

- దందాలు, సెటిల్‌మెంట్లలో బిజీబిజీ
- మాట వినకపోతే భౌతికదాడులు
- పోలీసుల కౌన్సెలింగ్‌కు సైతం దూరం
- ఖాకీలకు సవాల్‌గా మారిన గ్యాంగులు



మట్టెవాడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పగలంతా జులాయిగా తిరగడం.. రాత్రయిందంటే మద్యం సేవించి గొడవలు సృష్టించడం నగరంలో సర్వసాధారణం అయిపోయాయి. గతంలో రౌడీల ఆగడాలు కొంత మేరకు తగ్గినా పోలీసుల నిఘా కొరవడడంతో ఇటీవల మళ్లీ ఎక్కువయ్యాయి. వరంగల్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీలు రెచ్చి పోతున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో భూ దందాలు, సెటిల్‌మెంట్లు చేస్తున్నారు. మాట వినకపోతే భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. పోలీసులు నెలవారీగా నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌లకు సైతం కొంత కాలంగా రౌడీ షీటర్లు హాజరుకావడం లేదు. ఇటీవల గణపతి నిమజ్జనం రోజున కరీమాబాద్ ప్రాంతంలో ఒక రౌడీ షీటర్ తన గ్యాంగుతో వచ్చి గణేశ్ మండప నిర్వాహకులపై దాడికి పాల్పడ్డారు. ఈ నెల 7వ తేదీన మండిబజార్‌లోని ఒక హోటల్ వద్ద ఇద్దరు యువకులతో గొడవ పడి బీరు బాటిల్‌తో దాడికి పాల్పడ్డారు. సదరు రౌడీ షీటర్‌పై మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో, మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కాని ఇప్పటివరకు పోలీసులు అతడిని అరెస్టు చేయలేదు. రౌడీ షీటర్లను కట్టడి చేయడంలో పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

దాడులు, సెటిల్‌మెంట్లు..

నగరంలోని రౌడీ షీటర్లు ల్యాండ్ సెటిల్‌మెంట్లలో బీజీగా ఉంటున్నారు. కొంత మంది రియల్టర్లు, రాజకీయ నేతల అండతో భూ కబ్జాలకు పాల్పడుతున్నారు. రాత్రికి రాత్రే పట్టా భూముల్లో పాగా వేస్తున్నారు. యాజమానులను రౌడీలతో బెదిరిస్తున్నారు. ఇటీవల వరంగల్ పోలీస్టేషన్ పరిధిలో ప్రైవేట్ గ్యాంగు కాలనీ స్థలాన్ని కబ్జా చేశారు. కాలనీవాసులు అడ్డుకుంటే వారిపైన దాడులకు పాల్పడ్డారు. ఈ విషయంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని చేతులు దులుపుకున్నారు. సివిల్ కేసు అని చెప్పి వెనక్కి పంపిస్తున్నారు. ఏదోలా సెటిల్‌మెంట్లు చేసుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నారు.

కౌన్సెలింగ్‌కు రౌడీ షీటర్లు దూరం..

పోలీసులు నెలవారీగా నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌లకు చాలా మంది రౌడీ షీటర్లు హాజరుకావడం లేదు. కొంత మంది రాజకీయ నేతలతో ఫోన్లు చేయించుకుంటున్నారు. ఇటీవల వరంగల్ సబ్ డివిజన్ పరిధిలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు చాలా మంది రౌడీ షీటర్లు హాజరు కాలేదు. పోలీసులకు తెలియకుండా కొంతమంది రౌడీలు గొడవలు సృష్టిస్తున్నా పోలీసులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

అర్ధరాత్రి వరకు హోటళ్లు.. బార్లు..

వరంగల్ ప్రాంతంలో అర్ధరాత్రి వరకు యథేచ్ఛగా బిర్యానీ సెంటర్లు, బార్లు, బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారు. పోలీసులు నామమంత్రంగా పెట్రోలింగ్ నిర్వహిస్తుడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వరంగల్ మండిబజార్, ఎల్‌బీనగర్, నిజాంపుర, చౌర్‌బౌళి ప్రాంతంలో అర్ధరాత్రి వరకు టిఫిన్ సెంటర్లు, హోటళ్లు తెరిచి ఉండడంతో తరచూ మద్యం సేవించిన వాళ్లు గొడవలు సృష్టిస్తున్నారు.

రౌడీ షీటర్లపై నిఘా ఏది..


వరంగల్ మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్, మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ల పరిధిలో కొంతమంది రౌడీషీటర్లు తరుచుగా గొడవలకు పాల్పడున్నా పోలీసులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో 19 మంది రౌడీషీటర్లు ఉండగా డీసీ, కేడీ, సస్పెక్టు కేసుల్లో మరో 50 మంది ఉన్నారు. ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 16 మంది రౌడీషీటర్లు, డీసీ, కేడీ, సస్పెక్టు షీట్‌లో మరో 87 మంది ఉన్నారు. మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌పరిధిలో 74 మంది రౌడీ షీటర్లు ఉన్నారు. సస్పెక్టు షీట్, డీసీ, కేడీ షిట్‌లో మరో 166 మంది ఉన్నారు. పోలీసుల నిఘా పూర్తిస్థాయిలో లేకపోవడంలో వారు తరచుగా గొడవల్లో తలదూరుస్తున్నారు.

రౌడీ షీటర్లతో పోలీసుల దోస్తానా..

వరంగల్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో కొంతమంది రౌడీషీ టర్లతో కొందరు పోలీసులు ఫ్రెండ్‌షిప్ చేస్తున్నారని, వారితో కలిసి పార్టీలు చేసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా ఖిలావరంగల్, కరీమాబాద్, ఉర్సుగుట్ట, హంటర్‌రోడ్డు, రంగంపేట, రామన్నపేట, కొత్తవాడ, దేశాయిపేట, కాశిబుగ్గ, ఎల్‌బీనగర్ తదితర ప్రాంతాల్లో ఎక్కువగా రెచ్చిపోతూ గొడవల్లో తలదూరుస్తున్నాని నగర ప్రజలు మండిపడుతున్నారు.

రజాకార్ల రాక్షసత్వం

8 మంది తెలంగాణ యోధులు బలి


తెలంగాణ యోధులను రజాకార్లు కాల్చి చంపిన నరహరి తండాలోని గుట్ట

భీమదేవరపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా తెలంగాణ యోధులు నడుం బిగించిన రోజులు.. నిజాం రాక్షసత్వానికి చరమగీతం పాడాలని తహతహలాడుతున్న తెలంగాణ యోధులపై రజాకార్లు కక్ష కట్టారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం రాయికల్ పాత పోలీస్‌స్టేషన్‌పై దాడి చేసి తెలంగాణ యోధులు తుపాకులు ఎత్తుకెళ్లారు. దీంతో భీమదేవరపల్లి మండలంపై రజాకార్లు ఎనిమిది మంది తెలంగాణ యోధులపై తుపాకీ గుండ్ల వర్షం కురిపించారు. ముల్కనూర్ గ్రామానికి చెందిన కూన రేశయ్య, ఎర్రబెల్లి గ్రామానికి చెందిన లంబాడ నాగ్యా, ముత్తారం గ్రామానికి చెందిన మేకల కొంరయ్య, రేణుకుంట్ల వెంకటయ్య, రాజయ్య, ఎలబోయిన అయిలయ్య, కొడూరి వెంకటయ్యను రజాకార్లు పట్టుకున్నారు. వీరందరిని భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ నరహరి తండా మధ్యలోని వజ్రపు గుండుకు వరుసగా నిలబెట్టి రజాకార్లు తుపాకీ గుండ్ల వర్షం కురిపించారు. 8 మంది తెలంగాణ పోరాట యోధులను ఒకేసారి కాల్చి చంపడం అప్పట్లో పెద్ద సంచలనం సృష్టించింది. తెలంగాణ యోధులు మిలిటెంట్ వ్యవస్థగా ఏర్పడి రజాకార్లతో పోరు సల్పేందుకు ప్రయత్నిస్తున్నారని రజాకార్లు కక్ష కట్టారు. 3 గ్రామాలకు చెందిన ఎనిమిది మంది తెలంగాణ యోధులను పట్టుకచ్చి వజ్రపు గుండుకు కాల్చి చంపడం ఈ ప్రాంతంలో ఇప్పటికీ చర్చనీయాంశంగా మారింది. రజాకార్ల రాక్షసత్వానికి వజ్రపు గుండు నిలువెత్తు సాక్షంగా మారింది.

ఉల్లికోడు తెగులు - నివారణ చర్యలు

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వానాకాలం వరిలో ఉల్లికోడు తెగులు ఆశిస్తున్నది. దీని నివారణకు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి రీజనల్ అగ్రికల్చర్ రీసెర్చ్ సెంటర్(వరంగల్) ప్రధాన శాస్త్రవేత్త ఎల్.కృష్ణ కొన్ని సూచనలు ఇస్తున్నారు. వానాకాలం సీజన్‌లో ఆలస్యంగా నాటు వేయడం వల్ల ఈ తెగులు ఆశిస్తుందని అంటున్నారు. ఉల్లికోడ లక్షణాలు, నివారణ చర్యల గురించి ఆయన మాటల్లోనే తెలుసుకుందాం..

తెగులు లక్షణాలు..

కీటకాలు వరి ఆకుల కొనల దగ్గర, ముువ్వ మట్టలమీద విడివిడిగాను, లేదా గుంపులు గుంపులగాను గుడ్లు పెడుతాయి. వీటి నుంచి పిల్ల పురుగులు బయటకు వచ్చి అంకురం వద్ద చేరి నష్టం చేస్తాయి. అంకురం లేతాకుపచ్చ లేదా ఆకుపచ్చని పొడవాటి గొట్టంగా మార్పు చెంది బయటకు వస్తుంది. వీటిని గొట్టాలు, రాగి గొట్టాలు, ఉల్లి గొట్టాలని

రైతులకు శాస్త్రవేత్తల సలహాలు

పిలుస్తారు. ఈ పురుగు ఆశించిన పిలక నుంచి ఎలాంటి కంకులు ఏర్పడవు. పక్క పిలుకలు ఎక్కువగా వస్తాయి.

నివారణ చర్యలు



సిఫారసు చేసిన సమయం లోపల నాట్లు పూర్తి చేయాలి. డబ్ల్యూజీఎల్ -1119 లాంటి తట్టుకునే రకాలను సాగు చేయాలి. పొలం గట్లపై కలుపులేకుండా చూసుకోవాలి. నాటిన 10-15 రోజులలో ఎకరానికి 10కిలోల కార్బోఫ్యూరాన్ 3 సీజీ గులికలు బురుద పదునులో చల్లాలి. లేదా ఫిప్రోనిల్ 5 ఎస్‌సీ లీటరు నీటిలో 2.5 మి.మీ నీటి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. ముఖ్యంగా ఆగస్టు చివరి వారంలో నాట్లు వేసిన రైతులు ఎకరానికి 10 కిలోల చొప్పున కార్బోఫ్యూరాన్ 3సీజీ గులికలు చల్లాలి.

రోడ్డెక్కిన అంగన్‌వాడీలు

- పీఎంశ్రీ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్
- మంత్రి సురేఖ ఇంటి ముట్టడికి యత్నం
- మంత్రి హామీతో ఆందోళన విరమణ



రాంనగర్ కొండా సురేఖ ఇంటి ముందు బారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు

రాంగనర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పీఎంశ్రీ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోతున్న ప్రీ ప్రైమరీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం అంగన్‌వాడీలు తలపెట్టిన మంత్రి సురేఖ ఇళ్ల ముట్టడి ఉద్రిక్తతలకు దారి తీసింది. ఉమ్మడి జిల్లాలోని వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్ జిల్లాల నుంచి తరలివస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు ఎక్కడికి అక్కడ ముంద స్తు అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్‌లలో నిర్బందించారు. హనుమకొండ రాంనగర్‌లోని మంత్రి నివాసం ఉండే పరిసరాల్లోకి అంగన్‌వాడీలు రాకుండా బారికేడ్లు ఏర్పాట్లు చేసి దారులు మూసివేశారు. అయినా గ్రేటర్ వరంగల్‌లోని అంగన్‌వాడీలు పోలీసుల నిర్బందాలను, అడ్డగింతలను దాటుకొని మంత్రి నివాసం వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, అంగన్‌వాడీలకు మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. అరెస్టు చేసిన వారందరిని వెంటనే విడుదల చేయాలని భీష్మించుకొని కూర్చోవడంతో నిర్బందించిన వారినంతా వదిలేయడంతో వారంతో సురేఖ ఇంటి వద్దకు చేరుకున్నారు.

ఈ సందర్భంగా సీఐటీయూ అనుంబంధ సంఘమైన అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ గౌరవధ్యక్షుడు రాగుల రమేశ్ మాట్లాడుతూ ప్రమాదకరమైన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకించాల్సిన ప్రభుత్వం భిన్నంగా వ్యవహరిస్తూ ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయాలని చేస్తుందని మండిపడ్డారు. పీఎం శ్రీవిద్య పథకంలో భాగంగా ఐదు సంతవత్సరాల లోపు పిల్లలను విద్యాశాఖకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకోవడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకొని ప్రీ ప్రైమరీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు తప్పనిసరిగా చేసిన ఫేస్ క్యాప్చర్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. ఎఫ్‌ఆర్‌ఎస్‌కు పోషకహారానికి లింకు పెట్టడం వల్ల చాలా మంది పేదలు నష్టపోతున్నారని తక్షణమే ఈ విధానం రద్దు చేసి 5 జీ నెట్‌వర్క్ మొబైల్స్‌ను అందించాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను 13 నెలల కింద ప్రకటించి ఇప్పటి వరకు ఇవ్వకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. కాంగ్రెస్ మ్యాఫెస్టోలో 18,000 వేతనం, పీ.ఎఫ్ సౌకర్యం కల్పిస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలు చేయడం లేదన్నారు. కాగా, స్థానిక సీఐ మేకల రంజిత్‌తో పాటు మంత్రి నివాసంలో అందుబాటులో ఉన్న పీఏతో మంత్రి ఫోన్‌లో మాట్లాడి తాను లోకల్‌లో లేను వరంగల్ రాగానే అంగన్‌వాడీ నాయకులతో ప్రత్యేకంగా సమావేశమై డిమాండ్లను పరిష్కరించేదిశగా కృషి చేస్తానని అంగన్‌వాడీలకు చెప్పాలని తెలపడంతో అదే విషయాన్ని సీఐ, పీఏ అంగన్వాడీలకు చెప్పడంతో 15 సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రి పీఏకు ఇచ్చి ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, సీఐటియు జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, ఉపాధ్యక్షుడు బోట్ల చక్రపాణి, చుంచు విజేందర్, అంగన్వాడీ కార్యకర్తలు వీరగోని నిర్మల, శోభరాణి, రాజేశ్వరీ, రమాదేవి, జమున, హైమావతి, రజిత, అనిత, శారద, షైముదా, అంజుమ్, వందలాది అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

22న పత్తి రైతుల సమస్యలపై సదస్సు

రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

గిర్మాజిపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చే లక్ష్యంతో ఈనెల 22న ఉమ్మడి వరంగల్ జిల్లా పత్తి రైతుల సదస్సు నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ తెలిపారు. వరంగల్ అబ్బనికుంటలో గల తెలంగాణ రైతు భవనంలో సోమవారం రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ ఉపాధ్యక్షుడు ఉరటి ఆంశాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సోమిడి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పత్తి దిగుమతులపై ప్రస్తుతం ఉన్న 11 శాతం సుంకాన్ని ప్రధాని నరేంద్రమోదీ ఎత్తివేయడంతో దేశంలోని పత్తి రైతుల పరిస్థితి అగమ్యగోచరంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. 11 సంవత్సరాలుగా మోదీ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా పనిచేస్తున్నదని ఆరోపించారు. ఆయనకు రైతుల సంక్షేమంపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వ్యవసాయ కమిషన్ ప్రకటించిన ప్రకారం పత్తి క్వింటాకు కనీస మద్దతు ధర రు.12,000/లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అబ్బనికుంటలోని రైతు సంఘం భవనంలో జరిగే సదస్సుకు రిటైర్డ్ జడ్జి జస్టిస్ బి.చంద్రకుమార్, ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ పాల్గొంటారని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పత్తి రైతులు ఈ సదస్సుకు తరలిరావాలని కోరారు. అనంతరం సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కత్తి సుధాకర్, జిల్లా నాయకులు ఎం. పీరయ్య, ఎస్.భిక్షపతి, జె.జనార్దన్‌రెడ్డి, కె. రవీందర్, బి. ఎల్లయ్య పాల్గొన్నారు.

పెద్ద సదువులు బంద్

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పాల్గొన్న అన్ని ప్రైవేటు కాలేజీలు
- రోడ్డెక్కిన డిగ్రీ, పీజీ, ఫార్మసీ, ఇంజనీరింగ్ విద్యార్థులు
- రాస్తారోకోతో అదాలత్ వద్ద ఉద్రిక్తం
- రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్

హనుమకొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య పిలుపు మేరకు సోమవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్నత విద్యా సంస్థలు బంద్ పాటించాయి. మొత్తం 397 డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, ఇతర వృత్తివిద్యా కళాశాలలు బంద్‌లో పాల్గొన్నాయి. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు, వాటిలో పని చేసే అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో రోడ్డెక్కారు. ర్యాలీ, ధర్నాలు నిర్వహించారు. కళాశాలల బంద్ దృష్ట్యా వీటి ఆధ్వర్యంలో నడిచే హాస్టళ్లలోని విద్యార్థులను ఆదివారమే ఖాళీ చేయించారు. బంద్ విరమణ జరిగే వరకు ఎవరూ రావద్దని తెలియచేశారు. హనుమకొండతో పాటు వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో సైతం ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థలు బంద్‌లో పాల్గొన్నాయి.

భారీ ర్యాలీ

హనుమకొండ హంటర్ రోడ్డు నుంచి సుబేదారిలోని అదాలత్ సెంటర్ వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడవద్దని, ఫీజు బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్యా వ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని రాసిన ప్లకార్డులను ర్యాలీలో ప్రదర్శించారు. ఈ ర్యాలీకి ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థలకు చెందిన యాజమాన్యలు సంఘీభావం తెలిపాయి. పీజీ, డిగ్రీ కళాశాలల వ్యవస్థాపక అధ్యక్షుడు సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ ర్యాలీలో పాల్గొని మద్దతు ప్రకటించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

ధర్నా, బైఠాయింపు

ఆదాలత్ సెంటర్ వద్ద విద్యార్థులు రోడ్డుపై బైఠాయించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఆందోళన చేస్తున్న విద్యార్థులను పోలీసులు సుబేదారి పీఎస్‌కు తరలించారు. విద్యార్థులను బలవంతంగా తొలగించడంతో వారికి పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

రీయింబర్స్‌మెంట్ ఎత్తివేసే కుట్ర

హనుమకొండ ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాషబోయిన సంతోష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే ఫీజు బకాయిలు చెల్లించడం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వద్ద విద్యాశాఖ ఉన్నా ఫీజు బకాయిలు విడుదల చేయడకపోవడం ఆయన నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. సీఎం ఫీజు బకాయిల విడుదలపై మాట తప్పారని, గతంలో డిగ్రీ కళాశాలలు రాష్ట్రవ్యాప్తంగా సెమిస్టర్ పరీక్షలు బహిష్కరించడం వల్ల సకాలంలో పరీక్షలు జరగలేదన్నారు. ఫీజు బకాయిలు విడుదల చేస్తామని చెప్తే పరీక్షలు నిర్వహించామని గుర్తు చేశారు. కానీ ఇప్పటికీ ఫీజు బకాయిలు విడుదల కాక డిగ్రీ పూర్తయిన విద్యార్థులు డబ్బులు కట్టి మరీ సర్టిఫికెట్లను తీసుకుంటున్నారన్నారు. ఇప్పుడు ఇంజనీరింగ్ కాలేజీలు సైతం ఈనెల 15 నుంచి ఫీజు బకాయిలు విడుదల చేసే వరకు నిరవధికంగా బంద్ చేస్తామని ప్రకటించాయన్నారు. బంద్ వల్ల విద్యార్థుల చదువులపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరు ప్రణీత్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు కుక్కల కుమార్, వేల్పుల చరణ్, జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జు జ్యోతి, జిల్లా సమితి సభ్యులు వినయ్, టీపీడీపీఎంఏ నాయకులు ఆందోళనలో పాల్గొన్నారు.


అదాలత్ వద్ద రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

బంద్ చేసినా స్పందించరా ?

ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సుందర్‌రాజ్ యాదవ్

రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థలు బంద్ పాటిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వంలో ఏ మాత్రం చలనం లేదని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ ధ్వజమెత్తారు. కళాశాల బంద్ వల్ల విద్యార్థులకు ఎంతో నష్టం జరుగుతుందన్నారు. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. ఫీజు బకాయిలు చెల్లించకపోడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేయాలని ప్రభుత్వ కుట్ర పన్నుతున్నదని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులకు వేతనాలు చెల్లించేందుకు, సంక్షేమ పథకాలపై కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వానికి పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయడానికి మాత్రం చేతులు రావడం లేదన్నారు.

అంబేద్కర్ సంఘం కమిటీ ఎన్నిక

మడికొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని అంబేద్కర్ సంఘం నూతన వార్డు కమిటీ సోమవారం ఏగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా రొడ్డ దయాకర్, ప్రధాన కార్యదర్శిగా మద్దెల రవికుమార్, ఉపాధ్యక్షులుగా మూల నాగరాజ్‌వర్మ, జానపట్ల నిరంజన్‌రావు, కట్ట నాగేష్, కోశాధికారిగా మూల నవీన్‌కుమార్, సలహాదారులుగా వెన్నమల్ల రమేష్, మూల వెంకటస్వామి, జానపట్ల రాజేందర్, దార సూరి ఎన్నికయ్యారు. ఎన్నికైన కమిటీ సభ్యులు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి పదవీ ప్రమాణ స్వీకారం చేశారు.

కట్టపోచమ్మ ఆలయ నూతన కమిటీ

మడికొండలోని కట్టపోచమ్మ ఆలయ నూతన కమిటీ ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షులుగా దువ్వ సర్వేశ్వర్, ఉపాధ్యక్షుడిగా నర్రా నరేష్, కోశాధికారిగా కదార్ల నరేందర్, గౌరవ సభ్యులుగా తాడూరి సురేందర్, కళ్లెపు కుమార్, గంగారపు రమేష్, కుక్కల శ్రీకాంత్, నేరెళ్ల పవన్, నర్రా శ్రీనివాస్, కుక్కల రాకేష్, బైరి ప్రశాంత్, బజ్జూరి శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

విశ్వేశ్వరయ్య నుంచి ప్రేరణ పొందాలి



విశ్వేశ్వరయ్య విగ్రహానికి అధికారులతో కలిసి నివాళులర్పిస్తున్న వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద

» వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద

» జడ్పీ కార్యాలయంలో ఇంజనీర్స్ డే వేడుకలు

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యువ ఇంజనీర్లు మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆలోచనల నుంచి ప్రేరణ పొందాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని జడ్పీ కార్యాలయంలో పంచాయతీ రాజ్ ఎస్ఈ శంకరయ్య ఆధ్వర్యంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164వ జయంతి సందర్భంగా ఘనంగా ఇంజనీర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ సత్యశారద, హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, టీజీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ. జగన్మోహన్‌రావు పాల్గొని విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య దేశ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని ఆయన ఆలోచనలతో యువ ఇంజనీర్లు ప్రేరణ పొందాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎల్. సురేష్, మాజీ ప్రొఫెసర్ ఎం. పాండురంగారావు, శ్రీనివాస్, ఎం. చంద్రశేఖర్, ఈవీ శ్రీనివాసరావు, పులి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో..

వరంగల్ ఎడ్యుకేషన్ : వరంగల్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ అధ్యక్షతన ఇంజనీర్స్ డే, గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన నిట్ ప్రొఫెసర్ పీవీ. రావు మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశాభివృద్ధిలో ఇంజనీర్లు కీలకపాత్ర పోషిసు_న్నారన్నారు. కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. అనంతరం వివిధ బ్రాంచీల్లో టాపర్లుగా నిలిచిన విద్యా ర్థులకు ఆహుతులు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఈవి. శ్రీనివాస్‌రావు, అధ్యా పకులు మోతీలాల్, రవీందర్, శ్రీనాథ్, శ్రీనివాస్, సుధ, ఎల్లస్వామి, పూర్వ విద్యార్థుల సంఘం ప్రధానకార్యదర్శి ఎం. అక్షయ్‌కుమార్, కోశాధికారి ఆనం ద్‌కుమార్, ఉమేందర్, సతీష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డీఈ రవీందర్, ఏఈలు మహేందర్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.



విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రామచంద్రం తదితరులు

ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

కేయూ రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉద్బోధించారు. సోమవారం కేయూ ఇంజనీరింగ్ ఇంజనీర్స్‌డేను పురస్కరించుకుని భారతరత్న మోక్షంగుండం విశ్వేశ్వరయ్య విగ్రహనికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. మోక్ష గుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో ఇంజనీరింగ్ రంగంలో ఎదుగాలని సూచించారు. ప్రతికూల పరిస్థితులను అనుకూలంగా మార్చుకోవాలని తెలిపారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య వనరుల లేమీతోనూ అనేక అద్భుతాలను సాధించారని చెప్పారు. టీజీఎస్పీడీసీఎల్ మాజీ డైరెక్టర్ పి.సంధ్యారాణి, సీఎస్ఈ పూర్వ విద్యార్థి అఖిల్‌రెడ్డి కర్రా, అరవింద్ పల్లెంగులలు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఎస్.కార్తీక్‌మిత్ర, కృతానంద మూర్తి, కె.ఐశ్వర్య, ఎమ్డీ మునవర్, పి.సుశ్రుత్, రామకృష్ణ, ఆసీఫ్‌బాబాలు కెరీర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమణ, అధ్యాపకులు చాడా రాధికారెడ్డి, సూపరింటెండెంట్ బోల్నేపాక ప్రభాకర్, ఇతర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరిస్తాం

డీలర్ల సంక్షేమ సంఘానికి సీఎం రేవంత్‌రెడ్డి హామీ

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రేషన్ డీలర్ల సమస్యలను పరిశీలించి పరిష్కార చర్యలు చేపడతామని తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేశ్‌బాబు తదితర ప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. డీలర్ల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బత్తుల రమేశ్‌బాబు తదితర ప్రతినిధులు సోమవారం సీఎంను హైదరాబాద్‌లో కలిశారు. శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం వినతిపత్రాన్ని ఇచ్చారు. రేషన్ డీలర్లకు గౌరవ వేతనంగా రూ.5వేలు అందచేయడం, సమస్యలను మంత్రివర్గంతో చర్చించి పరిష్కరిస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డిమల్ల హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరలను ఎంబీసీ జాబితాలో చేర్చాలి

వడ్డెపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వడ్డెరలను బీసీఏ జాబితా నుంచి మోస్ట్ బ్యాక్ వర్డ్ క్లాసెస్ (ఎంబీసీ) జాబితాలో చేర్చాలని రాష్ట్ర వడ్డెర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. సోమవారం హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని సీఎం నివాసంలో ఆయనను ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డితో కలిసి వినతిపత్రం ఇచ్చారు. వడ్డెర సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డి. బాలరాజు, జిల్లా అధ్యక్షుడు బొంత ఐలయ్య, యూత్ అధ్యక్షుడు బొంత మురళి సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

కనులపండువగా లయన్స్ టీచర్స్ డే



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం పొందిన ఉపాధ్యాయులు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అన్ని వృత్తుల వారిని ప్రభావితం చేసేది ఉపాధ్యాయ వృత్తేనని ఎస్సార్ వర్సిటీ చైర్మన్ ఏ.వరదారెడ్డి అన్నారు. హనుమకొండలోని కేఎల్ఎన్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా అంతర్జాతీయ లయన్స్ 320 ఎఫ్ జిల్లా ఆధ్వర్యంలో నేత్రపర్వంగా టీచర్స్ డే నిర్వహించారు. ముఖ్య అతిథి జిల్లా గవర్నర్ చంద్రశేఖర్ ఆర్య జ్యోతి వెలిగించి సదస్సు ప్రారంభించారు. వరదారెడ్డి మాట్లాడుతూ చదువు చెప్పిన గురువులను స్మరించుకోవడం మన కనీస ధర్మమన్నారు. ఈసారి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 76 క్లబ్‌ల నుంచి 100 మంది ఉపాధ్యాయులను సత్కరించినట్లు చెప్పారు. జిల్లా గవర్నర్లు ఆర్య, రేవూరి రమణారెడ్డి, చంద్రశేఖర్ ఆర్య, లయన్స్ జిల్లా ముఖ్య సలహాదారుడు పొట్లపల్లి శ్రీనివాసరావు, లయన్స్ మొదటి ఉప జిల్లా గవర్నర్ నరహరి సుధాకర్‌రెడ్డి, పుట్ట హరికిషన్‌రెడ్డి, కన్నా పరశురాములు, తమ్మెర లక్ష్మీనర్సింహారావు, డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డి, రేణికుంట్ల ప్రకాశం, డీసీటీ చల్లా రమణారెడ్డి, డాక్టర్ గాండ్ల సురేశ్ కుమార్, రేవూరి రమణారెడ్డి, మార్గం ప్రభాకర్, చంద్రగిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ టూర్‌లో కార్పొరేటర్లు, అధికారులు

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ కార్పొరేటర్లు, అధికారుల ఇండోర్ స్టడీ టూర్‌లో భాగంగా సోమవారం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్, ఐసీసీసీ కేంద్రాలను పరిశీలించారు. చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో డ్రై వేస్ట్ చాంబర్, వెట్ వేస్ట్ చాంబర్, హజార్డస్ట్ వేస్ట్, శానిటరీ వేస్ట్, ఈ-వేస్ట్ చాంబర్లలో వేర్వేరుగా సేకరించిన చెత్తపై అక్కడి అధికారులు జీడబ్ల్యూఎంసీ కార్పొరేటర్లు, అధికారులకు వివరించారు. అక్కడి పలు ఆలయాలను సందర్శించి పూజలు చేశారు.

ప్రశాంత వాతావరణాన్ని కల్పించాలి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేయూ క్యాంపస్‌లో ఆందోళనలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కేయూ ఐక్య విద్యార్థి సంఘాల నేతలు అన్నారు. సోమవారం కేయూ గెస్ట్‌హౌజ్ వద్ద కేయూ ఐక్య విద్యార్థి సంఘాల నేతలు అరెగంటి నాగరాజు, డి. తిరుపతి, కేతపాక ప్రసాద్, సత్యనారాయణ, మర్రి మహేశ్‌లు మాట్లాడారు. వర్సిటీలో గొడవలకు పాల్పడిన వర్సిటీకి సంబంధం లేనివారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేయూ హాస్టల్స్‌లో అక్రమంగా ఉంటూ సంఘాల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వర్సిటీలో ఇప్పుడూ ఎలాంటి విద్యార్థి జేఏసీ లేదన్నారు. విద్యార్థుల సమస్యలపై చర్చించి జేఏసీని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల సమ్మెకు మద్దతు తెలిపారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరెగంటి నాగరాజు గౌడ్, రీసెర్చ్ స్కాలర్ డి. తిరుపతి, కేతపాక ప్రసాద్, బి.శ్రీదేవి, ఏఐడీఎస్‌వో రాష్ట్ర కన్వీనర్ ఎ.సత్యనారాయణ, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మర్రి మహేశ్, ఎస్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్, డీఏస్‌ఏ హనుమకొండ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ

హసన్‌పర్తి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు సెల్‌ఫోన్ రిపేర్, బైక్ మెకానిక్, ఏసీ, రిఫ్రిజిరేటర్, ఎల్ఎంవీ డ్రైవింగ్‌లో వేర్వేరుగా 30 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు ఎస్బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ బాస రవి తెలిపారు. వరంగల్ రూరల్, హనుమకొండ, భూపాలపల్లి, జనగామ, ములుగు, మహబూబాబాద్ జిల్లాల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. 18 నుండి 45 ఏళ్ల వయస్సు లోపు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 9704056522, 9849307873, 6281260878 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయ సంఘ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న ఎన్నికల అధికారి

రెడ్డికాలనీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం హనుమకొండ జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం మర్కజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అనిశెట్టి పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా వల్లపురెడ్డి నరేందర్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా రమేశ్‌రావు, సహాధ్యక్షులుగా తుమ్మ శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా శ్రీధర్, గౌరవ అధ్యక్షులుగా వెంకటేశం, సలహాదారులుగా హేమ్లానాయక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా రాష్ట్ర అధ్యక్షుడు కిశోర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సైదులురెడ్డి, తండా యాదగిరి, శ్రవణ్ కుమార్, హరిశంకర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

'నాపా' ఉత్సవాలకు ఆహ్వానం

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నార్త్ అమెరికా పద్మశాలీ అసోసియేషన్ (నాపా) ఉత్సవాలకు జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) జాతీయ కౌన్సిల్ ఫార్మర్ మెంబర్ వేముల సదానందం దంపతులకు 12వ వార్షికోత్సవ వేడుకలకు నాపా నుంచి ఆహ్వానం అందినట్లు సోమవారం వేముల సదానందం తెలిపారు. ఈ వేడుకలకు తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పద్మశాలీ సామాజిక వర్గానికి చెందిన రాజకీయ నాయకులు , కవులు, కళాకారులు, ప్రముఖులను ఆహ్వానించినట్లు తెలిపారు. పలువురు జర్నలిస్టులు సదానందం దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

పద్మశాలి పరపతి సంఘాల జిల్లా కన్వీనర్‌కు..

బాలసముద్రం (ఆంధ్రజ్యోతి): నార్త్ అమెరికా పద్మశాలి అసోసియేషన్ మహా సభలో పాల్గొనాల్సిందిగా హనుమకొండ కేఎల్ఎన్ రెడ్డి కాలనీకి చెందిన వైద్యం రాజగోపాల్‌కు ఆహ్వానం అందింది. రాజగోపాల్ హనుమకొండ జిల్లా పద్మశాలీ పరపతి సంఘాల కన్వీనర్‌గా, హనుమకొండ భక్త మార్కండేయ సేవా సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. సెప్టెంబరు 20న జరిగే మహాసభలో పాల్గొనాల్సిందిగా నాపా అధ్యక్షుడు కొండా ప్రభాకర్ ఆహ్వానం పంపారు.

అక్టోబరు 16 నుంచి జాతీయస్థాయి క్రీడా పోటీలు

పోస్టర్‌ను ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి



జాతీయస్థాయి క్రీడా పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, వేం నరేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు 16 నుంచి 18 వరకు హనుమకొండ జేఎన్ఎస్‌లో నిర్వహించున్న 5వ ఓపెన్ జాతీయస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ క్రీడా పోటీల పోస్టర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సోమవారం అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులతో సీఎంను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి క్రీడా పోటీల నిర్వహణ, ఏర్పాట్ల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం జాతీయస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ క్రీడా పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు క్రీడలను మరింత అభివృద్ధి చేయడానికి ఎల్లవేళల కృషి చేస్తుందన్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ... హనుమకొండలో నిర్వహించనున్న జాతీయస్థాయి అండర్-23 మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ చాంపియనషిప్‌ను విజయవంతంగా నిర్వహించడానికి సహకరించాలన్నారు. గత ప్రభుత్వం క్రీడలను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. సీఎం రాష్ట్రంలో క్రీడలకు పెద్దపీట వేస్తూ, ప్రతిభ కలిగిన క్రీడాకారుల కోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సాట్ చైర్మన్ శివసేనారెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్, డీవైఎస్‌వో గుగుతోత్ అశోక్‌కుమార్, అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

దత్తాత్రేయ కాలనీ వాసులు ఎమ్మెల్యేకు వినతి

హసన్‌పర్తి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 1వ డివిజన్ పరిధి అంబాల క్రాస్ రోడ్డులోని దత్తాత్రేయ కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుకు కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం కాలనీలో అత్యవసరంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైపులైన్‌లు నిర్మించాలని కాలనీ వాసులు ఎమ్మెల్యేను కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడుతూ త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వీసం సురెందర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు వీసం విజెందర్‌రెడ్డి, జనరల్ సెక్రటరి జయప్రకాష్‌రావు, శ్రీనివాసరావు, లక్ష్మణ్ తదితరులున్నారు.

రోలర్ స్కేటింగ్ పోటీలకు ఐషా

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు మొదటి వారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు హనుమకొండ నయీంనగర్‌కు చెందిన ఐషా మరియం ఎంపికయ్యింది. మడికొండ రాంపూర్ లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఇటీవల నిర్వహించిన అంతర్ జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో అండర్-8బాలికల 200, 400, 600 మీటర్ల స్పీడ్ క్వాడ్ విభాగాల్లో ఐషా అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మూడు విభాగాల్లో స్వర్ణ పతకాలు కొల్లగొట్టి రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు అర్హత సాధించింది. ప్రస్తుతం ఐషా మరియం వరంగల్‌లోని తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ పాఠశాలలో 2వ తరగతి చదువుతూ, రోలర్ స్కేటింగ్ కోచ్ జోయెల్ వద్ద రెండేళ్లుగా శిక్షణ పొందుతుంది. ఐషాను తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి బి. సిద్ధార్థ్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇన్నారెడ్డి, తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ తాళ్ల మల్లేశం, డైరెక్టర్లు డాక్టర్ వరుణ్, వైష్ణవి తదితరులు అభినందించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురికి జైలు

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్‌డ్రైవ్‌లో 24 మందిని సోమవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ. వేణుగోపాల్ నలుగురికి జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ జి. సీతారెడ్డి తెలిపారు. మిగితా 20 మందికి రూ. 21,300 జరిమానా విధించారన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తికి రూ. 600 జరిమానా విధించడం జరిగిందన్నారు.

జర్నలిస్టుపై పెట్టిన కేసు ఎత్తివేయాలి

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జిల్లాలో వార్త కవరేజ్‌కు వెళ్లిన జర్నలిస్టు సాంబశివరావుపై పోలీసులు పెట్టిన కేసును ఎత్తివేయాలని టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్. లెనిన్ డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ సుబేదారిలోని కలెక్టరేట్ కార్యాలయం ముందు టీయూడబ్ల్యూజే (143) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి అర్షం రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకులు వేణు, రవికాంత్, సత్యనారాయణ, ఆదర్శ్, రాజేందర్, గొట్టె వెంకన్న, ప్రశాంత్, కృష్ణ, రఘు, సంజీవ్, రఘుమాధవ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జాన్‌వెస్లీ

హసన్‌పర్తి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి కళా ఉత్సవ్-2025 పోటీల్లో వాయిద్య పరికరాలు సింగ్ సోలో విభాగంలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర పోటీలకు పీఎంశ్రీ జడ్పీ బాలికల పాఠశాల హసన్‌పర్తికి చెందిన విద్యార్థి జాన్ వెస్లీ ఎంపికైనట్లు హెచ్ఎం సుమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థిని అభినందించి సర్టిఫికెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో పీఈటీ శీలం పార్థసారథి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'చర్యలు తీసుకోవాలి'

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వివిధ మండలాల్లో రూ.100 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములు చాలా వరకు ఆక్రమణలకు గురయ్యాయని, ఆక్రమణలకు సహకరిస్తున్న రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కర్రె లక్ష్మణ్, ఏదునూరి వెంకట్రాజం, మునిగాల బిక్షపతి, మద్దెల ఎల్లేష్ తదితరులు ఉన్నారు.

జయరాజ్‌కు అవార్డు

మడికొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విజయవాడకు చెందిన మదర్ సర్వీస్ సొసైటీ ప్రతీ ఏటా వివిధ రంగాల్లో సేవలందించిన వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖులను గుర్తించి వారికి నందమూరి తారక రామారావు పేరుమీద జాతీయ అవా ర్డులను అందిస్తుంది. అందులో భాగంగా మడికొండ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న జి. జయరాజ్ చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి ఆయనకు ఈ సంవత్సరం ఎన్టీఆర్ జాతీయ అవార్డును ప్రకటించారు. సోమవారం విజయవాడలోని అక్కినేని నాగేశ్వర్‌రావు కళాక్షేత్రంలో జయరాజ్‌ను శాలువాతో సత్కరించారు. సంస్థ వ్యవస్థాపకులు మాల్లాది ప్రసాద్‌రావు, సినీ ఆర్టిస్టులు పృథ్వీరాజు, రజిత షిండే చేతుల మీదుగా ఎన్టీఆర్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ అధికారులతో పాటు పలువురు జయరాజ్‌ను అభినందించారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

వడ్డెపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఎస్‌జీఆర్‌ఈఏ) రాష్ట్ర సెక్రటరీ తిరువరంగం ప్రభాకర్ అన్నారు. సోమవారం హనుమకొండ రాంనగర్‌లోని టీఎస్‌జీఆర్‌ఈఏ హనుమకొండ జిల్లా కార్యాలయం లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగుల జేఏసీలో 200 సంఘాలకు గాను కేవలం 15 సంఘాలకు మాత్రమే స్టాండింగ్ కౌన్సిల్‌లో స్థానం కల్పించి మిగతా సంఘాలను ప్రభుత్వం విస్మరించిందని దుయ్యబట్టారు. అనంతరం హనుమకొండ యూనిట్‌కు ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా మాదిరెడ్డి మల్లారెడ్డి, కార్యదర్శిగా కందుల సంజీవరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా పి.సదానందచారి, ఫైనాన్స్ సెక్రటరిగా భిక్షపతి ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్లుగా శ్రీరాములు, సుజాత, జాయింట్ సెక్రటరీగా జగదీష్ చంద్రారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పైండ్ల వెంకటయ్య, పబ్లిసిటీ సెక్రటరీగా నర్సింహచారిలను ఎన్నుకున్నారు.

పింఛన్లు పెంచేంత వరకు పోరాటం

ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కె. సోమన్న

హసన్‌పర్తి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పింఛన్లు పెంచే వరకు పోరాడుతామని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి కందుకూరి సోమన్న అన్నారు. సోమవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి చేయూత పెన్షన్‌దారుల హక్కుల పోరాట సమితి, ఎమ్మార్పీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సోమన్న మాట్లాడుతూ వికలాంగులకు రూ.6వేలు, చేయూత పెన్షన్‌దారులకు రూ.4వేలు ఇవ్వాలని కోరారు. గతంలో ఉన్న 45 లక్షల మందితో పాటు కొత్తగా పెన్షన్‌కు దరఖాస్తు చేసుకున్న 10 లక్షల మందికి పెన్షన్ పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20న రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల ముందు నిరవధిక దీక్ష, ధర్నా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మా ర్పీఎస్, ఎంఎస్పీ నాయకులు రాజారపు భిక్షపతి, ప్రభాకర్, దామోదర్, భాగ్యలక్ష్మి స్వరూప, శ్రీనివాసాచారి, ఆనంద్, సూర్యం, సాంబరాజు, వెంకట్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



హసన్‌పర్తిలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పింఛన్‌దారులు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

రాంనగర్ : హనుమకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం వీహెచ్‌పీఎస్, సీపీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అందోళన నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి సోమన్న, మండల అధ్యక్షుడు బొక్క రాజేశ్, ఎర్ర రాము, రేణిగుంట్ల రాజేందర్, రాజు, మోరే అనిల్, ఎర్ర నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట : వికలాంగులకు పింఛన్లు పెంచాలని కోరుతూ ఎంఎస్పీ, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు బండారి సురేందర్, కాజీపేట ఇన్‌చార్జి తిప్పారపు మల్లేష్ మాదిగ, వికలాంగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, శివ, మంద స్వరాజ్, క్రిష్టఫర్, జె. సారంగపాణి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

9
ఆంధ్రజ్యోతి
నవ్య
డాక్టర్
మంగళవారం • 16 సెప్టెంబరు 2025

అధిక కొలెస్ట్రాల్



కొలెస్ట్రాల్ మనకు మిత్రుడా? శత్రువా?

అతి కచ్చితంగా అనర్థదాయకమే! ఈ సూత్రం కొలెస్ట్రాల్‌కూ వర్తిస్తుంది. తగు మోతాదుల్లో ఆరోగ్యానికి మేలు చేసే కొలస్ట్రాల్, మితిమీరితే కచ్చితంగా చేటు చేస్తుందంటున్నారు వైద్యులు. మరీ ముఖ్యంగా గుండెకు హాని కలగకుండా ఉండడం కోసం కొలెస్ట్రాల్ మోతాదును ఎలా పరిమితం చేసుకోవాలో ప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ రమేష్ గూడపాటి ఇలా వివరిస్తున్నారు.

కొలస్ట్రాల్ అనగానే అందరికీ గుండెజబ్బులే గుర్తొస్తాయి. కానీ నిజానికి కొలస్ట్రాల్ మన శరీరానికి అత్యవసరమైన ముడి పదార్థం. శరీరంలో హార్మోన్ స్రావాల ఉత్పత్తిలో, కణ సంశ్లేషణలో కొవ్వులు కీలక పాత్ర పోషిస్తాయి. కానీ పరిమితిలో ఉన్నంత కాలం వీటితో ఎలాంటి హానీ ఉండదు. అయితే వీటిలో రకాలతో పాటు, మంచివీ, చెడ్డవీ కూడా ఉంటాయి. వాటి రకాలు, ఆరోగ్యకర మోతాదులు ఏవంటే...

టోటల్ కొలస్ట్రాల్: 200 (మిల్లీగ్రామ్స్ పర్ డెసిలీటర్) కంటే తక్కువ ఉండాలి

ఎల్‌డిఎల్ కొలస్ట్రాల్: ఇది చెడు కొలస్ట్రాల్. ఇది వంద లోపు ఉండాలి

హెచ్‌డిఎల్ కొలస్ట్రాల్: ఇది మంచి కొలస్ట్రాల్. 40 కంటే ఎక్కువ ఉండాలి

విఎల్‌డిఎల్ కొలస్ట్రాల్: 30 కంటే తక్కువ ఉండాలి

ట్రైగ్లిజరైడ్స్: 150 కంటే తక్కువ ఉండాలి. మంచి కొలస్ట్రాల్స్ కూడా వాటి పరిమితులు దాటకుండా చూసుకోవాలి. పరిమితి మించితే ఇవి కూడా శరీరానికి హాని చేస్తాయి.

ఒక్కొక్కరిలో ఒక్కోలా...

కొలస్ట్రాల్ మోతాదులు, వాటి ప్రభావం అందరికీ ఒకేలా ఉండదు. కొవ్వు మోతాదులు వ్యక్తుల ఆరోగ్య పరిస్థితులను బట్టి మారుతూ ఉంటాయి. ఆరోగ్యవంతుల మోతాదులకూ, హృద్రోగులు, మధుమేహుల మోతాదులకూ తేడాలుంటాయి. మధుమేహుల మోతాదులు సాధారణ స్థాయుల కంటే తక్కువగా ఉండాలి. అలాగే గుండె రక్తనాళాల్లో అవరోధాలున్నవాళ్లలో కూడా కొలస్ట్రాల్ స్థాయులు మరింత తక్కువగా ఉండాలి. మధుమేహుల్లో ఎల్‌డిఎల్ 70 కంటే తక్కువ ఉండాలి. మధుమేహంతో పాటు గుండెజబ్బు కూడా ఉన్నప్పుడు, ఎల్‌డిఎల్ 55 కంటే తక్కువ ఉండాలి. గుండెజబ్బు మాత్రమే ఉన్నవాళ్లు, 70 కంటే తక్కువ ఉండేలా చూసుకోవాలి.

కొలస్ట్రాల్ మీద కన్నేసి...

మూడింట రెండొంతుల కొలస్ట్రాల్ మన శరీరంలోనే తయారవుతుంది. మూడింట ఒక వంతు కొలస్ట్రాల్ మాత్రమే మనం తీసుకునే ఆహారం, అనుసరించే అలవాట్ల మీద ఆధారపడి ఉంటుంది. కాబట్టి శరీరంలోనే తయారయ్యే కొలస్ట్రాల్ మన జన్యు నిర్మాణం మీద ఆధారపడి ఉంటుంది కాబట్టి దాన్ని మనం నియంత్రించలేం! అయితే జన్యుపరమైన కారణాల వల్ల కొందర్లో సహజసిద్ధంగానే కొలస్ట్రాల్ ఎక్కువ మోతాదుల్లో ఉత్పత్తి అవుతూ ఉంటుంది. కాబట్టి శరీర దారుఢ్యం కలిగి ఉండి, మంచి ఆహారపుటలవాట్లను కలిగి ఉండి, ఆరోగ్యంగా ఉన్నవాళ్లు తమకు కొలస్ట్రాల్ ఎక్కువగా ఉండే అవకాశం లేదని అనుకోడానికి వీల్లేదు. అలాగే స్థూలకాయులై ఉండి, అనారోగ్యకరమైన జీవనవిధానాన్ని కొనసాగించే వాళ్లలో కొలస్ట్రాల్ సాధారణ మోతాదుల్లో ఉండే అవకాశాలూ ఉంటాయి. కొలస్ట్రాల్ మోతాదులు పెరిగినా ఎటువంటి లక్షణాలూ కనిపించవు కాబట్టి, జన్యు నిర్మాణం ఎలా ఉందో ఎవరికి వారు తెలుసుకునే వీలు లేదు కాబట్టి ప్రతి ఒక్కరూ రక్త పరీక్షతో ఈ కొవ్వు మోతాదులను పరీక్షించుకుంటూ ఉండాలి. 30 ఏళ్లు పైబడిన వాళ్లు కొలస్ట్రాల్‌ను పరీక్షించుకుని, కొవ్వులన్నీ సరైన మోతాదుల్లో ఉండి, ఎటువంటి ఆరోగ్య సమస్యలూ లేనప్పుడు, ఐదేళ్లకోసారి కొలస్ట్రాల్‌ను పరీక్షించుకుంటూ ఉంటే సరిపోతుంది. 50 ఏళ్లకు చేరుకున్న తర్వాత ఏడాదికోసారి తప్పనిసరిగా పరీక్షించుకోవాలి. అలాగే మధుమేహం, అధిక రక్తపోటు ఉన్నవాళ్లు వయసుతో సంబంధం లేకుండా ఏడాదికోసారి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి.

> **ఏ నూనె ఉత్తమం?**
>
> వంటనూనెల్లో మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు, అన్ శాచురేటెడ్ కొవ్వులు, శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. వీటిలో మొదటి రెండు కొవ్వులూ మన శరీరానికి మంచివి. శాచురేటెడ్ కొవ్వులు కొంత హానికరమైనవి. కాబట్టి శాచురేటెడ్ కొవ్వులు ఎక్కువగా ఉండే డాల్డా, పామాయిల్, కొబ్బరినూనెల వాడకం తగ్గించాలి. పొద్దుతిరుగుడు, నువ్వులు, వేరుసెనగ, రైస్ బ్రాన్, ఆలివ్ మొదలైన నూనెల్లో కొవ్వులన్నీ వివిధ నిష్పత్తుల్లో ఉంటాయి. కాబట్టి ప్రతి రెండు, మూడు నెలలకూ ఈ నూనెలను మార్చి వాడుకుంటూ ఉండాలి. వంటకు ఏ నూనె వాడుకుంటున్నాం? అనే దాని కంటే ఎంత నూనె వాడుకుంటున్నాం? అన్నది ముఖ్యం. ఒక వ్యక్తి నెలకు అర కిలో నూనె మాత్రమే వాడుకోవాలి.



కుటుంబ చరిత్రలో గుండె జబ్బులున్నవాళ్లు రెట్టింపు అప్రమత్తంగా ఉంటూ, కొలస్ట్రాల్ మోతాదులను సాధారణ స్థాయుల కంటే తక్కువలో ఉంచుకోవాలి.

కొలస్ట్రాల్ ఎక్కువైతే?

కొవ్వు మోతాదులు మించితే రక్తనాళాల్లోని గోడల్లో పేరుకుపోయి, పూడికలు ఏర్పడతాయి. వీటి మీద రక్తపు గడ్డలు ఏర్పడి గుండెపోటుకు దారి తీయవచ్చు. ఇలా గుండె రక్తనాళాల్లో పూడికలతో గుండెపోటు వచ్చినట్టే మెదడు రక్తనాళాల్లో పూడికలు ఏర్పడితే బ్రెయిన్ స్ట్రోక్ వస్తుంది. ఇది పక్షవాతానికి దారి తీస్తుంది. అదే విధంగా మూత్రపిండాల రక్తనాళాల్లో పూడికలు ఏర్పడితే మూత్రపిండాల సామర్థ్యం కుంటుపడవచ్చు. ఈ ప్రదేశాల్లోనే కాకుండా శరీరంలోని ఏ రక్తనాళంలోనైనా కొలస్ట్రాల్ పూడికలు ఏర్పడవచ్చు. ఫలితంగా సంబంధిత అవయవానికి రక్తసరఫరా తగ్గి ఆ అవయవం దెబ్బతినే అవకాశం ఉంటుంది. కాబట్టి అధిక కొలస్ట్రాల్‌ను గుండెకు ముప్పు తెచ్చే అంశంగానే పరిగణించాలి. ప్రపంచవ్యాప్త మరణాలకు... గుండె, రక్తనాళాల సమస్యలే ప్రధాన కారణాలు. ప్రతి వంద మందిలో 30 మంది ఈ రెండు సమస్యల వల్లే ప్రాణాలు కోల్పోతూ ఉంటారు. ఈ రెండు సమస్యలకు దారి తీసే ముఖ్యమైన ప్రమాద కారకాల్లో అధిక కొలస్ట్రాల్ ఒకటి.

నియంత్రణ ఇలా...

కొలస్ట్రాల్‌ను ఆరోగ్యకర మోతాదుల్లో ఉంచుకోవడం కోసం ఆరోగ్యకరమైన జీవనవిధానాన్ని కొనసాగించాలి. అందుకోసం...

ఆహారం: ఆహారంలో పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాలు ఎక్కువగా, మటన్, బీఫ్, పోర్క్‌లు (రెడ్ మీట్) తక్కువగా ఉండేలా చూసుకోవాలి. అలాగే కొవ్వు తక్కువగా ఉండే పాల ఉత్పత్తులు తీసుకోవాలి. వెన్న, నెయ్యిలను పరిమితం చేసి, మీగడ తీసిన పెరుగు, కొవ్వు తొలగించిన పాలు తీసుకోవాలి. బాదం, పిస్తా లాంటి నట్స్ కూడా పరిమితంగా తీసుకోవాలి. వేపుళ్లు, తీపి పదార్థాలు తగ్గించుకోవాలి.

వ్యాయామం: రోజుకు కనీసం అరగంట చొప్పున, వారంలో ఐదు రోజుల పాటు వ్యాయామం చేయాలి. నడక, పరుగు, ఈత, సైకిల్ తొక్కడం... ఇలా ఏదో ఒక వ్యాయామం తప్పనిసరిగా చేయాలి.

దురలవాట్లు: ధూమపానం, మద్యపానం కొలస్ట్రాల్ మోతాదులను పెంచుతాయి. కాబట్టి వీటిని మానేయడం మంచిది.

అధిక బరువు: ఎత్తుకు తగిన బరువు ఉండేలా చూసుకోవాలి. అధిక బరువును ఐదు శాతం తగ్గించుకున్నా కొలస్ట్రాల్ మోతాదులు చాలా బాగా తగ్గుతాయి

పరీక్షలు: క్రమం తప్పక ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి.

సమర్థమైన మందులున్నాయి

అస్తవ్యస్థ జీవనశైలి వల్ల కొందర్లో కొలస్ట్రాల్ మోతాదులు పెరిగిపోవచ్చు. జన్యుపరమైన కారణాల వల్ల కూడా కొందర్లో ఈ పరిస్థితి తలెత్తవచ్చు. ఇలాంటి సందర్భాల్లో కొవ్వు మోతాదులను తగ్గించే మందులను వాడుకోవాలి. కొలస్ట్రాల్‌ను తగ్గించుకోవడం కోసం సాధారణంగా స్టాటిన్స్ మందులనే వాడుకుంటూ ఉంటాం. ఈ మందులు టోటల్ కొలస్ట్రాల్, హెచ్‌డిఎల్, ఎల్‌డిఎల్ కొలస్ట్రాల్స్‌ను తగ్గిస్తాయి. అయితే ట్రైగ్లిజరైడ్స్‌ను మాత్రమే తగ్గించే ఫిబ్రేట్స్ మందులు కూడా ఉన్నాయి. కొలస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్... ఈ రెండూ ఎక్కువగా ఉన్నప్పుడు, రెండు రకాల మందులూ కలిపి వాడుకోవాలి. ఎక్కువ శాతం కొలస్ట్రాల్ మన శరీరంలో రాత్రివేళ్లే తయారవుతుంది. కాబట్టి ఈ మందులను రాత్రి భోజనం తర్వాతే వేసుకోవాలి. ఈ మందులతో ఎల్‌డిఎల్ కొలస్ట్రాల్ 30 నుంచి 40 శాతానికి తగ్గుతుంది. ఇటీవలి కాలంలో ఇంజెక్షన్ రూపంలోని మందులు కూడా అందుబాటులోకొచ్చాయి. ఆరు నెలలకోసారి తీసుకునే ఇంజక్షన్‌తో పాటు రెండు వారాలకోసారి తీసుకునే ఇంజక్షన్లు కూడా ఉన్నాయి. వీటితో కొలస్ట్రాల్ మోతాదులను 60% మేరకు తగ్గించుకునే వీలుంది. స్టాటిన్స్ వాడుతున్నప్పటికీ కొలస్ట్రాల్ స్థాయులు ఆశించిన స్థాయికి తగ్గకపోయినప్పుడు ప్రత్యామ్నాయంగా ఇంజక్షన్లను ఎంచుకోవచ్చు. అలాగే స్టాటిన్లతో ఒళ్లునొప్పులు దుష్ప్రభావాలు ఎదుర్కొనేవాళ్లు కూడా ఇంజక్షన్లను ఎంచుకోవచ్చు. కొందరికి స్టాటిన్లు ఒక్కటే సరిపోవు, అలాంటి వారికి కూడా ఇంజక్షన్లు అవసరమవుతాయి. అయితే స్టాటిన్స్‌తో పోల్చితే ఇంజక్షన్లు ఖరీదైనవి. నెలకోసారి తీసుకునే ఇంజక్షన్ ధర సుమారు లక్ష రూపాయలుంటే, రెండు వారాలకోసారి తీసుకునే ఇంజక్షన్ 20 వేలు ఉంటుంది. ఈ రోజు కొలస్ట్రాల్‌ను నియంత్రించుకుంటే, రేపటి కోసం గుండెను కాపాడుకోవచ్చు. సంతులన జీవనవిధానం, క్రమం తప్పని ఆరోగ్య పరీక్షలు, సమర్థమైన చికిత్సలతో కొలస్ట్రాల్ మోతాదులను అదుపులో ఉంచుకోవడం కచ్చితంగా సాధ్యమే!

> **అపోహలు - వాస్తవాలు**
>
> **అపోహ:** సన్నగా, ఫిట్‌గా ఉంటే అధిక కొలస్ట్రాల్ సమస్య ఉండదు
>
> **వాస్తవం:** ఇది నిజం కాదు. కొలస్ట్రాల్ మోతాదులు జన్యునిర్మాణం మీద ఆధారపడి ఉంటాయి కాబట్టి ఆరోగ్యవంతుల్లో కూడా అధిక కొలస్ట్రాల్ ఉండే అవకాశం లేకపోలేదు
>
> **అపోహ:** మందులతో కొలస్ట్రాల్ తగ్గితే మందులు వాడుకోవలసిన అవసరం లేదు
>
> **వాస్తవం:** మధుమేహం, అధిక రక్తపోటు మాదిరిగానే కొలస్ట్రాల్ మందులు కూడా దీర్ఘకాలం వాడుకోవాల్సి ఉంటుంది. కాబట్టి కొలస్ట్రాల్ తగ్గిందని మందులు ఆపకూడదు. అలాగే వ్యాయామాలు, ఆహార నియమాలు కూడా ఆపడానికి వీల్లేదు. అవసరమైతే మందుల మోతాదు పెంచుకుందామనే ఆలోచనతో ఆహారనియమాలను ఉల్లంఘించకూడదు
>
> **అపోహ:** అధిక కొలస్ట్రాల్ ఉన్నవాళ్లు గుడ్డు పచ్చ సొన తినకూడదు
>
> **వాస్తవం:** ఒక రోజుకు ఒకట్రెండు గుడ్ల పచ్చసొనలు తినడం వల్ల ఎలాంటి సమస్యా ఉండదు

డాక్టర్ రమేష్ గూడపాటి
సీనియర్ కన్సల్టెంట్ అండ్ హెచ్‌ఒడి, ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ,
స్టార్ హాస్పిటల్స్, హైదరాబాద్.



అధ్యయనం

డైట్ సోడాలతో చేటు

క్యాలరీలను తగ్గించుకోవాలనే ఆలోచనతో డైట్ సోడాలను ఎంచుకుంటున్నారా? నిజానికి వాటితో మధుమేహం ముప్పు పొంచి ఉంటుందని అధ్యయనాలు నిరూపిస్తున్నాయి.

డైట్ సోడాలతో సాధారణ సోడాలకు మించి మధుమేహ ముప్పు పొంచి ఉంటుంది. రోజుకొక డైట్ సోడాతో 36% టైప్ 2 మధుమేహం ముప్పు ఉంటుందని అధ్యయనాల్లో వెల్లడైంది. 14 ఏళ్ల పాటు 36 వేల మంది మీద చేపట్టిన ఒక పరిశోధనలో, రోజుకొక కృత్రిమ తీపి పానీయం తాగిన వారిలో టైప్2 మధుమేహం ముప్పు, సాధారణ తీపి పానీయం తాగే వారి కంటే మూడు రెట్లు ఎక్కువగా ఉంటుందని శాస్త్రవేత్తలు కనిపెట్టారు. అలాగే డైట్ సోడాల్లోని కృత్రిమ కొవ్వులు పేగుల్లోని బ్యాక్టీరియాను అస్తవ్యస్థం చేస్తాయనీ, ఇన్సులిన్ సంకేతాలను ప్రభావితం చేస్తాయనీ, రక్తంలోని చక్కెరను క్రమబద్ధీకరించుకోవడంలో శరీర సామర్థ్యాన్ని అయోమయానికి గురి చేస్తాయనీ పరిశోధకులు అంటున్నారు. డైట్ సోడాల్లోని ఆస్పర్టేమ్, సుక్రలోజ్‌లు మధుమేహ ముప్పును మధుమేహ ముప్పును పెంచడంతో పాటు స్థూలకాయానికి కూడా దోహదపడతాయి కాబట్టి అన్ని రకాల శీతల పానీయాలకు దూరంగా ఉండాలని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.



తెలుసుకుందాం

విత్తనాలు ఎప్పుడు తినాలి?

శరీరం సమర్థంగా శోషించుకోవడం కోసం కొన్ని విత్తనాలను కొన్ని నిర్దిష్ట సమయాల్లోనే తినాలంటున్నారు ఎయిమ్స్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, డాక్టర్ సౌరభ్ సేథి. మరిన్ని వివరాలు...

చియా విత్తనాలు: ఈ విత్తనాల్లోని పీచు జీర్ణ ప్రక్రియను నెమ్మదిస్తుంది, రక్తంలో చక్కెర మోతాదులను స్థిరంగా ఉంచుతుంది. కాబట్టి వీటిని ఉదయాన్నే లేదా వ్యాయామానికి ముందు తినాలి.

అవిసె: వీటిని ఉదయాన్నే తినాలి. మెత్తగా దంచి తినడం వల్ల పొట్టలోని ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది.



నువ్వులు: వీటిలోని క్యాల్షియం ఎముకల సాంద్రతను పెంచుతుంది. రాత్రివేళ ఆక్సిడేటివ్ స్ట్రెస్ తగ్గుతుంది కాబట్టి వీటిని రాత్రి భోజనంలో తినాలి.

సోంపు: వీటిలోని అనెథోల్ పొట్టలోని కండరాలను రిలాక్స్ చేసి పొట్ట ఉబ్బరం తగ్గిస్తుంది కాబట్టి వీటిని భోజనం తర్వాత తినాలి.

నానబెడితే?

చియా, సబ్జా విత్తనాలను నానబెట్టడం వల్ల వాటి బాహ్య పొర బెత్తబడి, పోషకాలు మరింత మెరుగ్గా శోషణ చెందడానికి తోడ్పడే ఎంజైమ్స్ విడుదల అవుతాయి. చియా విత్తనాలను నీళ్లలో నానబెట్టినప్పుడు అవి 12 రెట్లు బరువు పెరుగుతాయి. అలాగే జీర్ణశక్తికి తోడ్పడే జిగట పదార్థాన్ని కూడా విడుదల చేస్తాయి. దాంతో ఆకలి అదుపులో ఉంటుంది. వీటిలో విటమిన్ బి, ఖనిజలవణాలు మెండుగా ఉంటాయి. కాబట్టి ఇలా నానబెట్టిన చియా, సబ్జాలను పరగడుపున తీసుకోవడం వల్ల, అప్పటివరకూ ఉపవాస స్థితిలో ఉన్న శరీరానికి సరిపడా శక్తి అందుతుంది. అలాగే ఏ విత్తనమైనా ఒకటి నుంచి రెండు స్పూన్లకు పరిమితం చేయాలి.

ఆ లక్షణాలు అసాధారణం

పిత్తాశయానికి క్యాన్సర్ సోకినప్పుడు తొలి దశల్లోనే గుర్తించడం ఒకింత కష్టమవుతూ ఉంటుంది. కానీ ఈ క్యాన్సర్‌లో బయల్పడే కొన్ని అసాధారణ లక్షణాల మీద కన్నేసి ఉంచగలిగితే తొలినాళ్లలోనే కనిపెట్టి, క్యాన్సర్ నుంచి విముక్తి పొందడం సులభమే! ఆ అసాధారణ లక్షణాలు ఏవంటే...

చర్మం దురద: పిత్తాశయ క్యాన్సర్‌లో ప్రధాన లక్షణం కామెర్లు. అయితే దురదలు వేధిస్తూ ప్రత్యేకించి రాత్రివేళల్లో తీవ్రమవుతూ ఉంటాయి. క్యాన్సర్ గడ్డ బైల్ డక్ట్‌కు అడ్డుపడడం వల్ల, బైల్స్ బయటకు వెళ్లలేక కణజాలాల్లో బైల్ సాల్ట్స్ పేరుకుపోయి దురదలు వేధిస్తాయి. కాబట్టి కామెర్లతో పాటు, దురదలు కూడా వేధిస్తుంటే అప్రమత్తం కావాలి.

ముదురు రంగు మూత్రం: కామెర్ల కంటే ముందు కనిపించే లక్షణమిది. మూత్రం, మలం ముదురు రంగులోకి మారిపోతాయి. కణితి వల్ల బైల్ డక్ట్ మూసుకుపోయి, బైల్ స్రావాలు పేగుల్లోకి చేరుకోలేకపోవడంతో, రక్తంలో బైల్ సాల్ట్స్ పేరుకుపోవడం మూలంగా మలమూత్రాలు రంగు మారతాయి.


క్యాన్సర్ కేర్

పొత్తికడుపులో గడ్డ: చివరి దశలో బయల్పడే లక్షణమిది. పొత్తికడుపులో గడ్డ ఉబ్బెత్తుగా కనిపిస్తూ ఉంటుంది. బైల్‌డక్ట్ మూసుకుపోవడం మూలంగా పిత్తాశయం ఉబ్బిపోతుంది. లేదంటే క్యాన్సర్ పిత్తాశయం నుంచి కాలేయానికి పాకినప్పుడు కూడా ఇదే పరిస్థితి తలెత్తుతుంది.

బరువు, ఆకలి తగ్గడం: అకారణంగా బరువు తగ్గడం, ఆకలి కోల్పోవడం కూడా పిత్తాశయ క్యాన్సర్ లక్షణాలే! శరీరం శక్తిని ఖర్చు చేసుకునే తీరు, జీర్ణ ప్రకియలు తీవ్రంగా దెబ్బతినడం వల్ల ఈ లక్షణాలు మొదలవుతాయి. కొద్దిపాటి ఆహారానికే కడుపు నిండిపోతున్నా, ఆకలి తగ్గిపోయినా, బరువు కోల్పోతున్నా అప్రమత్తం కావాలి.

నొప్పి, అసౌకర్యం: పొత్తికడుపు పైభాగంలో కుడి వైపు స్వల్ప నొప్పి, అసౌకర్యం కొనసాగుతూ ఉంటాయి. ఈ నొప్పి పిత్తాశయంలో రాళ్ల నొప్పిని పోలినట్టు తీవ్రంగా ఉండదు. విడతలవారీగా వస్తూ, పోతూ వెన్నులోకీ, భుజాల మధ్యకూ పాకుతూ ఉంటుంది.


సెప్టెంబరు 17
ప్రపంచ రోగుల భద్రతా దినోత్సవం

ప్రతి ఏటా సెప్టెంబరు 17న, ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ రోగుల భద్రతా దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నేతృత్వంలో అన్ని ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో రోగి భద్రత ప్రాముఖ్యతను తెలియజెప్పడం కోసం ఈ ప్రయత్నానికి పూనుకుంటూ ఉంటారు. "నవజాత శిశువు, బిడ్డల సంరక్షణ" ఈ ఏడాది థీమ్. వైద్య పరిసరాల్లో పిల్లల భద్రత, హక్కుల పట్ల అత్యవసర శ్రద్ధ వహించడమే ఈ థీమ్ లక్ష్యం.

పసికందుల భద్రత తల్లితండ్రుల చేతుల్లో..

ఎదిగే క్రమంలో పిల్లల అవసరాలు భిన్నంగా ఉంటాయి. వారి శరీరంలో చోటుచేసుకునే మార్పులు కూడా భిన్నంగా ఉంటాయి. పిల్లల భావవ్యక్తీకరణ సంక్లిష్టంగా ఉంటుంది. అయితే వీటన్నిటి పట్ల శ్రద్ధ కనబరుస్తూ, పసికందుల ఆరోగ్యాన్ని కాపాడుకునేలా నడుచుకోవడం తల్లితండ్రుల బాధ్యత. ప్రసవం మొదలు, ఆరోగ్యకరమైన నవజాత శిశువుతో ఇంటికి చేరుకునే వరకూ అనేక జాగ్రత్తలు పాటించవలసి ఉంటుంది. తీసుకోవలసిన జాగ్రత్తల్లో ఏ చిన్న తప్పు జరిగినా, లక్షణాలను అశ్రద్ధ చేసినా, మందుల మోతాదు క్రమం తప్పినా పిల్లలు దీర్ఘకాలపు పర్యవసానాలను ఎదుర్కోవలసి వస్తుంది. కాబట్టి ప్రత్యేకించి నవజాత శిశువులు, పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచడం అవసరం. ప్రపంచవ్యాప్తంగా లక్షల మంది పిల్లలు, నియంత్రించే వీలున్న వైద్యపరమైన తప్పిదాల బారిన పడుతున్నారు. నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉన్న నెలలు నిండకుండా పుట్టిన పిల్లలకు బహుళ మందులు, ఫీడింగ్ సపోర్ట్, శరీర ఉష్ణోగ్రతను నియంత్రించే పరికరాలు, నిరంతర పర్యవేక్షణలు అవసరవుతాయి. వీటిలో ఏ ఒక్క అంశంలో తప్పిదం జరిగినా బిడ్డ ప్రాణాలకే ప్రమాదం వాటిల్లుతుంది. కాబట్టి నవజాత శిశువుల భద్రత విషయంలో పూర్తిగా యంత్రాల మీదే ఆధారపడకుండా, అనుభవజ్ఞులైన నిపుణులను ఎంచుకోవడం కూడా అవసరమే!

సురక్షితమైన ప్రసవం కోసం...

ప్రసవమైన తొలి 28 రోజులు ఎంతో కీలకమైనవి కాబట్టి నిపుణులైన ప్రసూతి వైద్యులతో పాటు ప్రసవ సహాయకులను ఎంచుకోవడమూ అవసరమే! పరిశుభ్రమైన ప్రసవ పరిస్థితులు, నియోనాటల్ కేర్ అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. అలాగే...

బరువును బట్టి మోతాదు: పసికందులకు ఇచ్చే మందులు వారి బరువు ఆధారంగా అంచనా వేయాలి. పసిపిల్లలకు పొంచి ఉండే ప్రమాదాల్లో మందుల మోతాదు ప్రధానమైనది.

కమ్యూనికేషన్: ఆరోగ్య సంరక్షకులు, కుటుంబాల మధ్య సంభాషణ స్పష్టంగా సాగాలి. కుటుంబ సభ్యులు తమకు నచ్చని అంశాన్ని సూటిగా ప్రశ్నించి సంతృప్తికరమైన సమాధానం రాబట్టాలి.

ఇన్‌ఫెక్షన్లు: చేతులు శుభ్రం చేసుకోవడం, పరికరాలను స్టెరిలైజ్ చేయడం, ఆస్పత్రుల్లో మరీ ముఖ్యంగా పిల్లల వార్డుల్లో, ఎన్ఐసియుల్లో పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూసుకోవడం వల్ల పిల్లలకు ప్రాణాంతక ఇన్‌ఫెక్షన్ల ముప్పు తప్పుతుంది.

తల్లితండ్రులు ఇలా నడుచుకోవాలి

- బిడ్డకు అందించే మందుల పట్ల పూర్తి అవగాహన పెంచుకుని, వైద్యులతో ఒకటికి రెండుసార్లు చర్చించాలి
- చికిత్స, వ్యాధినిర్ధారణ గురించి వైద్యులను అడిగి అవగాహన పెంచుకోవాలి
- బిడ్డకు సంబంధించిన ఏ ఒక్క లక్షణాన్నీ వైద్యుల నుంచి దాచకూడదు
- బిడ్డ పరిపూర్ణ ఆరోగ్యానికి దోహదపడే అంశాలన్నిటినీ వైద్యులను అడిగి తెలుసుకోవాలి.

డాక్టర్ సురేష్ కుమార్ పానుగంటి
సీనియర్ పీడియాట్రిషియన్,
యశోద హాస్పిటల్స్
సోమాజిగూడ, హైదరాబాద్.



ప్లాస్టిక్‌ను వదిలించే చింతపండు

చింతపండు కలిగి ఉండే ఆరోగ్య ప్రయోజనాల గురించి మనకున్న అవగాహన తక్కువే! కానీ చింతపండుతో ఒరిగే ఒక ఆశ్చర్యకరమైన ఆరోగ్య ప్రయోజనాన్ని తాజా పరిశోధన బహిర్గతం చేసింది. అదేంటంటే....

మన శరీరంలోకి చేరుకునే మైక్రోప్లాస్టిక్స్ ఎంతటి ఆరోగ్య ముప్పును తెచ్చి పెడతాయో అందరికీ తెలిసిందే! అయితే వీటిని శరీరం నుంచి తొలగించే మహత్తరమైన శక్తి చింతపండుకు ఉందని తాజా పరిశోధనలో బహిర్గతమైంది. చింతపండు సారం,

పరిశోధన



శరరంలోని మైక్రోప్లాస్టిక్ అణువులతో పరస్పర చర్య జరుపుతున్నట్టు నియంత్రిత ప్రయోగాల్లో వెల్లడైంది. ప్రయోగశాలల్లో చేపట్టిన పరీక్షల్లో చింతపండు సారం, నీళ్లలోని 90% మైక్రోప్లాస్టిక్స్‌ను తొలగించడాన్ని పరిశోధకులు కనిపెట్టారు. చింతపండులోని కాంపౌండ్స్, సహజసిద్ధ పాలిమర్స్‌ను సృష్టించడమే ఇందుకు కారణం. ఈ పాలిమర్స్ సూక్ష్మప్లాస్టిక్స్‌ను వెతికి బంధించడమే కాకుండా, వాటిని తమతో పాటు మోసుకుపోతున్నట్టు పరిశోధకులు కనిపెట్టారు. అయితే సూక్ష్మప్లాస్టిక్స్ నుంచి మనుషులను డిటాక్స్ చేయడానికి చింతపండు ఉపయోగపడుతుందని నిర్ధారించడానికి మరికొన్ని అధ్యయనాలు అవసరమవుతాయనీ, తాజా పరిశోధనతో ప్లాస్టిక్ కాలుష్యానికి సహజసిద్ధ పరిష్కారాల పట్ల ఆసక్తి పెరుగుతుందనీ పరిశోధకులు అంటున్నారు.

కొడంగల్‌లో అంగన్‌వాడీల సీఎం ఇంటి ముట్టడి విఫలం

- హనుమకొండలో మంత్రి సురేఖ ఇంటి వద్ద ఉద్రిక్తత
- సంగారెడ్డిలో మంత్రి దామోదర ఇంటి ముట్టడి
- ప్రీ ప్రైమరీ వ్యవస్థకు వ్యతిరేకంగా అంగన్‌వాడీల ఆందోళన

కొడంగల్/ రాంనగర్/ సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను రద్దు చేసి, ప్రీ ప్రైమరీ వ్యవస్థను తేవాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం పలు చోట్ల అంగన్‌వాడీ టీచర్లు తీవ్ర నిరసన తెలిపారు. వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని సీఎం రేవంత్ రెడ్డి ఇంటి ముట్టడికి విఫల యత్నం చేయగా, హనుమకొండలోని మంత్రి సురేఖ ఇంటి ముట్టడి సందర్భంగా ఉద్రిక్తత నెలకొంది. సంగారెడ్డిలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇంటిని ముట్టడించారు. కొడంగల్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి వికారాబాద్, నారాయణపేట జిల్లాల నుంచి వచ్చిన అంగన్‌వాడీ టీచర్లు, సీఐటీయూ నాయకులను ఎక్కడి వారిని అక్కడే పోలీసులు అడ్డుకున్నారు. కొందరు అంగన్‌వాడీ టీచర్లు, సీఐటీయూ నాయకులు సీఎం ఇంటి వద్దకు చేరుకుని, ముట్టడికి చేసిన ప్రయత్నాన్ని పోలీసులు విఫలం చేశారు. కాగా, హనుమకొండలోని రాంనగర్‌లో గల రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ఇంటి ముట్టడికి అంగన్‌వాడీ టీచర్ల ప్రయత్నం ఉద్రిక్తతకు దారి తీసింది. వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్ జిల్లాల నుంచి వస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. మంత్రి నివాసానికెళ్లే రహదారులను బ్యారికేడ్లతో మూసివేసినా, గ్రేటర్ వరంగల్‌లోని అంగన్‌వాడీ టీచర్లు ఆమె నివాసానికి వెళ్లడానికి ప్రయత్నించగా, వారికి పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అరెస్టు చేసిన వారందరినీ విడుదల చేయాలని అంగన్‌వాడీ టీచర్లు భీష్మించుకూర్చోవడంతో పోలీసులు దిగి వచ్చారు. అటుపై మంత్రి సురేఖ నివాసానికి చేరుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ ఫోన్‌లో మాట్లాడుతూ.. తాను స్థానికంగా లేనని, వరంగల్‌కు వచ్చిన తర్వాత అంగన్‌వాడీ టీచర్లతో సమావేశమై వారి డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మరోవైపు, సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇంటిని ముట్టడించారు. అంగన్ వాడీ టీచర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వారికి కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మెట్రో మాకొద్దు!



అప్పులు, అధిక వడ్డీలను భరించలేకపోతున్నాం

- పెరిగిన నిర్మాణ వ్యయాన్నీ మాకు ఇవ్వడం లేదు
- 6000 కోట్లిస్తే ప్రాజెక్టు నుంచి తప్పుకొంటాం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎల్‌అండ్‌టీ లేఖ
- బకాయిలతోనే ఆర్థిక సంక్షోభమని వెల్లడి
- 2024-25లో మెట్రో ఆదాయం 1108 కోట్లు
- భూములను సద్వినియోగం చేసుకుంటే ఆదాయంవచ్చి ఉండేదని నిపుణుల వ్యాఖ్య

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రో రెండో దశను రాష్ట్ర ప్రభుత్వమే చేపడుతోంది. దాంతో, మొదటి దశను కూడా మీరే తీసేసుకోండని మెట్రో నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాసింది. తమకు రూ.6,000 కోట్లను సర్దుబాటు చేస్తే ప్రాజెక్టు నుంచి పూర్తిగా తప్పుకొంటామని ప్రతిపాదించింది. అప్పుల భారం పెరుగుతోందని, మెట్రోను తాము నిర్వహించే పరిస్థితి ఇక లేదని స్పష్టం చేసింది. మెట్రో మొదటి దశలోని తమ ఈక్విటీ వాటాను కేంద్రం లేదా రాష్ట్రానికి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొంది. అయితే, మెట్రో నిర్వహణ బాధ్యత నుంచి తప్పుకొంటామని ఎల్‌అండ్‌టీ చెబుతుండడం ఇదే తొలిసారి కాదు. గతంలోనూ రెండు మూడుసార్లు ఇటువంటి ప్రకటనలే చేసింది. అయితే, ఈసారి కేంద్ర గృహ నిర్మాణ శాఖ సంయుక్త కార్యదర్శి జైదీప్‌కు ఇటీవల లేఖ రాసింది. అలాగే, రాష్ట్ర ప్రభుత్వానికి కూడా విజ్ఞప్తి చేసింది. మొదటి దశలో చేపట్టిన మూడు కారిడార్లను కేంద్రానికి లేదా రాష్ట్రానికి అప్పగించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపింది. స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పీవీ)ని ఏర్పాటు చేసి అప్పగించాలని సూచించినా తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొంది. ఇదే విషయాన్ని వారం రోజుల కిందట సచివాలయంలో ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో వెల్లడించింది. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు రాకపోవడంతో టికెట్లు, ప్రకటనలతో వచ్చే ఆదాయం నిర్వహణకు సరిపోవడం లేదని, వడ్డీలు, విద్యుత్తు చార్జీలు, ఉద్యోగుల జీతభత్యాలు భారంగా మారాయని పేర్కొన్నట్లు తెలిసింది. మెట్రో రెండో దశకు అనుమతి ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర సర్కారు కోరుతున్న సమయంలో మొదటి దశ నుంచి తాము తప్పుకొంటామని ఎల్‌అండ్‌టీ లేఖ రాయడం గమనార్హం. అప్పులు, అధిక వడ్డీలను సమస్యగా చూపిస్తూ.. మెట్రో ప్రాజెక్టు నుంచి తప్పుకొంటామని ప్రతిపాదిస్తోంది. జాప్యంతో పెరిగిన నిర్మాణ వ్యయాన్ని ప్రభుత్వాలు సర్దుబాటు చేయకపోవడమూ కారణమని చెబుతున్నారు.

నష్టాలు నిజమేనా..!?

హైదరాబాద్ మెట్రోలోని మూడు కారిడార్లలో ప్రస్తుతం రోజుకు దాదాపు ఐదు లక్షల మంది ప్రయాణిస్తున్నారు. మన దగ్గర కనీస చార్జీ రూ.11 కాగా.. గరిష్ఠ చార్జీ రూ.69గా ఉంది. మిగిలిన మెట్రోలతో పోలిస్తే మన దగ్గరే చార్జీలు కాస్త ఎక్కువనే విమర్శ కూడా ఉంది. ఇక, మెట్రో నిర్వహణ అంటే.. టికెట్ చార్జీలు, యాడ్‌ల ఆదాయం లాభదాయకంగానే ఉన్నప్పటికీ అప్పులు, అధిక వడ్డీలతోనే తమకు నష్టాలు వస్తున్నట్లు హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి స్పష్టం చేశారు. నిజానికి, హైదరాబాద్‌లో 2012లో మెట్రో మొదటి దశ ప్రాజెక్టును చేపట్టారు. తొలుత రూ.14,132 కోట్లతో ప్రతిపాదించిన పనుల ఖర్చు 2017లో ప్రాజెక్టు (ఎల్బీ నగర్-మియాపూర్, జేబీఎస్- ఎంజీబీఎస్, నాగోల్-రాయదుర్గం కారిడార్లు.. మొత్తం 69.2 కిలోమీటర్లు) పూర్తయ్యేసరికి రూ.22 వేల కోట్లకు చేరింది. దాంతో, పనులను పూర్తి చేసేందుకు ఎల్‌అండ్‌టీ వివిధ బ్యాంకుల నుంచి అప్పులు తీసుకొచ్చింది. ప్రస్తుతం రూ.15,920.23 కోట్ల ఆస్తులున్న మెట్రోకు మొదటి దశలో రూ.8,148.07 కోట్ల అప్పులున్నాయి. మెట్రో నిర్మాణానికి తొలుత ప్రతిపాదించిన రూ.14,132 కోట్లలో ఎల్‌అండ్‌టీ రూ.9,892 కోట్లను పది బ్యాంకుల నుంచి 7-10 శాతం వడ్డీకి రుణం తీసుకుంది. తన వాటాగా 20 శాతం అంటే రూ.2,826 కోట్లను సమకూర్చింది. కేంద్రం 1,413 కోట్లను వీజీఎఫ్‌గా ఇవ్వాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే, బ్యాంకుల నుంచి దాదాపు పది శాతం వడ్డీకి అప్పులు తీసుకొచ్చామని, వాటికి వడ్డీలు కట్టడం భారంగా మారిందని ఇప్పుడు ఎల్‌అండ్‌టీ చెబుతోంది. ప్రాజెక్టు నుంచి తాము తప్పుకోవడానికి ఇదే ప్రధాన కారణంగానూ వివరిస్తోంది. నిజానికి, మెట్రో నిర్వహణ వ్యయం ఏడాదికి దాదాపు రూ.400 కోట్లు. కాగా.. 2024-25లో హైదరబాద్ మెట్రోకు మొత్తం రూ.1,108.54 కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో టికెట్ చార్జీల ద్వారా వచ్చిన ఆదాయమే రూ.627.11 కోట్లు. వెరసి, నిర్వహణ వ్యయం పోను మొదటి దశ నిర్మాణానికి చేసిన అప్పులకు ఇప్పటి వరకు రూ.4,500 కోట్ల వడ్డీలు చెల్లించినట్లు అధికారులు చెబుతున్నారు.

రూ.4 వేల కోట్లకుపైగా అదనపు ఆదాయం

హైదరాబాద్ మెట్రోను 2014 నాటికే పూర్తి చేయాల్సి ఉంది. అప్పట్లో అధికారంలోకి వచ్చిన తెలంగాణ ప్రభుత్వం రెండు అలైన్‌మెంట్లను మార్చాలని సూచించింది. అలైన్‌మెంట్‌లో మార్పులతో నిర్మాణంలో జాప్యం చోటు చేసుకుంది. దాంతో, నిర్మాణ వ్యయమూ పెరిగింది. వెరసి, నిర్మాణంలో జాప్యం కారణంగా 2017 నాటికే రూ.3,756 కోట్ల నష్టం జరిగిందని, దానిని సర్దుబాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. దీనిని ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆ భారం 2020 నాటికి రూ.5000 కోట్లకు చేరిందని మెట్రో అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీనికితోడు, కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన వయబులిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) రూ.254 కోట్లూ ఇవ్వట్లేదు. ఈ నేపథ్యంలోనే నిర్వహణ నుంచి తప్పుకోవాలని ఎల్‌అండ్‌టీ చూస్తున్నట్లు చెబుతున్నారు. అయితే, టికెట్లు, యాడ్‌ల ద్వారా మాత్రమే కాకుండా రియల్ ఎస్టేట్ ద్వారా మెట్రో రూ.4000 కోట్లకుపైగా ఆదాయాన్ని ఆర్జించిన విషయం ఇక్కడ ప్రస్తావనార్హం. నిజానికి, మెట్రో కార్యకలాపాలను నిర్వహిస్తున్న ఎల్‌అండ్‌టీకి అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు మార్గాల్లో ఆదాయానికి అవకాశంచ్చింది. ఒకటి, టికెట్ల ద్వారా 50% ఆదాయార్జన. రెండోది.. యాడ్స్ ద్వారా 5% ఆదాయం. మూడోది.. అత్యంత కీలకమైనది రియల్ ఎస్టేట్. మెట్రోకు హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో 269 ఎకరాలను ఇచ్చింది. 60 ఏళ్లపాటు ఈ ప్రభుత్వ స్థలాలను వినియోగించుకుని నిర్వహణను చేపట్టాలని ఒప్పందం చేసుకున్నారు. వీటిలో ఆఫీసు స్పేస్‌లను, షాపింగ్ మాల్స్ నిర్వహణ ద్వారా ఆదాయాన్ని సాధించడం. దాంతో, హైటెక్ సిటీ, ఎర్రమంజిల్, పంజాగుట్ట, మూసారాంబాద్ ప్రాంతాల్లో 18 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నాలుగు మాల్స్ నిర్మించింది. వీటిని సబ్ లైసెన్స్‌కు ఇచ్చి రూ.3000 కోట్లకు ఒప్పందం కుదుర్చుకుంది. అలాగే, రాయదుర్గంలోని 15 ఎకరాలను రూ.1045 కోట్లకు సబ్ లీజుకు ఇచ్చింది. ఇందులో 2023లో ఎల్‌అండ్‌టీకి రూ.512 కోట్లు వచ్చాయి. మిగిలిన మొత్తం రావాల్సి ఉంది. నిజానికి, రవాణా ఆధారిత అభివృద్ధి కింద ఇచ్చిన 269 ఎకరాల్లో ఇప్పటి వరకు 50 శాతం భూములను కూడా మెట్రో సద్వినియోగం చేసుకోలేదని తెలుస్తోంది. మెట్రో ఆర్థిక సంక్షోభానికి ఇది ప్రధాన కారణంగా ఆ సంస్థ అధికారులే చెబుతున్నారు.

ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వ అధీనంలోనే..

హైదరాబాద్‌లోనే కాకుండా ఢిల్లీ, బెంగళూరు, ముంబై, చెన్నై, కొచ్చి, లఖ్‌నవూ, నాగ్‌పూర్, పుణె, అహ్మదాబాద్‌ల్లో మెట్రో రైళ్లు నడుస్తున్నాయి. వీటన్నిటినీ అక్కడి రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోనే చేపట్టారు. వాటినిర్వహణ కోసం ప్రత్యేక కార్పొరేషన్లు (ఎస్పీవీ) ఏర్పాటు చేశారు. వీటిలో అత్యధికం లాభాల బాటలోనే పయనిస్తున్నాయని వాటి గణాంకాలు చెబుతున్నాయి. మరికొన్ని వ్యవస్థలు నష్టాల్లో కొనసాగుతున్నా.. అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు దానిని భారంగా పరిగణించడం లేదు. దానిని వాణిజ్యపరంగా చూడకుండా ప్రజా రవాణా మెరుగుపరిచే సామాజిక అవసరంగా చూస్తున్నాయి. కొవిడ్ సమయంలో హైదరాబాద్ మెట్రోకు మాత్రమే కాకుండా వాటికి కూడా నష్టాలు వచ్చాయి. అయినా, వాటిని సర్దుబాటు చేసుకుంటూ ముందుకు సాగుతున్నాయి. హైదరాబాద్ మెట్రోను పీపీపీ మోడల్‌లో ఏర్పాటు చేయడమే కాకుండా దానికి ప్రభుత్వ భూములను కూడా ఇచ్చారు. దాదాపు 90 శాతం నిధులను బ్యాంకుల నుంచి రుణంగా తీసుకున్నారు. భూములను సద్వినియోగం చేసుకోకపోవడమే మెట్రో ప్రస్తుత పరిస్థితికి కారణమని అధికార వర్గాలు వివరిస్తున్నాయి. ఇక, మెట్రో వసూలు చేస్తున్న అద్దెలూ ఎక్కువనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉదాహరణకు, రాయదుర్గం రహేజా మైండ్ స్పేస్‌లో చదరపు గజానికి రూ.30 వేల అద్దె విధించడంతో చాలామంది ముందుకు రావడం లేదని చెబుతున్నారు. ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నా.. కొత్త రైళ్లు, అదనపు బోగీలను ఏర్పాటు చేయకపోవడం మరో ప్రధాన లోపంగా వివరిస్తున్నారు.

బండి సంజయ్‌పై పరువు నష్టం దావా

- సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌లతోపాటు పలు మీడియా సంస్థలపై కూడా దాఖలు
- రూ.10కోట్ల పరిహారం చెల్లించాలంటూ సిటీ సివిల్ కోర్టులో కేటీఆర్ పిటిషన్



హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరువు నష్టం దావా దాఖలు చేశారు. రాజకీయ కక్షతో తనపై తీవ్ర ఆరోపణలు చేసినందుకు రూ.10కోట్ల మేర పరిహారం చెల్లించాలని సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ వేశారు. బండి సంజయ్‌తోపాటు ఆయన వ్యాఖ్యలను ప్రసారం చేసిన పలు మీడియా సంస్థలు, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపైనా దావా వేసినట్లు ఆయన కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది ఆగస్టు 8న తెలంగాణ ఎస్ఐబీ (స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్) దుర్వినియోగం, ఫోన్ ట్యాపింగ్, ఆర్థిక అవకతవకల్లో కేటీఆర్ పాత్ర ఉందంటూ బండి సంజయ్ తీవ్ర ఆరోపణలు చేశారని, ఈ వ్యాఖ్యలు ఏబీఎన్, ఎన్టీవీ, టీవీ5, వీ6, ఏఎన్ఎన్ తెలుగు వంటి టీవీ చానళ్లు, ఇండియాటుడే, ఎన్డీటీవీ, డెక్కన్ హెరాల్డ్, టైమ్స్ ఆఫ్ ఇండియా వంటి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, ఎక్స్, యూట్యూబ్, గూగుల్, మెటా (ఫేస్‌బుక్/ ఇన్‌స్టాగ్రామ్) వంటి సోషల్ మీడియా వేదికల్లో విస్తృతంగా ప్రసారమయ్యాయని పేర్కొంది. ఇందుకు సంబంధించి ఆగస్టు 11న సంజయ్‌కు లీగల్ నోటీసులు పంపినా.. క్షమాపణ చెప్పడానికి నిరాకరించడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు కేటీఆర్ కార్యాలయం తెలిపింది.

కేటీఆర్ బెదిరించే ప్రయత్నం చేస్తున్నారు

- న్యాయపరంగా ఎదుర్కొంటా: సంజయ్



కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పరువు నష్టం దావాతో తనను బెదిరించేందుకు కేటీఆర్ ప్రయత్నిస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. దానిని తాను న్యాయపరంగా, రాజకీయంగా ఎదుర్కొంటానని స్పష్టం చేశారు. కరీంనగర్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను తొమ్మిది సార్లు జైలుకు వెళ్లి వచ్చానని, వందకుపైగా కేసులు ఎదుర్కొంటున్నానని తెలిపారు. కేటీఆర్ లాగా ఇజ్జత్ దావా వేయాలంటే తాము అనేక కేసులు వేయవచ్చన్నారు. తంబాకు తింటున్నానంటూ తనపై దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. ఈ అంశంపై ప్రమాణం చేసేందుకు దేవుడి సన్నిధికి రావాలన్న తన సవాల్‌ను కేటీఆర్ ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ఆయనతో సినిమా చేస్తా



అడివి శేష్

మౌళి తనూజ్, శివానీ నాగారం జంటగా సాయి మార్తాండ్ తెరకెక్కించిన చిత్రం 'లిటిల్ హార్ట్స్'. ఆదిత్య హాసన్ నిర్మించారు. ఇటీవలె విడుదలై విజయవంతంగా థియేటర్లలో ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం సక్సెస్ సెలబ్రేషన్స్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన హీరో అడివి శేష్ మాట్లాడుతూ 'ఈ సినిమా చూశాను బాగుంది. సాయి మార్తాండ్ డైరెక్షన్‌లో మూవీ చేయాలని ఉంది' అని అన్నారు. దర్శకుడు మారుతి మాట్లాడుతూ "లిటిల్ హార్ట్స్' విజయం చిన్న చిత్రాలకు మరోసారి దారి చూపించింది. ఒక చిన్న సినిమా హిట్ అయితే వంద సినిమాలు తీసే ధైర్యాన్ని ఇస్తుంది' అని అన్నారు. సినిమా రిలీజ్ చేసిన బన్నీ వాసు, వంశీ నందిపాటి మాట్లాడుతూ మా సినిమాపై ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమను మర్చిపోలేం' అని అన్నారు.

ఎడారిలో పోరాటం




అల్లు అర్జున్ కథానాయకుడిగా అట్లీ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఏఏ22 ఏ6' షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా సాగుతోంది. ఇటీవలె దాదాపు 50 రోజుల పాటూ జరిగిన ముంబై షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలతో పాటూ అల్లు అర్జున్‌పై ఓ సాంగ్‌నూ చిత్రీకరించారు. తదుపరి షెడ్యూల్ అబుదాబిలోని లివా ఒయాసిస్‌లో అక్టోబరు నుంచి ప్రారంభం కానుంది. ఈ షెడ్యూల్‌లో భారీ పోరాట సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. అల్లు అర్జున్, దీపికా పడుకొనే తదితరులు పాల్గొంటారు. ప్రస్తుతం అబుదాబిలో లొకేషన్ల వేటలో ఉన్నారు అట్లీ. అతి త్వరలోనే ఈ షెడ్యూల్ మొదలయ్యే తేదీని ప్రకటించనున్నారు. సమాంతర ప్రపంచం నేపథ్యంలో సాగే ఈ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌లో అల్లు అర్జున్ నాలుగు పాత్రల్లో కనిపించనున్నారని సమాచారం.

హంగ్రీ చీతా



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ తెరకెక్కించిన గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా 'ఓజీ'. డీవీవీ దానయ్య నిర్మించారు. ఈనెల 25న పాన్ ఇండియా స్థాయిలో చిత్రం విడుదలవుతోంది. ఇప్పటికే విడుదల చేసిన గ్లింప్స్, పాటలు సినిమాపై అంచనాలను రెట్టింపు చేశాయి. సోమవారం చిత్రం నుంచి 'గన్స్ అండ్ రోజెస్' పాటను విడుదల చేశారు మేకర్స్. 'అతనొక తూటా.. నెత్తురుకి మరిగిన హంగ్రీ చీతా.. ఎవ్వరికి అందదు అతని రేంజ్' అంటూ శక్తిమంతమైన పదాలు, అద్భుతమైన ఎలివేషన్లతో సాగిన ఈ గీతం ఇప్పుడు నెట్టింట అభిమానులను ఖుషీ చేస్తోంది. తమన్ సంగీతం అందించారు. ఇందులో ఓజాస్ గంభీరగా పవన్‌కల్యాణ్, ఓమీగా ప్రతినాయకుడి పాత్రలో బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ కనిపించనున్నారు. ప్రియాంక అరుళ్‌మోహన్ కథానాయిక.

మాస్ లుక్...



రవితేజ సోదరుడి కుమారుడు మాధవ్ భూపతిరాజు కథానాయకుడిగా తెరంగేట్రం చేస్తున్న చిత్రం 'మారెమ్మ'. మంచాల నాగరాజ్ దర్శకత్వంలో మయూర్‌రెడ్డి బండారు నిర్మిస్తున్నారు. సోమవారం మాధవ్ పుట్టినరోజు సందర్భంగా సినిమా నుంచి ప్రత్యేక పోస్టర్, గ్లింప్స్ విడుదల చేశారు. ఇందులో మాస్ లుక్‌లో కనిపించారు మాధవ్. విజువల్స్, సంగీతం ఆకట్టుకున్నాయి. ఈ చిత్రానికి ఎడిటర్: దేవ్ రాథోడ్, డీఓపీ: ప్రశాంత్ అంకిరెడ్డి, సంగీతం: ప్రశాంత్ ఆర్ విహారి.



తెలంగాణ రాష్ట్రంలో సినిమాల షూటింగ్స్‌కు, థియేటర్ల నిర్మాణానికి పొందాల్సిన అనుమతులు అన్నీ ఇకపై సింగిల్ విండో ద్వారా పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఫిల్మ్స్ ఇన్ తెలంగాణ' పేరుతో ఒక ప్రత్యేక వెబ్ సైట్ రూపొందిస్తున్నట్లు తెలంగాణ ఎఫ్‌డీసీ అధ్యక్షుడు దిల్ రాజు చెప్పారు. ఈ వెబ్ సైట్ రూపకల్పనకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన చిత్ర ప్రముఖులను, వివిధ శాఖల అధికారులను కోరారు. వెబ్ సైట్‌ను పూర్తి స్థాయిలో రూపొందించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంతరెడ్డి, సినమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని దిల్ రాజు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రియాంక, టూరిజం కార్పొరేషన్ ఎండీ క్రాంతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓ కొత్త ప్రపంచం సృష్టించా



శివరాజ్‌కుమార్, శిథిల్ శెట్టి, నాగశ్రీ జీఎస్ ప్రధాన పాత్రధారులుగా రవి బస్రూర్ తెరకెక్కించిన చిత్రం 'వీర చంద్రహాస'. సినిమా ఈ నెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. చిత్ర దర్శకుడు రవి బస్రూర్ మాట్లాడుతూ 'యక్షగానం సంస్కృతిని ప్రతిబింబించేలా చిత్ర కథ ఉంటుంది. నా పన్నెండు సంవత్సరాల కల ఇది. ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యేలా సినిమా ఉంటుంది. ఈ చిత్రంతో ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించాను. మన సంస్కృతిని కాపాడుకునేలా ఈ చిత్రం ఉంటుంది' అని చెప్పారు. నిర్మాతలు ఎమ్‌వీ రాధాకృష్ణ, జేమ్స్ డబ్ల్యూ కొమ్ము, ఎన్ ఎస్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ 'ఇటీవల కన్నడలో విడుదలై అఖండ విజయం సాధించిన 'వీర చంద్రహాస'ను తెలుగులో విడుదల చేయడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.



ఓ మధ్యతరగతి అమ్మాయి కథ



జేఎస్ఎస్ వర్ధన్

'ఈ సినిమాలో ఓ మధ్యతరగతి అమ్మాయి జీవితాన్ని చూపించబోతున్నాను. ఇప్పుడు అందరూ తమ జీవితాన్ని పక్కనేళ్ల జీవితంతో పోల్చుకుంటున్నారు. మనం ఎంత చేసినా చిన్న లోటు కనిపిస్తే దాన్ని మన పిల్లలు ఎత్తి చూపుతారు. అదే ఈ చిత్ర కథ' అని అన్నారు దర్శకుడు జేఎస్ఎస్ వర్ధన్. అంకిత్ కొయ్య, నీలఖి జంటగా జేఎస్ఎస్ వర్ధన్ తెరకెక్కించిన చిత్రం 'బ్యూటీ'. సినిమా ఈనెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు వర్ధన్ మీడియాతో ముచ్చటించారు.

- ఈ కథ డైరెక్టర్ మారుతి పిలిచి నాకు ఇచ్చారు. దీన్ని సుబ్రహ్మణ్యం అనే జర్నలిస్టు రాశారు. అయనే డైరెక్ట్ చేయాలి. కానీ 'జీ' సంస్థ వాళ్లు నన్ను సూచించారు. మొదటి సారి నేను వేరే వాళ్ల కథకు పనిచేశాను.
- ఈ సినిమాలో హీరో, హీరోయిన్ల మధ్య సన్నివేశాలు బాగా కుదిరాయి. సినిమా ఎక్కడా బోర్ కొట్టదు. హీరోయిన్‌ని చూస్తే పక్కింటి అమ్మాయి అనిపిస్తుంది. ఒక అంకిత్ తప్ప మిగతా నటీనటులందరినీ నేనే ఎంపిక చేసుకున్నాను. అంకిత్ సహజంగా నటించారు.
- ఈ చిత్రంలో లవ్ స్టోరీతోపాటు థ్రిల్లింగ్ పాయింట్ కూడా ఉంటుంది. ఒక జంట ఏమీ లేకుండా బయటకు వచ్చేస్తే వాళ్లు ఎలాంటి కష్టాలు పడతారు అని చూపించాను.

రౌడీ మంచిగా మారితే...



శ్రీరామ్, మిథున ప్రియ జంటగా కిశోర్‌శ్రీకృష్ణ తెరకెక్కిస్తున్న చిత్రం 'యంగ్ అండ్ డైనమిక్'. శ్రీరామ రాజు, లక్ష్మణరావు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కిశోర్‌శ్రీకృష్ణ మాట్లాడుతూ 'విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే చిత్రమిది. ఒక రౌడీ మంచివాడిగా మారితే ఎలా ఉంటుందో ఇందులో ఆసక్తికరంగా చూపిస్తున్నాం' అని అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకులు వీరశంకర్, వి సముద్ర, వీఎన్ ఆదిత్య పాల్గొన్నారు.

రేపు తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవం

» పబ్లిక్‌గార్డెన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న సీఎం

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బుధవారం (సెప్టెంబరు 17న) తెలంగాణ ప్రజాపాలనా దినోత్సవాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నాంపల్లిలోని పబ్లిక్‌గార్డెన్‌లో నిర్వహించే కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మువ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించనున్నారు. అలాగే, ఆయా జిల్లా కేంద్రాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు జాతీయ పతాకాలను ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు సీఎస్ కె.రామకృష్ణారావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల కార్యాలయాలు, పంచాయతీల్లో అధికారికంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు.


మేడారంలో పూజారులు, ఆదివాసీలు, అధికారులతో మంత్రి సీతక్క

మేడారంలో శాశ్వతంగా నిలిచేలా రాతి కట్టడాలు

» పరిగణనలోకి సంస్కృతీ సంప్రదాయాలు: సీతక్క

» రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క

ములుగు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేల సంవత్సరాలు నిలిచేలా మేడారంలో రాతి కట్టడాలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క చెప్పారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని వనదేవతలు సమ్మక్క, సారలమ్మ సన్నిధి మేడారంలో పర్యటించి పూజారులు, ఆదివాసీలు, అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఆదివాసీ సంప్రదాయాలకు అనుగుణంగా మేడారంలో చేపట్టనున్న శాశ్వత నిర్మాణాలపై చర్చించారు. మేడారంలో అభివృద్ధి పనులను పూజారులు, ఆదివాసీల అభిప్రాయం మేరకే చేపడతామన్నారు. 700 చిత్రాలు, గొట్టు గోత్రాలు, సంస్కృతీ సంప్రదాయాలు, వనదేవతల చరిత్రలు, ఆదివాసీల మూలాలు శాశ్వతంగా నిలిచేలా రాతి కట్టడాలపై లిఖిస్తామని తెలిపారు. పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు మాట్లాడుతూ మేడారం దేవస్థానం అభివృద్ధిపై దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు.

బయ్యారం ఎత్తిపోతల పథకం అంచనాల సవరణ

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా మధిర మండలం వైరా నది కుడిగట్టు నుంచి చేపట్టదలచిన బయ్యారం ఎత్తిపోతల పథకానికి రూ.3.34 కోట్లతో పరిపాలనపరమైన అనుమతినిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీన్ని రూ.3.39 కోట్లతో చేపట్టడానికి ప్రతిపాదనలు రాగా.. ప్రభుత్వం నిశితంగా పరిశీలించిన అనంతరం రూ.3.34 కోట్లకు కుదిస్తూ జీవో నెం.22ను జారీ చేసింది. ఐఎస్ కోడ్‌లు, మార్గదర్శకాల ప్రకారం ధరలు ఖరారు చేయాలని, ఎలక్ట్రో మెకానికల్ కాంపొనెంట్‌కు ఎత్తిపోతల పథకం సలహాదారుడు పెంటారెడ్డి నుంచి అనుమతి తీసుకోవాలని, డిజైన్లు/డ్రాయింగ్‌లకు సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ ఆమోదం తీసుకోవాలని నిర్దేశిస్తూ నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా సోమవారం జీవో జారీ చేశారు. ఇక ఇదే ఖమ్మం జిల్లా మధిర మండలం జాలిముడి గ్రామంలో జాలిముడి ఆనికట్ కుడి, ఎడమ కాలువల మరమ్మతులకు రూ.5.23 కోట్లతో పరిపాలనపరమైన అనుమతినిస్తూ మరో జీవో జారీ చేశారు. ఉపరితల చిన్న నీటిపారుదల పథకాల అమలు కోసం రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఇందిరమ్మ ఇళ్లకు 1435 కోట్లు విడుదల

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారులకు ఇప్పటివరకు 1,435 కోట్లు విడుదల చేసినట్లు గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్ వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.15 లక్షల ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాగా, 1.29 లక్షల ఇళ్ల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. వీటిలో సుమారు 20 వేల ఇళ్లు గోడల దశలో, 8,633 ఇళ్లు పైకప్పు దశలో ఉన్నాయి. పలుచోట్ల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని లబ్ధిదారులు గృహ ప్రవేశాలు కూడా చేసుకుంటున్నారని ఆయన తెలిపారు. ఇంటి నిర్మాణ పురోగతిని బట్టి ప్రతి సోమవారం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే నగదు జమచేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం 13,841 మంది లబ్ధిదారులకు రూ.146.30 కోట్లు విడుదల చేసినట్లు గృహ నిర్మాణ సంస్థ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

పోలీస్ సంస్కరణలకు 30 స్టేషన్ల ఎంపిక

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సంస్కరణల ప్రాజెక్టు అమలుపై రాష్ట్ర పోలీస్, ఇండియన్ పోలీస్ ఫౌండేషన్(ఐపీఎఫ్)ల మధ్య ఒప్పందం కుదిరింది. ఇందుకు సంబంధించిన అవగాహనా ఒప్పందం(ఎంఓయూ)పై సోమవారం డీజీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంతకాలు జరిగాయి. తొలుత సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 15 పోలీస్ స్టేషన్లు, సంగారెడ్డి జిల్లా పరిధిలో 15 పోలీస్ స్టేషన్లలో సంస్కరణలను అమలు చేయనున్నారు. పోలీసు స్టేషన్లతో సంబంధం ఉన్న అన్ని వర్గాల వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకొని, పరిష్కార మార్గాలను సూచిస్తారు. ఇతర రాష్ట్రాల్లోని ఉత్తమ పద్ధతుల్ని గుర్తించి నివేదికలు సిద్ధం చేస్తారు. వీటిపై ఎంపికైన ఈ 30 పోలీస్ స్టేషన్ల సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఆ తర్వాత దశల వారీగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లకు విస్తరిస్తారు. ఈ సందర్భంగా డీజీపీ జితేందర్ మాట్లాడుతూ.. ఇప్పటికే రాష్ట్ర పోలీస్‌లు చేపట్టిన పోలీస్ స్టేషన్లలో క్యూఆర్ కోడ్ వ్యవస్థ, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, మహిళల కోసం టీ-సేఫ్ యాప్ వంటి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని చెప్పారు.

ఇంజనీరింగ్ అంటే రోడ్లు, వంతెనల నిర్మాణం కాదు

» అది ఎంతో మంది జీవితాలను ప్రభావితం చేస్తుంది

» ఆర్ అండ్ బీ ఈఎన్‌సీ మోహన్‌నాయక్

ఇంజనీరింగ్ అంటే కేవలం రోడ్లు, వంతెనల నిర్మాణం మాత్రమే కాదని, అది గ్రామాలు, పట్టణాలను అనుసంధానిస్తూ ఎంతో మంది జీవితాలను ప్రభావితం చేస్తుందని ఆర్ అండ్ బీ ఈఎన్‌సీ మోహన్‌నాయక్ అన్నారు. ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ క్యాంపస్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇంజనీర్లందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఇంజనీర్లు చేసే నిర్మాణాలను ప్రజలు మర్చిపోలేరని, తాను ఉద్యోగంలో చేరిన తొలినాళ్లలో నిర్మించిన పలు రోడ్లు, వంతెనలను ఆ ప్రాంత ప్రజలు ఇప్పటికీ గుర్తుంచుకున్నారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఎక్స్‌ప్రెస్ వేలతో పాటు నీటిపారుదల ప్రాజెక్టులు, పట్టణాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఇంజనీర్లు పనిచేయాలని సూచించారు.

రేవంత్ సొంత లాభం కోసం ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ మార్పు: హరీశ్

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సొంత లాభం కోసం సీఎం రేవంత్‌రెడ్డి వికారాబాద్, పరిగి, కొడంగల్ మీదుగా ఆర్‌ఆర్‌ఆర్ మార్గాన్ని అష్టవంకరలు తిప్పుతూ పచ్చటి పొలాలను మాయం చేసే కుట్రకు తెరలేపారని మాజీమంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణం రేవంత్ ఇంటి వ్యవహారం కాదని, రైతుల ప్రయోజనాలు పణంగా పెట్టే చర్యలు ఆపకపోతే బీఆర్ఎస్ తీవ్రంగా ప్రతిఘటిస్తుందని హెచ్చరించారు. ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చి తమ కడుపు కొడుతున్నారంటూ సంగారెడ్డి నియోజకవర్గం కొండాపూర్ మండలంలోని పలు గ్రామాల రైతులు సోమవారం హరీశ్‌రావును కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. పాత అలైన్‌మెంట్ కొనసాగించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వెంచర్లు, కాంగ్రెస్ నేతల భూములు పోకుండా.. రైతుల పొలాలు మాత్రమే నష్టపోయేలా కొత్త అలైన్‌మెంట్‌ను ప్రతిపాదించడం సిగ్గుచేటన్నారు. కాగా, ఏళ్ల తరబడి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో విద్యాసంస్థల యాజమాన్యాలు బంద్ పాటిస్తున్నాయని, రేవంత్ పాలనలో అన్నీ బందే అవుతున్నాయని 'ఎక్స్' వేదికగా హరీశ్ విమర్శించారు. కాంగ్రెస్ చేతగాని పాలన చూసి అన్నివర్గాల ప్రజలు విసిగి వేసారిపోయారని, రేవంత్‌కు మీకు బుద్ధి చెప్పేందుకు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు.

వీధి దీపాలపై పక్కాగా పర్యవేక్షణ

» రాష్ట్రవ్యాప్తంగా ఎల్ఈడీ దీపాలే ఉండాలి

» గ్రామాల్లో నిర్వహణ బాధ్యత సర్పంచ్‌లదే

» ఎంపీడీవోల పర్యవేక్షణలో డ్యాష్‌బోర్డు

» అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఎల్ఈడీ వీధి దీపాల పర్యవేక్షణ పక్కాగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో ఎల్ఈడీ వీధి దీపాలనే ఏర్పాటు చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పంచాయతీరాజ్, పురపాలకశాఖ అధికారులతో సోమవారం సీఎం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల పరిధిలో 16.16లక్షల ఎల్ఈడీ దీపాలు ఉన్నాయని, వరంగల్, నల్లగొండ, జనగామ, నారాయణపేట జిల్లాల్లో ఏజెన్సీల ఆధ్వర్యంలో ఎల్ఈడీ దీపాల నిర్వహణ ఉందని అధికారులు వివరించారు. ఇక, జీహెచ్ఎంసీ పరిధిలో 5.50లక్షల ఎల్ఈడీ వీధి దీపాలున్నాయని, ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ సిటీలో కొత్తగా 7.50లక్షల దీపాలు అవసరమవుతాయని వెల్లడించారు. గతంలో ఉన్న ఏజెన్సీ కాంట్రాక్టు ముగియడంతో ఇప్పుడు చాలాచోట్ల దీపాలు వెలగడం లేదని, నిర్వహణ కూడా సరిగా లేదని నివేదించారు. ఆయా అంశాలపై సీఎం స్పందిస్తూ.. గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణను సర్పంచ్‌లకే అప్పగించాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న దీపాలు వెలుగుతున్నాయా? లేదా? కొత్తగా ఎన్ని అవసరం? అనే అంచనాలు పక్కాగా ఉండాలని, పోల్ సర్వే చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల డ్యాష్ బోర్డును ఎంపీడీవోలు, జిల్లా స్థాయిలో అడిషనల్ కలెక్టర్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని ఎల్ఈడీ దీపాలను హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ కార్యాలయానికి అనుసంధానం చేయాలన్నారు. జీహెచ్ఎంసీలో కొత్తగా కలిపిన కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, గ్రామాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ఎల్ఈడీ దీపాల అవసరాన్ని అంచనా వేయాలని ఆదేశించారు. కొత్తగా ఎల్ఈడీ దీపాల ఏర్పాటుకు టెండర్లు పిలవాలని, ఎల్ఈడీ దీపాల తయారీలో పేరున్న సంస్థలు పాల్గొనేలా నిబంధనలు రూపొందించాలని సూచించారు. ఏడేళ్లపాటు నిర్వహణ బాధ్యతలను కంపెనీలకే అప్పగించాలని, నిర్వహణ పక్కాగా ఉండేలా టెండర్ నిబంధనలు రూపొందించుకోవాలన్నారు. ఎల్ఈడీ దీపాలు పని చేస్తున్నాయా? లేదా? అనేది తెలుసుకోవడానికి ప్రత్యేకంగా వ్యవస్థ ఉండాలని నిర్దేశించారు. ఐఐటీ హైదరాబాద్ వంటి సంస్థతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని సూచించారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో వీధి దీపాలకు ప్రతి నెలా రూ.8 కోట్ల కరెంటు బిల్లులు చెల్లించాల్సి వస్తోందని, దీన్ని తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. సౌర విద్యుత్తును వినియోగించే అంశాన్ని పరిశీలించాలన్నారు.

150 మీటర్లతో తుమ్మిడిహెట్టి!

(మొదటి పేజీ తరువాయి)

ప్రయోజనం లేదని, 150 మీటర్లతో కట్టడానికి వీలుగా ఆ రాష్ట్రాన్ని ఒప్పించాలని సీఎం అన్నారు. 148, 150, 152 మీటర్ల వద్ద ముంపుపై పుణెలోని కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్) ఇప్పటికే అధ్యయనాలు కూడా చేసింది. 148 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మించినా, 150 మీటర్ల ఎత్తుతో నిర్మించినా పెద్దగా ముంపు ఉండబోదని అధ్యయనాలు చెబుతున్నాయి. 148 మీటర్లతో నిర్మిస్తే... ముంపు 300 ఎకరాల్లోపు ఉంటుందని, 150 మీటర్లతోనైతే 1500 ఎకరాల్లోపు, 152 మీటర్లతో 4 వేల ఎకరాల్లోపు ముంపు ఉంటుందని పేర్కొంటున్నాయి. అయితే 150 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తేనే ప్రయోజనం ఉంటుందని, అంతకన్నా తక్కువ ఎత్తుతో కడితే ఉపయోగం ఉండదని నీటిపారుదల రంగ నిపుణులు చెప్పడంతో 1500 ఎకరాలకు గరిష్ఠ పరిహారం చెల్లించడానికి వీలుగా కసరత్తు చేపట్టాలని అధికారులకు సీఎం సూచించినట్లు సమాచారం.



ఎకరానికి రూ.25 లక్షల పరిహారం..

ముంపు ప్రాంతాల్లోని భూమి ధర ఎకరానికి రూ.5 లక్షల లోపే ఉన్నప్పటికీ.. రూ.25 లక్షల దాకా పరిహారం చెల్లించి భూములను సేకరించడానికి సమ్మతి తెలపాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ ప్రక్రియ కోసం సాంకేతిక సాధ్యాసాధ్యాలపై నివేదిక రూపొందించి ఈ నెలాఖరులోగా మహారాష్ట్ర సీఎంతో పాటు అధికారులను కలిసే బాధ్యతను ప్రభుత్వం నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్‌కు అప్పగించింది. వాస్తవానికి 2016 మార్చి 8న తుమ్మిడిహెట్టిని 148 మీటర్ల ఎత్తుతో నిర్మించడానికి మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత మహారాష్ట్ర సీఎం, తెలంగాణ సీఎంల మధ్య ఈ మేరకు ఒప్పందం కూడా కుదిరింది. అదే సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ కోసం కూడా ఒప్పందం చేసుకున్నారు. అయితే తుమ్మిడిహెట్టితోపాటే మేడిగడ్డ కూడా కడతామని అప్పట్లో ప్రకటించిన ప్రభుత్వం.. ఆ తరువాత తుమ్మిడిహెట్టిని పక్కన పెట్టింది. తాజాగా ఆరు నూరైనా తుమ్మిడిహెట్టి కడతామని సీఎం రేవంత్ ప్రకటించారు. ఇటీవల నీటిపారుదల శాఖపై సమీక్ష సందర్భంగా కీలక నిర్ణయం తీసుకున్నారు. 150 మీటర్లతో బ్యారేజీ కట్టడానికి వీలుగా తగిన చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

కాళేశ్వరం డీపీఆర్‌ను ముట్టుకోకుండా..

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ముట్టుకోకుండా తుమ్మిడి హెట్టి బ్యారేజీ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 80 టీఎంసీలతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు డీపీఆర్‌ను సిద్ధం చేసే అవకాశాలున్నాయి. ఇందులో భాగంగా తుమ్మిడిహెట్టి బ్యారేజీని 2.75 టీఎంసీల సామర్థ్యంతో కట్టనున్నారు. 150 మీటర్లతో దీనిని నిర్మిస్తే 60 టీఎంసీల దాకా నీటిని గ్రావిటీ ద్వారా తరలించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టి... నీటిని తరలించడానికి ప్రస్తుతం రెండు ప్రతిపాదనలు ఉన్నాయి. మొదటిది.. తుమ్మిడిహెట్టి నుంచి సుందిళ్లకు నీటిని తరలించి, అక్కడి నుంచి ఎల్లంపల్లికి పంపింగ్ చేసుకోవడం. కాగా, రెండోది.. తుమ్మిడిహెట్టి నుంచి నేరుగా ఎల్లంపల్లికి నీటిని తరలించడం. దీనికోసం ఇప్పటికే 71.5 కిలోమీటర్ల వరకు (ఎల్లంపల్లి సమీపంలోని మైలారం గ్రామం దాకా) గ్రావిటీ కాలువ నిర్మాణం ఇదివరకే పూర్తయింది. మైలారం గ్రామం వద్ద పంప్‌హౌస్ నిర్మించి, అక్కడి నుంచి ఎల్లంపల్లి రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి డ్యామ్ 116 కిలోమీటర్ల దూరంలో ఉండగా.. అందులో 71.5 కిలోమీటర్ల వరకు గ్రావిటీ కాలువ పనులు కూడా పూర్తయ్యాయి. అయితే తుమ్మిడిహెట్టిని 150 మీటర్లతో కడితే.. గ్రావిటీ ద్వారా మైలారం గ్రామం దాకా నీళ్లు వస్తాయి. ఒకవేళ సుందిళ్ల బ్యారేజీకి తరలించాల్సి వస్తే అక్కడి నీరు గ్రావిటీతో చేరుతుంది. సుందిళ్లలో ప్రస్తుతం సీపేజీలు ఉండగా... వాటికి మరమ్మతులు చేయాల్సి ఉంది. అదే ఎల్లంపల్లికి నేరుగా నీటిని తరలించాలంటే మైలారం వద్ద కొత్తగా పంప్‌హౌస్ ఏర్పాటుచేయాల్సి ఉంటుంది. దాంతో ఏ ప్రతిపాదనకు ప్రభుత్వం మొగ్గుచూపుతుందో డీపీఆర్ సిద్ధమయ్యాకే తేలనుంది.

కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ...!

కాళేశ్వరం ప్రాజెక్టులోని లింక్-1లో సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలతో పాటు మూడు పంప్‌హౌస్‌లు ఉన్నాయి. వీటికి రూ.27,637 కోట్ల దాకా వెచ్చించారు. మేడిగడ్డ సామర్థ్యం 16.17 టీఎంసీలు కాగా.. అన్నారం సామర్థ్యం 10.87 టీఎంసీలు, సుందిళ్ల సామర్థ్యం 8.83 టీఎంసీలు. ప్రస్తుతం బ్యారేజీల్లో సీడబ్ల్యూపీఆర్ఎస్ (పుణె) అధ్యయనాలు చేస్తోంది. వరదలు తగ్గుముఖం పట్టాక పరీక్షలన్నీ పూర్తికానున్నాయి. ఆ తర్వాత ఆ నివేదికల ఆధారంగా పునరుద్ధరణ కోసం డిజైన్లు సిద్ధం చేయనున్నారు. బ్యారేజీల పునరుద్ధరణ అనంతరం నీటి నిల్వను గణనీయంగా తగ్గించుకొని.. కేవలం పంపింగ్‌కు అనుకూలత (పంపుల హెడ్‌కు నీరు తగిలేంత) వరకు నిల్వ చేసుకొని, నీటిని పంపింగ్ చేసుకోవడానికి అత్యవసర పరిస్థితుల్లోనే దీనిని వాడుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యంతో తుమ్మిడిహెట్టికి లైన్ క్లియర్

తాజాగా కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యంతో తుమ్మిడిహెట్టి బ్యారేజీకి రూట్ క్లియర్ అయింది. 2023 అక్టోబరు 21న కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి చెందిన ఏడో బ్లాకు(11 పిల్లర్లు) కుంగింది. ఒక పిల్లరు విరిగింది కూడా. ఆ తర్వాత అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో భారీగా సీపేజీలు బయటపడ్డాయి. దీనిపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ నివేదిక కూడా ఇచ్చింది. అయితే బ్యారేజీల పునరుద్ధరణ కోసం భూభౌతిక/భూసాంకేతిక పరీక్షలు చేసి, పునరుద్ధరణ కోసం ఒక ప్రణాళికను సిద్ధం చేసి, కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) ఆమోదం కూడా తీసుకోవాలని సిఫారసు చేసింది. కానీ, మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ అంత తేలికేమీ కాదని, 11 పిల్లర్లు ఉన్న ఏడో బ్లాకును తొలగించడం, ఇతర బ్లాకుల్లో లోపాలను సరిచేయడం వంటి వాటికి అయ్యే వ్యయంతో కొత్తగా బ్యారేజీ కట్టవచ్చని పలువురు సూచిస్తున్నారు. మేడిగడ్డను పునరుద్ధరించేలోపే.. తుమ్మిడిహెట్టి బ్యారేజీ కట్టాలని గుర్తు చేయడంతో ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.



సీఎం రేవంత్‌ను కలిసిన యూఎస్ కాన్సుల్ జనరల్ లారా

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని యూఎస్ కాన్సులేట్ కాన్సుల్ జనరల్ (హైదరాబాద్) లారా విలియమ్స్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఇరువురు ముచ్చటించారు. వీరి వెంట సీఎంవో అధికారి అజిత్‌రెడ్డి కూడా ఉన్నారు.

19న ఛత్తీస్‌గఢ్‌కు మంత్రి ఉత్తమ్

» ఆ రాష్ట్ర సీఎంను కలిసి సమ్మక్కసాగర్.. ప్రాజెక్టుకు ఎన్‌వోసీ కోరనున్న మంత్రి

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 19న ఛత్తీస్‌గఢ్ వెళ్లనున్నారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్‌ని కలిసి.. సమ్మక్కసాగర్ (తుపాకులగూడెం) ప్రాజెక్టుకు నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఇవ్వాల్సిందిగా కోరనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నీటిపారుదల ప్రణాళికతోపాటు పలు అంశాలను నివృత్తి చేసుకునేందుకు కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) 23న తెలంగాణ అధికారులతో సమావేశం కానుంది. దాంతో ఈలోగా ఎన్‌వోసీ తెచ్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకే ఈ నెల 16న లేదా 19న ఛత్తీస్‌గఢ్ సీఎంను కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరుతూ తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. దాంతో 19న రావాల్సిందిగా అక్కడి నుంచి కబురు అందడంతో ఐదుగురు అధికారులతో కలిసి మంత్రి ఉత్తమ్ ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లనున్నారు. ప్రాజెక్టుకు వచ్చే గరిష్ఠ వరదకు అనుగుణంగా ఏ మేరకు ముంపు ఉంటుందో.. ఆ మేరకు పరిహారం ఇవ్వడానికి తెలంగాణ తరఫున సమ్మతి తెలపనున్నారు.

ఓ దొంగకోళ్ల కేసు.. పోలీస్ X పోలీస్

(మొదటి పేజీ తరువాయి)

కేసులో భాగంగా అంటే నమ్మాలి! స్థానిక పోలీసులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విచారణ పేరుతో ఏపీ పోలీసుల ఈ దుందుడుకు చర్య కొత్తగూడెం జిల్లా దమ్మపేటవాసుల్లో తీవ్ర ఆగ్రహావేశాలను రగిల్చింది. దౌర్జన్యానికి దిగారంటూ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసేలా ఉసిగొల్పింది. చోరీకి గురైనవి నాలుగు కోళ్లు! వాటి విలువ రూ.4 లక్షలు! అంత ఖరీదా? అనంటే.. అన్నీ కూడా పిస్తా, బాదాం పప్పులు గట్రా మేస్తూ వచ్చే సంక్రాంతి కోసం సిద్ధమవుతున్న పందెం కోళ్లు! ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం పట్టాయిగూడెం గ్రామానికి చెందిన రంగనాథ్ అనే వ్యక్తికి చెందిన ఈ కోళ్లను పదిరోజుల క్రితం దొంగలెత్తుకెళ్లారు. వెంటనే రంగనాథ్, చింతలపూడి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఎలా తెలుసుకున్నాడో ఏమో గానీ ఆ రంగనాథే తన కోళ్లను పిల్లి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి దొంగిలించాడని.. ఆ కోళ్లలో రెండింటిని దమ్మపేటకు చెందిన గోపవరపు శేషగిరికి విక్రయించాడని తెలుసుకొని పోలీసులకు ఉప్పందించాడు. సోమవారం చింతలపూడి స్టేషన్ నుంచి హెడ్‌కానిస్టేబుల్, ఓ కానిస్టేబుల్, ఓ హోంగార్డు కలిసి ఓ కార్లో... స్థానికంగా ఉంటున్న కొందరు మరో మూడు కార్లలో బయలుదేరి దమ్మపేటలో వాలారు. నేరుగా గోపవరపు శేషగిరి ఇంట్లోకి వెళ్లారు. ఆ సమయంలో శేషగిరి ఇంట్లో లేడు. అతడి భార్య రాజేశ్వరిని ఉద్దేశించి 'నీ భర్త ఎక్కడ?' అంటూ పోలీసులు గద్దించారు. 'దొంగకోళ్లు ఎందుకు కొన్నారు?' అని ప్రశ్నించారు. లోపలి నుంచి గేట్లు మూసేసి.. ఇంట్లోని సీసీ కెమెరాలు, హార్డ్ డిస్కులు స్వాధీనం చేసుకున్నారు. ఇంట్లో ఓ చోట.. వేరే రెండు కోళ్లు కట్టేసి ఉండటం చూసి.. ఇవే కదా.. మీరు కొన్న కోళ్లు? అంటూ దుర్భాషలాడారు. ఆ కోళ్లను తమ కార్లో వేసుకున్నారు. అయితే అప్పటికే అక్కడికి చేరుకున్న గ్రామస్థులు, ఏపీ పోలీసులు అక్కడి నుంచి వెళ్లకుండా అడ్డుకున్నారు. వెంటనే.. దమ్మపేట పోలీస్ స్టేషన్‌కు సమాచారమిచ్చారు. స్టేషన్ నుంచి ఓ పోలీసు ఘటనా స్థలానికి చేరుకొని.. ఏపీ పోలీసులను, వారి వెంట వచ్చినవారిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. కాగా చింతలపూడి సీఐ క్రాంతి కుమార్ సోమవారం రాత్రి దమ్మపేటకు చేరుకుని తమ సిబ్బందిని విడిచిపించుకుని తీసుకెళ్లారు. ఈ విషయంపై దమ్మపేట ఎస్సై సాయికిషోర్‌రెడ్డి వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. వాస్తవానికి పిల్లి వెంకటేశ్వర్లు నుంచి ఓ రెండు కోళ్లను శేషగిరి కొన్నట్లు తెలిసింది. వాటిని అతడు మరో వ్యక్తి ఇంట్లో ఉంచి.. అక్కడి నుంచి వేరే రెండు కోళ్లను తెచ్చి పెట్టుకున్నట్లు సమాచారం. అయితే మిగిలిన రెండు పందెం కోళ్లను వెంకటేశ్వర్లు తన వద్దే పెట్టుకున్నాడు. గ్రామానికి పోలీసులొచ్చారనే విషయం తెలుసుకొని.. శివార్లలోని ఓ చర్చి వద్ద ఆ రెండు కోళ్లను వదిలేసి అతడు పరారయ్యాడు. నాలుగు కోళ్లు దొరకడంతో ఏపీ పోలీసులు శేషగిరికి సంబంధించిన రెండు కోళ్లను అతడికిచ్చేసి, పందెం కోళ్లతో వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.

కోటి కార్డులు!

(మొదటి పేజీ తరువాయి)

అమలు చేసే ఆరు గ్యారెంటీల్లో రేషన్ కార్డుల పంపిణీ ఒకటి. రేవంత్ సర్కారు ఏర్పడేనాటికి 89,95,282 కార్డులున్నాయి. వీటిపై 2,81,47,565 మంది లబ్ధిదారులు ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలోనూ, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రేషన్ కార్డులు కావాలంటూ కొత్తగా 18 లక్షల దరఖాస్తులు వచ్చాయి. జనవరి 26 (గణతంత్ర దినోత్సవం) నుంచి లబ్ధిదారుల ఎంపికకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. మే చివరికి వచ్చేసరికి 2,03,156 కార్డులు మంజూరు చేసింది. ఈ ఏడాది జూలై 25వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం కొత్త కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించింది. పంద్రాగస్టు వరకూ 15 రోజులపాటు కొత్త కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించింది. అంతేనా.. కార్డుల మంజూరు ప్రక్రియను నిర్ణీత కాలానికే పరిమితం చేయకుండా.. నిరంతరాయంగా కొనసాగిస్తామని ప్రకటించింది. బియ్యంతోపాటు ఆరోగ్యశ్రీ, గృహజ్యోతి, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ తదితర పథకాలకు కూడా రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకుంటుండటంతో.. మంజూరు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని పౌర సరఫరాల శాఖకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో గడిచిన నెల రోజుల వ్యవధిలో కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ పెద్ద ఎత్తున చేపట్టారు. ఆగస్టు 15 నుంచి సెప్టెంబరు 15వ తేదీ (సోమవారం)నాటికి 1,51,492 కొత్త కార్డులను మంజూరు చేయటం విశేషం.

11.27 లక్షల కొత్త కార్డుల పంపిణీ

గత ప్రభుత్వ హయాంలోనూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త కార్డులు కావాలంటూ మొత్తం 18 లక్షల దరఖాస్తులు వచ్చిన సంగతి తెలిసిందే. వీటిలో రేవంత్ ప్రభుత్వం ఇప్పటి వరకు 11.27 లక్షల కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేసింది. ఇంకా సుమారు 2.50 లక్షల కుటుంబాలకు కార్డులు మంజూరు చేసే అవకాశాలున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. దరఖాస్తుల్లో తప్పులు దొర్లటం, కొన్ని ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయకపోవటం, సాంకేతిక సమస్యలు తలెత్తటంతో వీటిని పెండింగ్‌లో పెట్టినట్లు తెలిసింది. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి తెల్ల రేషన్ కార్డు మంజూరు చేస్తామని తెలిపారు. మండల, జిల్లాస్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్నామని, రాష్ట్రస్థాయిలో ప్రత్యేక ఐటీ సెల్ ఏర్పాటు చేసి.. కార్డుల మంజూరు, పంపిణీని పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ప్రభుత్వానికి అందిన 18 లక్షల దరఖాస్తుల్లో సుమారు 14 లక్షల కుటుంబాలు కొత్త రేషన్ కార్డులకు అర్హత సాధించినట్లు తెలిపారు. ఇప్పటికీ ఎవరైనా దరఖాస్తులు చేసుకోనివారు ఉంటే... మీ- సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

కప్పింది కాంగ్రెస్ కండువానే!

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొంది. ఆ 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లుగా తమ వద్ద ఆధారాలున్నాయంటూ పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సోమవారం అసెంబ్లీ అదనపు కార్యదర్శిని కలిసి సమర్పించారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుపై స్పందించాలని సుప్రీంకోర్టు సూచించిన నేపథ్యంలో.. పది మంది ఎమ్మెల్యేలకు అసెంబ్లీ స్పీకర్ నోటీసులు జారీ చేయడం, అందుకు ఎనిమిది మంది ఎమ్మెల్యేలు వివరణ ఇస్తూ తాము పార్టీ మారలేదని, బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నామని చెప్పడం తెలిసిందే. నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాము సీఎంను కలిశామని వారు స్పీకర్‌కు తెలిపారు. మరో ఇద్దరు ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్ తమకు మరింత గడువు కావాలని స్పీకర్‌ను కోరినట్లు తెలిసింది. కాగా, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఇచ్చిన సమాధానాలను స్పీకర్ బీఆర్ఎస్‌కు పంపించి ఆ పార్టీ వివరణ కోరారు. ఈ మేరకు వివరణ ఇచ్చేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లారు. అయితే స్పీకర్ ప్రసాద్ కుమార్, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచారి.. బెంగళూరులో ఓ సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లడంతో అసెంబ్లీ అదనపు కార్యదర్శి ఉపేందర్‌రెడ్డిని కలిశారు. పది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారారని, అందుకు ఆధారాలు ఇవేనంటూ ఫొటోలు, పత్రికా ప్రకటనలు, సోషల్ మీడియాలో ప్రచారం, ఇతర ఆధారాలు అందజేశారు.

ఫొటోలు దిగారు.. ప్రకటనలు ఇచ్చారు..

"జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ ఒకరోజు ట్వీట్ పెట్టారు. నేను జగిత్యాలలో బయలుదేరాను.. ఇక్కడి నుంచి నేరుగా గాంధీభవన్‌కు వెళ్తున్నా అని. ఇదిగో సాక్ష్యం! పోచారం శ్రీనివాస్‌రెడ్డి బహిరంగంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలను గెలిపించాలని బాన్సువాడ నియోజకవర్గంలో నిర్వహించిన ఆ పార్టీ కార్యకర్తల సమావేశంలో పిలుపునిచ్చారు. ఆయన రాహుల్‌గాంధీని కలిసి ఫొటో కూడా దిగారు. ఇదిగో ఆ ఫొటో! గద్వాల ఎమ్మెల్యేల బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఒకరోజు పత్రికలో ప్రకటన కూడా ఇచ్చారు. అందులో కాంగ్రెస్ నాయకుల పేర్లు, ఫొటోలు ఉన్నాయి చూడండి! గూడెం మహిపాల్‌రెడ్డి, తెల్లం వెంకట్రావు, కాలె యాదయ్య కూడా కాంగ్రెస్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు" అంటూ పలు రుజువులను అసెంబ్లీ అదనపు కార్యదర్శికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సమర్పించారు. మొత్తం ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు సంబంధించి రుజువులు సమర్పించాల్సి ఉండగా.. ఆరుగురిపైనే సాక్ష్యాలు అందజేశారు. అరికెపూడి గాంధీ, ప్రకాశ్ గౌడ్‌పై ఫిర్యాదు చేసిన కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ విదేశీ పర్యటనలో ఉన్న కారణంగా.. ఆయన వచ్చిన వెంటనే ఈ ఇద్దరికి సంబంధించిన ఆధారాలు, సమాధానాలను అందజేస్తామని బీఆర్ఎస్ పార్టీ తెలిపింది.

కలిసిన వారికల్లా కండువాలు ఎందుకు కప్పలేదు?

"ఆ ఎమ్మెల్యేలు చెబుతున్నట్లే ఒకవేళ వారు కాంగ్రెస్‌లో చేరకపోతే.. ఒక్కసారి కూడా ఆ విషయాన్ని ఎందుకు ఖండించలేదు? పార్టీ మారలేదని, కేవలం అభివృద్ధి కోసమే సీఎంను కలిశామని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసి ఎందుకు చెప్పలేదు? బీఆర్ఎస్‌కే చెందిన హరీశ్‌రావు, పద్మారావుగౌడ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి కూడా సీఎంను కలిశారు కదా? మరి సీఎం వారికెందుకు కండువాలు కప్పలేదు? బీజేపీ ఎమ్మెల్యేలు సైతం సీఎంను కలిశారు. వారికీ కండువా కప్పలేదు ఎందుకు? ఆయనను కలిసిన వారికల్లా ఎందుకు కండువాలు కప్పలేదు?" అని బీఆర్ఎస్ ప్రశ్నిస్తోంది. ఆ పార్టీ ఎమ్మెల్యేలు జి.జగదీశ్‌రెడ్డి, వివేకానందగౌడ్, చింత ప్రభాకర్ అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. ఆ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరకుండా బీఆర్ఎస్‌లోనే ఉంటే.. పార్టీ కార్యక్రమాల్లో ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. పార్టీ మారనప్పుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి.. రాహుల్‌గాంధీని ఎందుకు కలిశారని, రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా ఎందుకు కప్పుకొన్నారని నిలదీశారు. ఇప్పుడు అది పార్టీ కండువా కాదని ఎందుకు చెబుతున్నారో.. వారే సమాధానం చెప్పాలన్నారు. వారంతా బీఆర్ఎస్‌లోనే ఉంటే రేవంత్‌రెడ్డి కార్యక్రమాల్లో ఎందుకు పాల్గొంటున్నారని ప్రశ్నించారు.



నాచారంలోని శ్రీ సత్య ఆస్పత్రి వద్ద వైద్యుల నిర్లక్ష్య వైఖరిని పోలీసులకు వివరిస్తున్న మృతురాలి బంధువులు

ఆస్పత్రి నిర్లక్ష్యానికి యువతి నిండు ప్రాణం బలి

- నాచారంలోని శ్రీసత్య ల్యాప్రోస్కోపిక్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో అపెండిసైటిస్ ఆపరేషన్ నిర్వహణ
- కొద్దిసేపటికే లంగ్స్‌లో నీరు, రక్తం.. నెత్తుటి వాంతులు
- సమాచారం ఇచ్చినా స్పందించని వైద్యులు, నిర్వాహకులు
- కార్పొరేట్ ఆస్పత్రికి తరలింపు.. చికిత్స పొందుతూ మృతి
- శ్రీసత్య ఆస్పత్రి ఎదుట బాధిత కుటుంబసభ్యుల ఆందోళన

తార్నాక, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి అని ఆస్పత్రికి వెళితే ఆ యువతి ప్రాణాలే పోయాయి. అపెండిసైటిస్ ఆపరేషన్ చేయాలని చెప్పిన వైద్యుడు శస్త్రచికిత్స నిర్వహించాక కొన్ని గంటలకే ఆమె ఆరోగ్యం వికటించింది. చివరికి ఊపిరితిత్తుల్లోకి నీరు, రక్తం చేరి.. రక్తపువాంతులు కావడంతో బాధితురాలు గుండెపోటుతో మృతిచెందింది. ఆస్పత్రి నిర్వాహకులు, శస్త్రచికిత్స చేసిన వైద్యుడి నిర్లక్ష్యంతో 20 ఏళ్లకే ప్రాణాలు కోల్పోయిందా యువతి. మృతురాలు రేణికుంట శైలజ (20). యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం చల్లూరు గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థిని. శనివారం (13న) ఆమెకు కడుపునొప్పి రావడంతో కుటుంబసభ్యులు నాచారంలోని శ్రీసత్య ల్యాప్రోస్కోపిక్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యుడు శ్రీనివాస్ గౌడ్, ఆమెకు అపెండిసైటిస్ ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. అడ్మిట్ చేసుకొని.. ఆదివారం ఉదయం 11:30కు శస్త్రచికిత్స పూర్తిచేశారు. అయితే ఆరోజు సాయంత్రం 5:30 వరకు ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉన్నా ఒక్కసారిగా విపరీతమైన దగ్గు మొదలైంది. ఆపై రక్తపువాంతులు చేసుకోవడంతో కుటుంబసభ్యులు కంగారుపడి ఆస్పత్రి నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ సమయంలో ఆస్పత్రిలో వైద్యులెవరూ అందుబాటులో లేరు. శైలజ పరిస్థితి విషమిస్తోందని సమాచారం ఇచ్చినా ఆపరేషన్ చేసిన వైద్యుడు శ్రీనివాస్ గౌడ్ గానీ, ఇతర వైద్యులు గానీ అక్కడికి రాలేదు. ఆమె పరిస్థితి మరింత విషమిస్తుండటంతో ఆస్పత్రి సిబ్బందే వైద్యం మొదలుపెట్టారు. అయితే ఆమె పరిస్థితి మెరుగుపడకపోగా మరింత విషమించింది. దీంతో చేతులెత్తేసిన సిబ్బంది, మరో ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించి.. అంబులెన్స్ ఏర్పాటు చేశారు. అయితే అంబులెన్స్‌లో ఎలాంటి కనీస వైద్య సౌకర్యాలు, ఆక్సిజన్ కూడా లేకపోవడంతో బాధితురాలు శ్వాస తీసుకోవడం కూడా కష్టమైంది. ఆపై సికింద్రాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. ఆమె పరిస్థితి క్లిష్టంగా ఉందని చెప్పి చేర్చుకునేందుకు నిర్వాహకులు నిరాకరించారు. దాంతో.. సోమవారం తెల్లవారుజామున 6గంటల సమయానికి కుటుంబసభ్యులు ఆమెను మెడికవర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటి నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు ఆమెను బతికించేందుకు వైద్యులు ప్రయత్నించారు. కానీ ఊపిరితిత్తుల్లోకి నీరు, రక్తం చేరడంతో పాటు పలుమార్లు గుండెపోటుకు గురవడంతో రాత్రి 8గంటలకు శైలజ మృతిచెందింది. తొలుత.. ఆమెకు శస్త్రచికిత్స చేసిన వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, పరిస్థితి విషమించినప్పుడు కనీసం మంచి ఆస్పత్రికి కూడా రిఫర్ చేయకపోవడంతోనే ఆమె మృతిచెందినట్లు కుటుంబసభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు నాచారంలోని శ్రీసత్య ఆస్పత్రి ఎదుట సోమవారం అర్ధరాత్రి ఆందోళనకు దిగారు. శైలజ మృతికి కారణమైన వైద్యుడిని అరెస్టు చేయాలని, ఆయన లైసెన్సును రద్దు చేయాలని, ఆస్పత్రిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి: విద్యాసాగర్‌రావు

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నాడు పార్టీలకు అతీతంగా తెలంగాణ విమోచన ఉద్యమం జరిగిందని మహారాష్ట్ర మాజీ గవర్నర్, బీజేపీ సీనియర్ నేత సీహెచ్ విద్యాసాగర్‌రావు అన్నారు. కమ్యూనిస్టు నేత రావినారాయణరెడ్డి నేతృత్వంలో మొట్టమొదటి సత్యాగ్రహం జరిగితే అందులో ఆర్యసమాజ్, కాంగ్రెస్ వారితో పాటు అన్ని పార్టీల వాళ్లూ పాలుపంచుకున్నారని.. ఈ ఉద్యమ క్రమంలో ఎంతోమంది తమ ప్రాణాలను త్యాగం చేశారని పేర్కొన్నారు. బీజేపీ ఒత్తిడికి తలొగ్గి సెప్టెంబరు 17ను అధికారికంగా నిర్వహించేందుకు నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మెట్టుదిగినా.. ఈ కార్యక్రమం పేరు మాత్రం మార్చాయన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా గుర్తిస్తూ గతేడాది కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీచేసిందని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని సీఎం రేవంత్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో భాస్కర యోగి రచించిన "సెప్టెంబరు 17 ముమ్మాటికీ విమోచనే" అనే పుస్తకాన్ని విద్యాసాగర్ రావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ 27 ఏళ్లపాటు ఉద్యమం చేసినట్లు తెలిపారు. 1998లో నిర్వహించిన బహిరంగసభకు నాటి పార్టీ అగ్రనేత ఎల్‌కే అద్వాణీ హాజరై 120 మంది సమరయోధులకు స్వయంగా సన్మానం చేశారని విద్యాసాగర్‌రావు గుర్తు చేశారు.

పింఛన్‌కు 'సర్వీస్ బ్రేక్' అడ్డు కాదు

- ఏపీ 'విభజన' ఉద్యోగులకు సుప్రీంలో స్వల్ప ఊరట

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజనలో భాగంగా తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ అయిన ప్రభుత్వ ఉద్యోగులకు సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట లభించింది. ఉద్యోగంలో చేరడంలో జరిగిన సర్వీస్ బ్రేక్ అనేది పింఛన్ ప్రయోజనాలకు అడ్డంకి కాదని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. అయితే, పనిచేయని కాలానికి జీతం ఇవ్వాలనే విజ్ఞప్తిని మాత్రం తోసిపుచ్చింది. 'నో వర్క్-నో పే' సూత్రం వర్తిస్తుందని తెలిపింది. పిటిషన్‌ను కొట్టివేసింది. 2014లో రాష్ట్ర విభజన సమయంలో కొందరు ఉద్యోగులను తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించారు. అయితే, తెలంగాణలో పదవీ విరమణ వయసు 58 ఏళ్లకు కుదించగా, ఏపీలో మాత్రం 60 ఏళ్ల పదవీ విరమణ వయసు అమలులో ఉంది. ఈ నేపథ్యంలో కొందరిని ఏపీలో మళ్లీ విధుల్లోకి తీసుకునే క్రమంలో కొంత పాలనాపరమైన జాప్యం జరిగింది. ఈ ఖాళీ కాలాన్ని సర్వీసుగా పరిగణించి, పూర్తికాలపు వేతనం చెల్లించాలని కోరుతూ ఈశ్వరయ్య, మరికొందరు ఫిబ్రవరి 17న సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం ఎదుట ఆ పిటిషన్ సోమవారం విచారణకు వచ్చింది. ఇరుపక్షాల వాదనల అనంతరం.. ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. పనిచేయని కాలానికి జీతం చెల్లించాలనే నిబంధన ఏదీ చట్టంలో లేదని స్పష్టం చేసింది. అందువల్ల, పనిచేయని కాలానికి జీతం ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పింది. అయితే, అలాంటి ఉద్యోగుల తప్పు లేకుండానే పరిపాలనా జాప్యం వల్ల వారి పింఛన్ ప్రయోజనాలకు నష్టం వాటిల్లడం సరికాదని ధర్మాసనం అభిప్రాయపడింది. అలాంటి ఉద్యోగుల పింఛన్ లెక్కింపు కోసం సర్వీస్ కొనసాగినట్టు పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

30 వరకు అక్రమ మద్యంపై ఎక్సైజ్ స్పెషల్ డ్రైవ్

దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా అక్రమ మద్యం అమ్మకాలను అరికట్టేందుకు ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులతో సమావేశం నిర్వహించి తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించిన నేపథ్యంలో కార్యాచరణ రూపొందించింది. ఈ నెల 30 వరకు పక్షం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు చేపట్టాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం ఆదేశాలు జారీ చేశారు. కల్తీ మద్యం, నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్, నాటుసారా వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

సర్కారీ ప్లీడర్ల తొలగింపులో జోక్యం చేసుకోం

ప్రభుత్వం, న్యాయవాదులకు మధ్య నమ్మకం ముఖ్యం.. బకాయిలు రెండు నెలల్లో చెల్లించాల్సిందే

- బీఆర్ఎస్ హయాంలో నియమించిన ప్రభుత్వ ప్లీడర్లను తొలగించిన కేసులో సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లా న్యాయస్థానాల్లో నియమించిన గవర్నమెంట్ ప్లీడర్లు, స్పెషల్, అసిస్టెంట్, అడిషనల్ గవర్నమెంట్ ప్లీడర్లను కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించడంపై తాము జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ప్రభుత్వానికి, న్యాయవాదులకు మధ్య సంబంధం 'నమ్మకం' మీద ఆధారపడి ఉంటుందని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. అయితే, వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన బకాయిలను మాత్రం రెండునెలల్లో చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. గత బీఆర్ఎస్ హయాంలో జిల్లా న్యాయస్థానాల్లో ప్రభుత్వ ప్లీడర్ల నియామకాలు నిబంధనల ప్రకారం జరగలేదని పేర్కొంటూ.. వారిలో కొంతమందిని కాంగ్రెస్ సర్కారు తొలగించిన సంగతి తెలిసిందే. సర్కారు నిర్ణయాన్ని వారిలో కొందరు హైకోర్టులో సవాల్ చేశారు. తమను కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాలు మారడం వల్ల వ్యవస్థలు లేదా సంస్థల స్వభావం మారదని, కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం తమను తొలగించడం సరికాదని పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే.. ప్రభుత్వాలు తమకు నచ్చినవారిని ప్లీడర్లుగా నియమించుకునే స్వేచ్ఛ ఉంటుందని హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పునిచ్చింది. ఈ అంశంలో కలగజేసుకోవడం అంటే.. పరిపాలనలో జోక్యం చేసుకోవడం, ప్రభుత్వ నిర్ణయాలకు సంకెళ్లు వేయడమేనని అభిప్రాయపడింది. జీవోఎంఎస్ నం.187లోని 9వ నిబంధన ప్రకారం ప్రభుత్వ ప్లీడర్లను నెల రోజుల నోటీస్ పీరియడ్ లేదా నెలరోజుల గౌరవ వేతనంతో తొలగించవచ్చని హైకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. దీనిపై వారు డివిజన్ బెంచ్‌కు వెళ్లగా.. సింగిల్ బెంచ్ తీర్పునే డివిజన్ బెంచ్ సమర్థించింది. దీంతో హైకోర్టు తీర్పును యాండాల ప్రదీప్ సహా 19 మంది ఫిబ్రవరి 27న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్ సోమవారం జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. ఇరుపక్షాల వాదనలూ విన్న ధర్మాసనం..ఈ విషయంలో కలుగజేసుకోలేమని చెబుతూ కీలక తీర్పును వెలువరించింది. ప్రభుత్వానికి.. ప్రభుత్వ న్యాయవాదులకు మధ్య నమ్మకం ఎంతో ముఖ్యమని.. గత ప్రభుత్వంలో నియమితులైన ప్లీడర్లపై ప్రస్తుత ప్రభుత్వానికి నమ్మకం లేకుంటే.. ముఖ్యమైన, సున్నితమైన కేసులను ఎలా అప్పగిస్తుందని ప్రశ్నించింది. కాగా.. సర్కారు తొలగించిన ప్లీడర్లు వారికి రావాల్సిన గౌరవ వేతనంపై ఆధారపడి జీవిస్తున్నారని, బకాయిలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ధర్మాసనం.. పిటిషనర్లు తమకు రావాల్సిన బకాయిల వివరాలతో కూడిన సమగ్ర వినతిపత్రాన్ని కలెక్టర్లకు సమర్పించాలని సూచించింది. వినతిపత్రం అందిన రెండునెలల్లోగా ప్రభుత్వం వారికి పూర్తి బకాయిలు చెల్లించాలని ఆదేశించింది.

ఉన్నత విద్యా సంస్థలకు 600 కోట్లు!

(మొదటిపేజీ తరువాయి)

సీఎస్ రామకృష్ణారావు, ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఇతర ఉన్నతాధికారులు సమాఖ్య ప్రతినిధులతో మళ్లీ చర్చలు జరిపారు. సాయంత్రం భట్టి, శ్రీధర్‌బాబు, ఉత్తమ్ చర్చల్లో పాల్గొన్నారు. సీఎం పేర్కొన్నట్లుగా రూ.600 కోట్లు తక్షణమే విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు భట్టి ప్రకటించడంతో సమ్మె విరమిస్తామని యాజమాన్యాలు తెలిపాయి. అనంతరం మంత్రులు, సంఘాల ప్రతినిధులు మీడియా సమావేశంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, చిత్రంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్, సమాఖ్య ప్రతినిధులు

విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యం: భట్టి

ఫీజు రీయింబర్స్‌మెంట్ తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైన అంశమని డిప్యూటీ సీఎం భట్టి చెప్పారు. బీఆర్ఎస్ సర్కారు గత పదేళ్లలో ఈ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిందని ఆరోపించారు. రూ.వేల కోట్ల బకాయిల భారాన్ని తమకు వారసత్వంగా ఇచ్చిందని విమర్శించారు. వారు విచ్ఛిన్నం చేసిన వ్యవస్థలను బాగుచేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని చెప్పారు. కళాశాలల యాజమాన్యాలకు ఇప్పటికే అందించిన టోకెన్లకు సంబంధించి రూ.600 కోట్లు వెంటనే విడుదల చేయాలని, మిగతా బకాయిలు కూడా ప్రతినెలా చెల్లించేలా చూడాలని సీఎం నిర్ణయించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఫీజు రీయింబర్స్‌మెంట్ హేతుబద్ధీకరణపై సలహాల కోసం ఓ కమిటీ వేయాలని సీఎస్‌కు ఆదేశాలు ఇచ్చినట్లు భట్టి చెప్పారు. మూడు రోజుల్లో అధికారులతో కమిటీని ప్రకటిస్తామన్నారు. ఇందులో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో పాటు యాజమాన్యాల నుంచి కూడా కొందరిని సభ్యులుగా తీసుకుంటామని చెప్పారు. రీయింబర్స్‌మెంట్ సమస్య మళ్లీ ఉత్పన్నం కాకుండా, యాజమాన్యాలకు ఇబ్బంది లేకుండా కమిటీ సలహాలు ఇస్తుందని అన్నారు.

ప్రైవేటు కాలేజీల ఆందోళనలకు సంపూర్ణ మద్దతు: రాంచందర్‌రావు

- మాటలకు, చేతలకు పొంతన లేదు: ఈటల

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, విద్యా వ్యవస్థను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ మొత్తాన్ని విడుదల చేయాలని కోరుతూ ప్రైవేట్ కాలేజీలు చేస్తున్న ఆందోళనకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నుంచి ఒక్క పైసా కూడా రీయింబర్స్‌మెంటు బకాయిలు ఇవ్వలేదని, బకాయిలు భారీగా పెరిగిపోవడంతో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితులు ఏర్పడ్డాయని, కాలేజీలను తాత్కాలికంగా మూసివేయాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. కాగా, ప్రభుత్వ మాటలకు, చేతలకు పొంతన లేదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. హుజూరాబాద్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండేళ్ల ఫీజులు బకాయి పెడితే.. ఈ సర్కారు ఇప్పటి వరకూ పైసా ఇవ్వలేదని మండిపడ్డారు.

మా కష్టాలు అర్థం చేసుకున్నారు

మా కష్టాలు అర్థం చేసుకున్నారు. పాత ప్రభుత్వం పాపాలు నెత్తినపడ్డా కూడా.. ప్రభుత్వం మాపై దయ చూపింది. రూ.600 కోట్లు విడుదల చేస్తామన్నందుకు ధన్యవాదాలు. ప్రభుత్వ నిర్ణయంతో ప్రైవేటు కాలేజీల అధ్యాపకులు, సిబ్బంది కూడా దసరా పండగను సంతోషంగా జరుపుకొంటారు. సమ్మె విరమిస్తున్నాం. ప్రభుత్వానికి సహకరిస్తాం.

- రమేశ్‌బాబు, ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల సమాఖ్య చైర్మన్



నేటి అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ సేవల నిలిపివేత

- నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ ప్రకటన
- రూ.100 కోట్లు విడుదల చేసిన సర్కారు
- అయినా.. మెట్టు దిగని ప్రైవేటు ఆస్పత్రులు

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోనున్నాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి ఈ సేవలను నిలిపివేయనున్నట్లు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాకేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. గత ఏడాది నుంచి ఆరోగ్యశ్రీ, 18 నెలలుగా ఈహెచ్ఎస్ పథకానికి సంబంధించిన బకాయిలు చెల్లించడం లేదని వివరించారు. దీంతో ఆస్పత్రుల నిర్వహణ కష్టతరంగా మారిందని వెల్లడించారు. మరోవైపు నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ ట్రస్టు సోమవారం రూ.100కోట్లు చెల్లించింది. అయినా, ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రులు మాత్రం వైద్య సేవలను నిలిపివేస్తామని స్పష్టం చేశాయి. ఈ నెల 1 నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తామని ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవోకు గత నెల 21న నెట్‌వర్క్ ఆస్పత్రులు లేఖలు రాశాయి. దాంతో ప్రభుత్వం ఆగస్టు 30న నెట్‌వర్క్ ఆస్పత్రుల ప్రతినిధులతో చర్చలు జరిపింది. ఒకటి రెండు రోజుల్లోనే కొంత మొత్తాన్ని చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆరోగ్యశ్రీ సేవల నిలిపివేతను వాయిదా వేసుకున్నారు. కానీ, 15రోజులైనా ఇచ్చిన హామీ నెరవేరకపోవడంతో సేవలు నిలిపివేయాల్సి వస్తోందని ప్రైవేటు ఆస్పత్రులు చెబుతున్నాయి. రూ.1200-1400 కోట్ల బకాయిలు ఉన్నట్లు చెబుతున్నాయి. కాగా, ప్రైవేటు ఆస్పత్రులకు రూ.530కోట్లు, ప్రభుత్వ ఆస్పత్రులకు రూ.550కోట్లు కలిపి మొత్తం రూ.1100కోట్లు చెల్లించాల్సి ఉందని ఆరోగ్యశ్రీ ట్రస్టు వర్గాలు పేర్కొన్నాయి.

ఆయుష్ వైద్యులు అల్లోపతి చికిత్స చేయడం మోసం కాదు

- వారిపై కేసులు పెట్టే అర్హత తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కు లేదు: హైకోర్టు
- ఆయుష్ వైద్యులపై కేసుల కొట్టివేత

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ (బీఏఎంఎస్) డిగ్రీ కలిగి, చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆయుర్వేద వైద్యులు అల్లోపతి చికిత్స చేయడం మోసం (చీటింగ్) కిందకు రాదని హైకోర్టు పేర్కొంది. మెడిసిన్‌లో ఎలాంటి విద్యార్హత, గుర్తింపు లేదా రిజిస్ట్రేషన్ లేని వ్యక్తులు అల్లోపతి చికిత్స చేస్తే మాత్రం క్రిమినల్ కేసులు పెట్టవచ్చని తెలిపింది. ప్రస్తుత కేసులో ఆయుర్వేద వైద్యులు ఆధునిక పద్ధతుల్లో చికిత్స చేస్తున్నారన్నది ప్రధాన ఆరోపణ కాబట్టి వారిపై సంబంధిత ఆయుష్ సంస్థకు ఫిర్యాదు చేయాలే తప్ప నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేసి, క్రిమినల్ కేసులు పెట్టే అర్హత తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కు లేదని స్పష్టం చేసింది. సంగారెడ్డిలోని వసంత్‌నగర్‌కు చెందిన ఆయుర్వేద వైద్యుడు హెచ్.లోకేశ్ సహా కేపీహెచ్‌బీ, సంగారెడ్డి రూరల్‌కు చెందిన పలువురు ఆయుర్వేద వైద్యులు రోగులకు అల్లోపతి మందులు ఇస్తున్నారని ఆరోపిస్తూ తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదు చేశారు. చీటింగ్ సహా వివిధ సెక్షన్ల కింద నమోదైన క్రిమినల్ కేసులను కొట్టేయాలని కోరుతూ ఆయుర్వేద డాక్టర్లు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ ఎన్.తుకారాంజీ ధర్మాసనం విచారణ చేపట్టింది. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ ప్రకారం ఆయుర్వేద డాక్టర్లకు ఆధునిక వైద్యంలో కూడా శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్న నేపథ్యంలో ఈ అంశాన్నీ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని హైకోర్టు తెలిపింది. అలాగే జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) చట్టంలోని సెక్షన్ 54 ప్రకారం ఎన్ఎంసీకి లేదా రాష్ట్ర మెడికల్ కౌన్సిల్‌కు చెందిన అధీకృత అధికారి ఫిర్యాదు చేస్తేనే దానికి చట్టబద్ధత ఉంటుందని.. ప్రస్తుత కేసులో పిటిషనర్లపై ఇచ్చిన ఫిర్యాదులో ప్రధానంగా ఆ లోపం ఉందని పేర్కొంది. అలాగే ఆయుర్వేద డాక్టర్ అల్లోపతి మందులు ఇచ్చారనే అంశం మోసం కిందకు రాదని స్పష్టం చేసింది. ఆయుర్వేద వైద్యులపై పోలీసులు నమోదు చేసిన క్రిమినల్ కేసులను కొట్టేస్తున్నట్లు ప్రకటించింది. అయితే పిటిషనర్లు వృత్తిపరంగా తప్పు చేశారని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ భావిస్తే చట్టప్రకారం శాఖాపరమైన చర్యలు చేపట్టవచ్చని తెలిపింది.

గచ్చిబౌలిలోని ఎన్ఐటీహెచ్ఎమ్‌లో ఎంబీఏ కోర్సు

గచ్చిబౌలిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (ఎన్ఐటీహెచ్ఎమ్)లో రెండు సంవత్సరాల ఎంబీఏ కోర్సు ప్రారంభానికి ఉన్నత విద్యావిభాగం (సాంకేతిక విద్య) అనుమతి ఇచ్చింది. ఈ మేరకు సోమవారం జీవో నెంబర్ 133ను విడుదల చేసింది. ఈ కోర్సు 2025 - 26 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం కానుందని తెలిపింది.

మంచం కోసం వెళ్లి ఒకరు.. అతన్ని కాపాడబోయి ఇంకొకరు..

హైదరాబాద్‌లోని మాంగర్ బస్తీలో వరద ఉధృతికి యువకులు రామ్, అర్జున్ గల్లంతు

- 24గంటలు గడిచినా దొరకని ఆచూకీ
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన హైదరాబాద్ కలెక్టర్, హైడ్రా కమిషనర్



రామ్ ఇంటి ముందు ఉన్న 5ఫీట్ల గల్లీ

అఫ్జల్‌గంజ్/హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి వరదలో కొట్టుకుపోయిన ఇద్దరు రామ్(32), అర్జున్(26)ల ఆచూకీ ఇంకా తెలియలేదు. మల్లేపల్లి మాంగర్ బస్తీకి చెందిన రామ్, అర్జున్ ఇద్దరూ బంధువులు. రామ్ మేకల చర్మం అమ్మి వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. అర్జున్ కూడా అతనితో కలిసి పనికివెళ్లేవాడు. వీరు అఫ్జల్‌సాగర్ నాలాపైన నివాసాలను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. హైదరాబాద్‌లో వర్షం కురిసినప్పుడల్లా ఎగువ ప్రాంతాల నుంచి వర్షం నీరు వీరి ఇంటి ముందున్న ఐదు ఫీట్ల చిన్నపాటి గల్లీగుండా పక్కనే ఉన్న అఫ్జల్‌సాగర్ నాలాలోకి వెళ్తుండేది. ఆదివారం ఆ గల్లీలో వరదలో తమ మంచం కొట్టుకుపోతుండగా రామ్ దాన్ని తీసుకురావడానికి నీళ్లలోకి వెళ్లాడు. నీటి ఉధృతికి కొట్టుకుపోయాడు. అతని భార్య కేకలు వేయడంతో రామ్‌ను కాపాడటానికి అర్జున్ వరద నీటిలోకి దిగాడు. దాదాపు 6ఫీట్ల ఎత్తుతో వరద రావడంతో ఇద్దరూ ఒక్కసారిగా అఫ్జల్‌సాగర్ నాలాలోకి పడిపోయారు. స్థానికులు ఎంత ప్రయత్నించినా వారి జాడ తెలియలేదు. దీంతో, హబీబ్‌నగర్ పోలీసులకు సమాచారమందించారు. వెంటనే డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగినప్పటికీ రామ్, అర్జున్‌ల ఆచూకీ దొరకలేదు. సోమవారం ఎన్‌డీఆర్ఎఫ్, హైడ్రా మూడు ప్రత్యేక బృందాలు రామ్, అర్జున్‌ల జాడ కోసం అఫ్జల్‌సాగర్ నాలా నుంచి మూసారాం నాలా వరకు వెతికారు. ఘటనా స్థలాన్ని స్థానిక ఎమ్మెల్యే మాజిద్ హుసేన్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ పరిశీలించారు. గల్లంతైన వారి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రభుత్వపరంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా హైదరాబాద్ కలెక్టర్ హరిచందన మాట్లాడుతూ.. బాధిత కుటుంబసభ్యులకు రూ.5లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామన్నారు. "అఫ్జల్‌సాగర్ నాలా పైన 140దాకా నివాసాలున్నాయి. గతంలో అనేక సార్లు వీరికి నోటీసులిచ్చాం. త్వరలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం" అని తెలిపారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ.. రెండు మూడు అక్రమ నిర్మాణాలు వరదకు అడ్డుపడ్డాయని, త్వరలో నాలా దగ్గర కొన్ని ఇళ్లను తొలగిస్తామని చెప్పారు. అమీర్‌పేట మైత్రీవనం దగ్గర ముంపు సమస్యను పరిష్కరించామని రంగనాథ్ ఈ సందర్భంగా చెప్పారు. ఇక్కడ 25 లారీల పూడిక తీసినట్టు వెల్లడించారు. నగరంలోని వరద నీటి కాలువల్లో ఇప్పటి వరకు 2,200 లారీల పూడిక తొలగించామని, ఇది నిరంతర ప్రక్రియ అని వివరించారు.

వారిది వేతన పోరాటం... వీరిది ఆకలి ఆరాటం

- సమ్మెలో ఆశ్రమ పాఠశాల వర్కర్లు
- వంటలు చేస్తున్న విద్యార్థినులు



కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి ఆశ్రమ పాఠశాలలో కూరగాయలు కోస్తున్న విద్యార్థినులు

వాంకిడి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో వేతనాలు పెంచాలని దినసరి కూలీలు రెండు రోజులుగా సమ్మె చేస్తుండడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. భోజనాలు వండటం, వడ్డించడం, పారిశుధ్య పనులు, గిన్నెలు శుభ్రం చేయటం, కూరగాయలు కోయడం వంటి పనులు విద్యార్థులే చేసుకుంటున్నారు. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి బాలికల ఆశ్రమ పాఠశాల, కెరమెరి మండలంలోని మోడి బాలికల ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న దినసరి కూలీలు సోమవారం సమ్మెలో ఉన్నారు. దీంతో విద్యార్థులు వండడం, పారిశుధ్య పనులు చేయడం, కూరగాయలు కోయడం, గిన్నెలు కడగడం వంటి పనులు చేశారు. విద్యార్థులే భోజనాలు వడ్డించుకున్నారు. రెగ్యులర్ వర్కర్లు ఒకరిద్దరు ఉన్న పాఠశాలల్లో విద్యార్థులు వారికి సాయం చేస్తున్నారు. వంటల పనుల్లో ఉన్న విద్యార్థులు పనులన్నీ ముగించుకొని పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 44 ఆశ్రమ పాఠశాలలు, నాలుగు పోస్టుమెట్రిక్ హాస్టళ్లు ఉండగా సుమారు 11,560 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్లకు నేటి నుంచి వెబ్ ఆప్షన్స్

- నోటిఫికేషన్ విడుదల చేసిన కాళోజీ వర్సిటీ

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూజీ వైద్య విద్యలో మొదటి విడత కన్వీనర్ కోటా ప్రవేశాల కోసం కాళోజీ హెల్త్ యూనివర్సిటీ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు, అన్ ఎయిడెడ్ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థులు వెబ్ ఆప్షన్ పెట్టుకోవాలని పేర్కొంది. అలాగే తుది అర్హుల జాబితాను విడుదల చేసింది. ఇందులో పేర్లున్న అభ్యర్థులు మంగళవారం (ఈ నెల 16న) నుంచి ఈ నెల 18 రాత్రి 11.30 గంటల వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని సూచించింది. హెల్త్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లోని వైద్య కళాశాలల జాబితాను చూసి ఎంపిక చేసుకోవాలని కోరింది. ప్రభుత్వ పరిధిలోని 35 వైద్య కళాశాలల్లో సీట్లను కన్వీనర్ కోటా ద్వారా భర్తీ చేయనున్నారు. ప్రైవేటు కళాశాలల్లోని మొత్తం సీట్లలో 50 శాతాన్ని ఈ కోటా ద్వారా వర్సిటీ భర్తీ చేస్తుంది. అలాగే నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు హెల్త్ వర్సిటీ నోటిఫికేషన్ జారీ చేసింది. టీజీఎప్‌సెట్-2025లో క్వాలిఫై అయిన అభ్యర్థులు 16 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.